ముహూర్తం
శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ చతుర్దశి, మ.1.42 వరకు అనంతరం పూర్ణిమ; నక్షత్రం: ఆరుద్ర ఉ.7.32 వరకు అనంతరం పునర్వసు తె 6.09 వరకు; అమృతకాలం: రా.తె. 4.00 నుండి 5.30 వరకు; వర్జ్యం: సా.6.50 నుండి 8.20 వరకు; దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ.12.00 నుండి 1.30 వరకు

Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి:57 • సంచిక:275 • ఆదివారం 20 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 6.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore


సూరత్ సమీపంలోని హజిరా వద్ద సాయుధ వ్యవస్థ ఆవరణలో వజ్ర హౌవిట్జర్ ట్యాంకర్‌లో ప్రధాని మోడీ

వజ్ర.. మేకిన్ ఇండియా

- దేశ రక్షణకు వజ్ర కవచం.. దేశీయ యుద్ధట్యాంక్
- కె-9 వజ్ర హౌవిట్జర్‌ను ఆవిష్కరించిన ప్రధాని మోడీ
- గుజరాత్‌లో తొలి ప్రైవేట్ యుద్ధట్యాంక్ కర్మాగారం
- యుద్ధట్యాంక్‌ల తయారీలో ప్రైవేట్ భాగస్వామ్యం గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్య

హజిరా (గుజరాత్) : భారత రక్షణరంగంలో భాగస్వామి అయినందుకు ఎల్ అండ్ టి సంస్థను ప్రధాని మోడీ అభినందించారు. మేకిన్ ఇండియాలో భాగంగా ఎల్ అండ్ టీ నిర్మించిన స్వయం చోదిత హౌవిట్జర్ యుద్ధ ట్యాంక్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం కే9 వజ్ర హౌవిట్జర్ యుద్ధట్యాంకును నడిపారు. గుజరాత్ లోని ఎల్‌అండ్‌టీ ఆయుధాగారాన్ని ప్రధాని ప్రారంభించారు. మేకిన్ ఇండియా పథకం ద్వారా రక్షణ రంగాన్ని పరిపుష్టం చేయాలన్నది మా సంకల్పం. ఇందుకు ప్రైవేటు రంగం తమవంతు కృషి అందిస్తుండటం సంతోషకరం. దేశ రక్షణలో ఎల్ అండ్ టీ భాగమైనందుకు వారికి ప్రత్యేక అభినందనలు అంటూ ప్రధాని ట్వీట్ చేశారు. యుద్ధ ట్యాంకును స్వయంగా నడుపుతన్న వీడియోను ప్రధాని ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణమంత్రి నిర్మల సీతారామన్, కొరియా రక్షణమంత్రి వాంగ్ జుంగ్ హాంగ్, లార్సన్ గ్రూప్ చైర్మన్ ఎఎం నాయక్ పాల్గొన్నారు. హౌవిట్జర్లను తయారుచేస్తున్న తొలి దేశీయ ప్రైవేటు సంస్థ లార్సన్ కావడం విశేషం. 2017లో 4500 కోట్ల రూపాయల రక్షణ కాంట్రాక్టును

10వ పేజీలో...

బీటీ రోడ్లతో ఊళ్లన్నీ మెరవాలి

నిధులు ఎన్నైనా ఇస్తా.. రోడ్లేయండి.. మరమ్మతులు చేయండి

3 లో

నీటి పారుదల ప్రాజెక్టుల తర్వాత రహదారుల నిర్మాణానికే ప్రభుత్వ ప్రాధాన్యత: సీఎం కేసీఆర్


తెలంగాణ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్... అటు ఇటు : అసెంబ్లీ స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ స్వామిగౌడ్

అన్నింటా తెలంగాణ అగ్రగామి

అందరికీ మనమే ఆదర్శం

- పేదల సంక్షేమం తొలి ప్రాధాన్యం
- ప్రతి ఎకరాకు సాగునీరు.. ప్రతి ఇంటికి తాగునీరు లక్ష్యం
- ఆర్థిక క్రమశిక్షణతో అద్భుత ఫలితాలు
- సగటు ఆర్థిక వృద్ధి రేటు 17.17
- బంగారు తెలంగాణకై పునరంకితం
- రాష్ట్ర అసెంబ్లీ ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం
- అవన్నీ అర్ధసత్యాలే: పొంగులేటి సుధాకర్‌రెడ్డి
- తెరాస మేనిఫెస్టో చదివారు
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శ

2 లో

అడవి బిడ్డల చెంతకు నేనొస్తా... తేలుస్తా పట్టాలిచ్చాకే తిరిగొస్తా

- అవసరమైతే అక్కడే పడుకుంటా
- ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక అథారిటీ
- ఆదివాసీ ఎమ్మెల్యేలకు సీఎం కేసీఆర్ భరోసా


సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ ఆదివాసీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదివాసీప్రాంతాల అభివృద్ధికి అవసరమైతే ప్రత్యేక అథారిటీ ఏర్పాటుచేసి అభివృద్ధి పరుస్తానని, పోడు సమస్యల పరిష్కారానికి తానే ఆదివాసీ ప్రాంతాలకు స్వయంగా వస్తానని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హామీనిచ్చారు. శనివారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం ఛాంబర్‌లో పినపాక ఎమ్మెల్యే రేగాకాంతారావు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు సీతక్క, పొదెం వీరయ్య, ఆత్రంసక్కులు కలిశారు. ఏజెన్సీ ప్రాంతంలో పోడుభూముల పట్టాల సమస్య, గిరిజన తెగల మధ్య

3వ పేజీలో...


కె.విశ్వంత్


జయంత్ ఫణి సాయి


ఎ.సాయి కిరణ్


బి.కార్తికేయ

జేఈఈ మెయిన్‌లో తెలంగాణ మెరికెలు

10 లో

కోల్‌కతాలో గర్జన

- ప్రధాని మోడీపై విపక్షాల మూకుమ్మడి ధ్వజం
- రోజులు దగ్గర పడ్డాయని.. గడువు తీరిపోయిందని విమర్శ
- మమత ఇలాకాలో బీజేపీకి వ్యతిరేకంగా సింహనాదం
- రెండో స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధం కావాలని పిలుపు
- తదుపరి ర్యాలీ అమరావతిలో.. ఆహ్వానం పలికిన చంద్రబాబు
- 20 పైచిలుకు పార్టీల అగ్రనేతలతో మమత మెగార్యాలీ

11 లో

కోల్‌కతా ర్యాలీలో ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, చంద్రబాబునాయుడు, కుమారస్వామి, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్


ఔరా..!


దోపిడీదారులంతా జట్టు కట్టారు



10 లో

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నవారే రక్షిస్తామంటున్నారు

కోల్‌కతా ర్యాలీపై ప్రధాని మోడీ విమర్శ

రైతుబంధు అందరూ అమలు చేయాలి

- ఆంధ్రప్రభ ఇంటర్వ్యూలో అన్నా హజారే

9 లో



గురి చూసి కొట్టండి

- లక్ష్యాన్ని ఎంచుకొని పనిచేయాలి
- యువతకు అన్నా హజారే పిలుపు
- ఐక్య పోరాటంతోనే ఫలితం : కవిత



అంతర్జాతీయ యువనాయకత్వ సదస్సు ప్రారంభోత్సవంలో సామాజికవేత్త అన్నా హజారే, ఎంపీ కవిత

9లో

అన్నింటా తెలంగాణ అగ్రగామి

అందరికీ మనమే ఆదర్శం

● పేదల సంక్షేమం తొలి ప్రాధాన్యం ● ప్రతి ఎకరాకూ సాగునీరు.. ప్రతి ఇంటికీ తాగునీరు లక్ష్యం ● ఆర్థిక క్రమశిక్షణతో అద్భుత ఫలితాలు ● సగటు ఆర్థికవృద్ధి రేటు 17.17 ● బంగారు తెలంగాణ కోసం పునరంకితం ● శాసనసభలో గవర్నర్ నరసింహన్





హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం దాదాపు అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిచిందని, దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని గవర్నర్ నరసింహన్ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతూనే సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించే భారీ ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టిందని, అనేక అడ్డంకులు అధిగమించి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు తెచ్చి పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. తెలంగాణ వరదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించిన కేంద్ర జలసంఘం ప్రభుత్వ కృషిని కొనియాడిందని గుర్తుచేశారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.77,777 కోట్లు నీటి పారుదల రంగానికి ఖర్చు చేసిందని, రానున్న కాలంలో మరో రూ.1,17,000 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఈ ఐదేళ్ల కాలంలో పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం పని చేస్తుందని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్ర శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి శనివారం ఆయన ప్రసంగించారు. ముందుగా తెలుగులో ప్రసంగం ప్రారంభించి, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, చివరగా బంగారు తెలంగాణ సాధన దిశలో ప్రభుత్వం పునరంకితం అవుతుందంటూ తెలుగు పలుకులతో ముగించారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, అవినీతిరహితమైన పాలనను అందించడంలో ప్రభుత్వం గొప్ప విజయం సాధించింది. దీంతో రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగాయి. దాంతో తెలంగాణ 17.17 సగటు వార్షిక వృద్ధిరే టు సాధించింది. జీఎస్‌టి వసూళ్ళలో కూడా రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. పేద ప్రజానీకానికి జీవన భద్రత కల్పించేందుకు వృద్ధులు, వితంతువులు, నిరుద్యోగులు తదితర వర్గాల వారికి పెన్షన్ల మొత్తాన్ని పెంచామని గుర్తుచేశారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత వయోపరిమితిని 57 ఏళ్ళకు తగ్గించామని చెప్పారు. పేద ఆడ పిల్లల వివాహానికి రూ.లక్షా 116 సహాయం అందిస్తున్నాము. సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజల దీవెనలతోనే తెరాస పార్టీ అత్యధిక మెజారిటీతో రెండోసారి అధికారంలోకి వచ్చింది. చట్టసభల్లో బీసీలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్నామని, ఎస్టీలకు 10 శాతం, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రతి ఇంటికి తాగునీరు కల్పించేందుకు మిషన్ భగీరథ చేపట్టాం. ఇప్పటికే 56 మునిసిపాలిటీలు, 18,612 జనావాసాలకు తాగు నీరు అందిస్తున్నాం. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మంచినీరు సరఫరా జరుగుతుంది. మిషన్ కాకతీయ పథకం కింద నాలుగు దశల్లో 20,171 చెరువులను పునరుద్ధరించాం. మిషన్ కాకతీయ పథకం దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిందని గవర్నర్ చెప్పారు.

రైతులకు ఊరట

24 గంటల విద్యుత్, సకాలంలో ఎరువులు, క్రిమిసంహారాలు, విత్తనాలు అందిస్తూ, కల్తీ విత్తనాలు, ఎరువుల అమ్మకాన్ని నిరోధించాం. రైతు బంధు పథకం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందింది. పెట్టుబడి సాయంగా రెండు పంటలకు ఎకరాకు రూ.8వేలు ఇస్తున్నాము. దీన్ని రూ.10వేలకు పెంచుతున్నామని సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ పథకాన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన ఎఫ్ఏవో ప్రశంసించిందని గుర్తుచేశారు. ఏ రైతైనా మరణిస్తే ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల మేరకు కేవలం పది రోజుల్లోనే రైతు బీమా పథకం కింద ప్రభుత్వం అందిస్తుంది. ఇప్పటి వరకు 5,675 మంది రైతు కుటుంబాలకు రూ.288 కోట్లు అందించాము. రైతులకు గిట్టుబాటు ధర కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని ఆలోచిస్తున్నామని, ప్రభుత్వం, మహిళా సంఘాలు, ఐకేపీ ఉద్యోగులు సంయుక్త నిర్వహణలో ఈ యూనిట్లు పనిచేస్తాయి. ఐకేపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్దీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

సమగ్ర భూప్రక్షాళన

భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమగ్ర భూ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టాము. దాదాపు 94 శాతం భూముల యాజమాన్యాల హక్కులపై స్పష్టత వచ్చింది. సాదా బైనామాల ద్వారా జరిగిన భూముల క్రయ విక్రయాలకు చట్టబద్ధత కల్పించేందుకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసున్నాం. భూ సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం

చేతివృత్తులకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహం ఇచ్చి బీసీల స్థితిగతులు మారుస్తున్నామని చెప్పారు. యాదవులు, కురుమలు, మత్స్యకారులు, నేత కార్మికులు, విశ్వకర్మలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితర కులాలను ఆదుకునేందుకు చేయూత ఇస్తున్నామని చెప్పారు. కురుమ, యాదవులకు 75 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని గవర్నర్ తెలిపారు. గొర్రెలకు కావలసిన దాణా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. గొర్రెలతో పాటు ఇతర పశువులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు 100 సంచార పశు వైద్యశాలలు నడుపుతున్నామని గవర్నర్ తెలిపారు. పెద్దఎత్తున చేప, రొయ్య పిల్లల పెంపకాన్ని చేపట్టామన్నారు. దీంతో ఆ వర్గాల ఆదాయం పెరిగిందని చెప్పారు.

చేనేతకు ప్రోత్సాహం

చేనేత, మరమగ్గాల కార్మికుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి, ఇతర సంస్థల ఉద్యోగులకు యూనిఫారాలు, బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పంపిణీ చేసే చీరల కోసం చేనేత మరమగ్గాల ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నామని, సిరిసిల్ల, గద్వాల్‌లో టెక్స్‌టైల్ హబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని గవర్నర్ వివరించారు.

విద్యాభివృద్ధి

కేజీ టు పీజీ విద్యా విధానంలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని హంగులతో 542 కొత్త ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరో 119 పాఠశాలలు ప్రారంభించనున్నట్లు గవర్నర్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఆశ్రమ డిగ్రీ కళాశాలలను కూడా ప్రారంభించిందని, ఈ కళాశాలల్లో భోజనం, వసతి తదితర సౌకర్యాలు కల్పించేందుకు ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.లక్షా 20వేలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విదేశీ విద్య కోసం వెళ్ళేవారికి రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని గవర్నర్ చెప్పారు.

కులవృత్తులకు ఆదరణ

నాయీ బ్రాహ్మణులకు నవీన క్షౌరశాలలు, రజకులకు అధునాతన వాషింగ్ మెషిన్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. గీత కార్మికుల కోసం తాటి, ఈత చెట్ల పెంపకాన్ని చేపట్టింది. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తామని, అత్యంత వెనకబడిన వర్గాల క్షేమం కోసం రూ.1000 కోట్ల పెట్టుబడితో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేశామని వివరించారు. పేదలందరికీ ఇళ్ళు కట్టించాలన్న లక్ష్యంతో 2,72,763 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను మంజూరు చేశామని తెలిపారు.

ప్రజారోగ్యం భేష్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు పెంచామని, మందుల కొనుగోలుకు మూడింతలు బడ్జెట్ పెంచి ఉచితంగా అందిసున్నాం. ఎంఆర్ఐ, సిటీస్కాన్, డిజిటల్ రేడియాలజి, టూ డీ ఎకో అందుబాటులోకి తెచ్చి, 40 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసాం. ఉత్తమ వైద్యసేవలు అందిసున్నందుకు రాష్ట్రానికి అనేక జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. హైదరాబాద్‌లో 40 బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేసి రోగ నిర్ధారణ పరీక్షలు, ఉచితంగా మందులు అందుబాటులో ఉంచాము. రాష్ట్రంలో నాలుగు వైద్య కళాశాలలను మంజూరు చేశామని, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. సూర్యాపేట, నల్గొండలో వచ్చే ఏడాది నుంచి ప్రారంభమవుతాయి. ఒక్కో వైద్య కళాశాలకు 750 పడకల ఆసుపత్రులు ప్రారంభిసున్నాము. కేసీఆర్ కిట్స్ పథకం నిరుపేద గర్భిణీలకు రూ.12వేలు, ఆడపిల్లను ప్రసవిస్తే తల్లికి ప్రోత్సాహకంగా మరో రూ.1000 చెల్లిస్తుంది. దీంతోపాటు నవజాత శిశువులకు, బాలింతలకు కావలసిన 16 రకాల వస్తువులతో కూడిన రూ.2వేల విలువైన కేసీఆర్ హెల్త్ కిట్ అందిస్తున్నాము. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, అద్దాలు ఇస్తున్నాము. ఇదే తరహాలో చెవి, ముక్కు, గొంతు, దంత సంబందిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నామని గవర్నర్ చెప్పారు.

పరిపాలనలో సంస్కరణలు

పరిపాలనా సంస్కరణలను అమలు చేసేందుకు జిల్లాలు, రెవెన్యూ మండలాలు, మునిసిపాలిటీలను పెంచాము. తండాలు, గూడాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశాం. శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు కొత్తగా ఏడు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేశాం. కొత్త పోలీస్ సబ్ డివిజన్లు, సర్కిళ్ళు, స్టేషన్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలు, జాతరలు, ఉత్సవాలు ఈ సెంటర్ ద్వారా పర్యవేక్షించవచ్చు. గుడుంబా, మాదక ద్రవ్యాలు, కల్తీని అరికట్టగలిగిందని, శాంతిభద్రతల పర్యవేక్షణలో దేశానికే తలమానికంగా పోలీస్ శాఖ నిలిచింది. కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటుచేసి స్థానికులకే ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

పారిశ్రామిక పెట్టుబడులు

పారిశ్రామిక పెట్టుబడులు రాబట్టేందుకు టిఎస్-ఐపాస్ ద్వారా ఇప్పటి వరకు 8,858 పరిశ్రమలకు అనుమతి ఇచ్చామని, ఇందులో రూ.1.30 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, 8.37 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఆయన సభదృష్టికి తెచ్చారు. ఐటి హబ్‌గా గుర్తింపు పొందిన హైదరాబాద్ నుంచి ఈ ఏడాది రూ.లక్ష కోట్ల ఎగుమతులు సాధించాం. పట్టణాలు, నగరాలకు విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గత నాలుగున్నరేళ్ళలో ప్రభుత్వం మేనిఫెస్టోలు ప్రకటించకుండానే అనేక ప్రజా ప్రయోగ, సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చింది. అలాగే రానున్న ఐదేళ్ళలోనూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన లక్ష్యాలను, ప్రణాళికలను, పథకాలను నిర్దేశించుకుంటూ ప్రభుత్వం పురోగమిస్తుందని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రజల బతుకుల్లో సుఖశాంతులు వెల్లివిరిసే బంగారు తెలంగాణ నిర్మాణం కోసం ప్రజలు అందించిన విజయం పునాదిగా ప్రభుత్వం పునరంకితమవుతుందని నరసింహన్ విశ్వాసం ప్రకటించారు.

పోలీసుల పని తీరు భేష్

ప్రసంగంలో గవర్నర్

తెలంగాణ రాష్ట్ర పోలీసుల పనితీరుపై గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సంతృప్తి వ్యక్తం చేశారు. గడచిన ఐదేళ్ళుగా రాష్ట్రంలో శాంతి భద్రతలు వెల్లివిరుస్తున్నాయన్నారు. గతంలో కంటే పోలీసుల పని తీరు మెరుగుపడిందని, ఇందుకు ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధే కారణమన్నారు. బడ్జెట్‌లో పోలీసు శాఖకు పెద్ద పీట వేయడం, వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యమివ్వడం జరిగిందన్నారు. షీ టీంలను ఏర్పాటు చేసి మహి ళలపై అఘాయిత్యాలను అరికట్టడం జరిగిందన్నారు. ఆర్థిక నేరాలు తగ్గు ముఖం పట్టాయని, సంఘ విద్రోహకరశక్తులను కట్టడి చేయడం జరిగిందని పేర్కొన్నారు. గుండబాను అరికట్టడంతో పాటు పేకాటను తరిమికొట్టడంలో పోలీ సులు విజయం సాధించారన్నారు. గడచిన ఐదేళ్ళలో పోలీసు శాఖకు మౌలిక సదు పాయాలను పెంచడంతో పాటు పోలీసుస్టేషన్లు, ఇతర భవనాల నిర్మాణానికి పెద్ద పీట వేయడం జరిగిందని, పాలనా సౌలభ్యం కోసం 21 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు అనుగుణంగా పోలీసుస్టేషన్‌లు, డివిజన్‌లను కూడా పెంచామని పేర్కొన్నా రు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలోనూ మిగతా రా ష్ట్రాల కంటే మన పోలీసులు ముందున్నారని, త్వరలోనే అత్యంత అధునాతమైన పోలీసు కమాండ్ కంట్రోల్ రూం కూడా అందుబాటులోకి రానుందన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే మన పోలీసులు మన్ననలను అందుకుంటున్నారన్నారు.

విద్యుత్ మిగులు రాష్ట్రంగా...

● శరవేగంగా విద్యుత్ ప్రాజెక్టులు

● 28వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

'జ'టిలంగా ఉన్న విద్యుత్ సంక్షోభాన్ని టీఆర్ఎస్ సర్కారు విజయవంతంగా ఎదుర్కొంది. దూరదృష్టితో సమర్థవంతమైన ప్రణాళికల అమలు ద్వారా దేశంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలవబో తోంది. కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 800 మెగా వాట్ల కెటిపి ఎస్ 7వ దశ నిర్మాణాన్ని కేవలం 42నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి ,విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రారంభించింది. 1080 మెగావాట్ల సామర్ద్యంతో నిర్మిస్తున్న భద్రాద్రి వపర్ ప్లాంటు ద్వారా ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంట్ల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయి. ఈ పనులు పూర్తయితే 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం 5వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి 7778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్ద్యం మాత్రమే ఉండేది. ఈ నాలుగున్నరేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషివల్ల తెలంగాణలో 16503 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. తలసరి విద్యుత్ విని యోగం వృద్ధిరేటులో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యవ సాయరంగానికి 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును ఉచితంగా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో సీఎం కేసీఆర్ కృషి ఫలించింది. ట్రాన్స్‌కో, జన్కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావు నిరంతర పర్యవేక్షణలతో సంస్థల పని తీరును మరింత మెరుగు పరుస్తున్నారు. వ్య వసాయరంగానికి 24గంటల విద్యుత్ సరఫరా వ్యవసాయ రంగంలో పెద్దమార్పులకు దారి చూపింది. పంటల సాగు విస్తీర్ణం పెరగటంతో పాటు పంటల ఉత్పాదకత కూడా గణనీయం గా పెరిగి తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడ్డాయి. పారిశ్రా మిక రంగానికి రాత్రిపూట విద్యుత్ వినియో గంలో చార్జీలపై రాయితీ ఇచ్చి విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి కూడా కొత్తశక్తిని ఇచ్చింది.

మరో రెండు దశాబ్దాలు కేసీఆరే సీఎం



మరో రెండు దశాబ్దాల పాటు కెసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగే పరిస్థితి ఉందని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తెలంగాణ నెంబర్ వన్ స్థానంలోకి వెళ్ళిందని అన్నారు. దేశ రాజకీయాలన్నీ తెలంగాణ వైపే చూస్తున్నాయని, ఆదర్శవంతమైన పాలనలో దేశంలోనే తెలంగాణ ముందుంటుందని శనివారం మీడియా పాయింట్‌లో కర్నె ప్రభాకర్ మాట్లాడారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో ఏమి చేస్తావమనే అంశాలను గవర్నర్ ప్రసంగం ద్వారా వెల్లడించినట్లు ఆయన చెప్పారు.

గవర్నర్ ప్రసంగం అద్భుతం



అసెంబ్లీలో గవర్నర్ చేసిన ప్రసంగాన్ని చంద్రబాబు వినివుంటే బాగుండని అన్నారు. ఆంధ్రాలో సముద్రం ఉంది కానీ అక్కడ మత్స్యకారులకు ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. తెలంగాణలో సముద్రం లేకపోయినా రాయితీలు ఇచ్చి లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన తెలిపారు. చేనేత, గీత, నాయీ బ్రాహ్మణులు, గొల్లకురుమల కులవృత్తులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో గొర్రెలు, బర్రెలు, మత్స్యకార పథకాలెన్నో అమలవుతున్నాయని తెలిపారు. కంటివెలుగు కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి కంటిచూపు కల్పించామన్నారు. తెలంగాణను పరిపాలన సౌలభ్యం కోసం 33 జిల్లాలుగా విడగొట్టామని ఆ పనిని ఆంధ్రాలో చంద్రబాబు ఎందుకు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు.గవర్నర్ ప్రసంగం అద్భుతంగా ఉందన్నారు.


అన్నీ అర్ధసత్యాలే..



ఉభయ సభల సమావేశంలో జరిగిన గవర్నర్ ప్రసంగంలో అర్ధసత్యాలను చెప్పించారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. సభలో అనేక అంశాలను చర్చించాల్సివుందని, ఈ నేపథ్యంలో మరో రెండు మూడు రోజులు సమావేశాల ను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. మ ల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు, నీతి అయోగ్ నివేదిక, హాస్టళ్ళు, ఆసుపత్రుల పరిస్థితులు మెరుగుపర్చాల్సిన చర్యలపై చర్చించాల్సి వుందన్నారు.

సత్తుపల్లి, అశ్వరావుపేట కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలనే ప్రజాడిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, ఈ డిమాండ్ పరిష్కారానికి ముఖ్యమంత్రి కెసీఆర్ కృషి చేయాలని ఆయన కోరారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో పొంగిలేటి మాట్లాడారు.

కొత్త అంశాలు లేవు



గవర్నర్ ప్రసంగంలో కొత్త విషయాలేమి లేవని, నిరాశాపత్రం మాదిరిగా ఉందని భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాల ద్వారా ఆరు లక్షల మంది ఆరోగ్యబీమా సౌకర్యం కలిగిందని, అయితే కేంద్రపథకాలను అంగీకరించని టీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం లబ్ధిదారుల అంశాన్ని గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పడం దారుణమన్నారు.

తెరాస మేనిఫెస్టోనే చదివారు



గవర్నర్ ప్రసంగంలో టీఆర్ఎస్ మేనిఫెస్టోనే చదివించారని భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. ఆద్యంతం ప్రసంగమంతా కొత్తసీసాలో పాతసారా పోసినట్లు ఉందని ఆక్షేపించారు. హైదరాబాద్ నగరాభివృద్ధి గురించి ఒక్క కొత్తమాట కూడా ప్రస్తావించలేదని, మీడియా పాయింట్‌లో రాజాసింగ్ మాట్లాడారు.. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని, ఈసారైనా మంచి పరిపాలన అందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గులాబీ హామీల్లా గవర్నర్ ప్రసంగం




గవర్నర్ ప్రసంగం టీఆర్ఎస్ మేనిఫెస్టోలా ఉందని, సాధారణంగా గవర్నర్ ప్రసంగంలో నా ప్రభుత్వం అనడం ఆనవాయితీ కానీ ఈసారి ఒక చోట టీఆర్ఎస్ ప్రభుత్వమనడం అందుకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసే లేకపోవడం దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ళలో లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మరిచిపోయారని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ, రిటైర్‌మెంట్ వయసు 61 సంవత్సరాలకు పెంచడం వంటి హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పలేదన్నారు.

సభలో సంకటం

పదవులు రాక.. ఛాంబర్లు లేక..

ఈసారి జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో విచిత్రపరిస్థితి నెలకొంది. మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంతో శాసనసభలో గతంలో మంత్రులకు కేటాయించిన కార్యాలయాలన్నీ ఎవరికీ కేటాయించక తాళాలతో దర్శనమిస్తుండగా, హోదా లేకపోవడంతో గతంలో మంత్రులుగా పనిచేసిన సీనియర్లు సభ ముగిశాక, సభ విరామసమయంలో ఇబ్బందిపడుతున్నారు. ఇలాంటి సమయాల్లో గతంలో తమ ఛాంబర్లలో జిల్లా ఎమ్మెల్యేల వినతులు వినడం, పరిస్థితులపై చర్చించుకోవడం జరిగేది. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయానికి వెళ్ళే అవకాశమున్నా అది ఎపుడూ కిటకిటలాడుతుండడంతో మాజీ అమాత్యులు, సీనియర్లు తమ నివాసాలకే ఆయా జిల్లాల నేతలను ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశాలు విభిన్న అనుభూతిని కలిగిస్తున్నాయని గతంలో సభలో ప్రాతినిధ్యం వహించిన పలువురు సభ్యులు పేర్కొన్నారు.

షాక్రౌకర్స్..!



లెఫ్ట్ కు లేదంట సిగ్గు...
రైట్‌కు ఉందా ఎగ్గు?
ఎంత కక్కినా కషాయం...
ఎరుపవుతుందా కాషాయం?


కేరళం మరింత గరళం...
సెంటిమెంట్‌తో రాజకీయం!
హక్కులంటూ చిక్కులు
సామరస్యానికి బీటలు!

-దిన్నా

చమక్కులు

పదవి భయం

పదవంటే ఎవరికి చేదు? రాజకీయ పరమపద సోపానంలో పదవి నిచ్చెన ఎక్కేందుకు నేతలు ఎంతో శ్రమ పడతారు? ఎన్నో కోల్పోతారు. అయినా దక్కాల్సింది దక్కకుంటే ఆ వేదనే వేరు. కానీ కొన్ని పదవులుంటాయ్. చూడ్డానికి గొప్ప పదవులే అయినా సెంటిమెంట్ రీత్యా బెంబేలెత్తిస్తాయ్. తాజాగా రాష్ట్రంలోని ఓ కీలకపదవి కోసం అనేకమంది పేర్లు ప్రచారంలోకి రాగా తమను ఎక్కడ ఎంపిక చేస్తారోనని కొందరు మాజీమంత్రులు ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేశారట. పెద్దాయన చూపు తమపై పడకుండా చూడమని వేడుకున్నారట. ఎన్నికల సమయంలో సెంటిమెంట్‌ను అధిగమించి టెన్షన్ పడుతూ గెలిచిన ఓ ఉత్తర తెలంగాణనేత ఈ ప్రధానపదవికి పేరు వినబడడంతో టెన్షన్ పడ్డాడట. చివరకు టెన్షన్ తొలగిస్తూ సీఎం నిర్ణయం తీసుకోవడంతో హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకున్నాడట. ఈ విషయం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మిత్రులతో చెబుతుండగా, రాజకీయాల్లో పదవులు ఆనందాన్నే కాదు ఒక్కోసారి భయాన్ని కలిగిస్తాయని చమత్కరించారు.




ఖాళీగా ఉండడం బెటర్ బ్రదర్

అవును.. ఇపుడు గ్రామపంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువచోట్ల ఇదే మంత్రం పాటిస్తున్నారు. మెజారిటీ గ్రామపంచాయతీల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు టీఆర్ఎస్ అభ్యర్థులతోనే తలపడుతుండగా గెలిచినాక చూసుకుందాం.. ఎవడు గెలిచినా మనోడు. ఎక్కువ జోక్యం చేసుకుని నెత్తి ఖరాబుచేసుకోకండి అని ముఖ్యనేతలు కొందరు ఎమ్మెల్యేలకు సలహాలిచ్చారట. ఖాళీగా ఉండడం బెటర్ బ్రదర్.. జోక్యం చేసుకుంటే రెండురకాల ఇబ్బందులుంటాయ్ అని సలహాలు వినిపించాయట. ఇక రాజధానికి సమీపంలోని జిల్లాలో గల ఓ గ్రామీణ నియోజకవర్గంలో మీరంతా ఏకాభి ప్రాయానికి వస్తే నేను ప్రచారం చేస్తా.. సహకరిస్తా. మీరుమీరు పోటాపడితే ఏం చేయలేం రా బై. తేల్చుకోండి అని ఓ ఎమ్మెల్యే నియోజకవర్గంలో సర్పంచ్ ఆశావహులకు చెప్పి అసెంబ్లీకి వచ్చాడట. అన్నా చేయాల్సిన చోట ఏకగ్రీవం చేసిన. ఇక మనోళ్ళు..మనోళ్ళే పోటీపడుతుండ్రు. ఎవడు గెలిసినా మనోడే. అందుకే ఎన్నిక ముగియగానే వెళ్ళి గెలిచినోడిని సన్మానిస్తా.. ఓడినోడిని ఓదారుస్తా అని మనసులో మాట చెప్పేశాడు. పంచాయతీ రాజకీయం ఇలా గమ్మత్తుగా తిరుగుతోంది.



సభలో సైన్మా



అవును.. ఈ సారి శాసనసభ సమావేశాలకు వచ్చిన ఎమ్మెల్యేలలో కొందరు పదవులతో పాటు సినిమాల మీద కూడా చర్చిస్తున్నా రు. నియోజకవర్గాల సమస్య లను తీసుకువెళ్ళేందుకు ఆయా శాఖలకు ఇంకా మంత్రులు లేకపోవడం, ఏం చేయాలో పాలుపోకవడంతో నగరానికి వచ్చిన అనేకమంది ఎమ్మెల్యేలు సభ ముగిశాక సినిమా థియేటర్ల వైపు పరుగెడుతున్నారు. సభకు వచ్చిన సందర్భాల్లో లాబీలలో, బయట సరదాగా వాటి గురించి ప్రస్తావిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమా థియేటర్లలో నడుస్తుండగా.. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య సినిమా చర్చ వచ్చింది. అన్నా.. రాత్రి ఎన్టీఆర్ సినిమాకు వెళ్ళా అని ఓ ఎమ్మెల్యే అంటే నేను అసలు ఎన్టీఆర్‌తోనే పనిచేశా. ఇక సైన్మాదేముంది అంటూ ఆ సీనియర్ ఎమ్మెల్యే చమత్కరించారట. ఇక ఎఫ్2 సినిమా చూడమంటూ ఓ ఎమ్మెల్యే సలహానిస్తే నన్ను చూసే ఆ సిన్మా తీశారంటూ దక్షిణ తెలంగాణకు చెందిన మరో సీనియర్ ఎమ్మెల్యే నవ్వులు పూయించారు.

- కంది.రామచంద్రారెడ్డి



బీటీ రోడ్లతో

ఊళ్లన్నీ మెరవాలి

నీటి పారుదల ప్రాజెక్టుల తర్వాత రహదారుల నిర్మాణానికే ప్రభుత్వ ప్రాధాన్యత: సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని రహదారున్నింటినీ అద్దంలా మార్చాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత రహదారుల నిర్మాణానికే ప్రాధాన్యతని స్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలతోసహా, రాష్ట్రం లోని మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు బిటి రహదారి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత రహదారుల పరిస్థితి ఎలా ఉంది...వాటిని అద్దంలా తయారు చేయడానికి ఏం కావాలి...అనే అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. నిధుల కేటాయింపులకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రహదారుల పరిస్థితిపై శనివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేంద్రంద్వారా రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఇంకా అవసరమైన చోట రహదారుల మరమ్మత్తులు చేయాలని, శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలకు మరమ్మత్తులు చేయాలని, ఇరుకైన బ్రిడ్జీలను వెడల్పు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఈఎన్సీ స్థాయినుంచి ఎఇ స్థాయి వరకు రాష్ట్రస్థాయి ఆర్ అండ్ బి అధికారుల సదస్సు నిర్వహించాలని కోరారు. గ్రామస్థాయినుంచి ప్రతీరోడ్డు పరిస్థితిని సమీక్షించి, చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లా, మండలాలు తేడా లేకుండా ఎక్కడ ఏ పార్టీ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్నారనే తారతమ్యం లేకుండా, రాజకీయాలు పక్కనపెట్టి... అవసరం మేరకు రహదారుల మరమ్మత్తులను పూర్తిచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు రహదారుల మరమ్మత్తులను చొరవతో చేయించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ నుంచి ఆర్ అండ్ బికి, ఆర్ అండ్ బినుంచి జాతీయ రహదారులకు రహదారులు బదలీ అయిన సందర్భాల్లో, వాటి నిర్వహణ, మరమ్మత్తుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త రహదారుల నిర్మాణమయ్యేంతవరకు పాత రోడ్లను పట్టించుకోవడంలేదని, ప్రయాణీకులు ఇబ్బందులనెదుర్కోవాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రహదారుల బదలీ సందర్భాల్లో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయాలని ఆయన ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఎమ్మెల్యేల కార్యాలయాల నిర్మాణం చేపట్టామని, వాటి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన క్వార్టర్లను ఎమ్మెల్యేలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్య కార్యదర్శులు సునీల్ శర్మ, రామకృష్ణారావు, ఇఎన్సీ గణపతిరెడ్డి, ఎస్ఇ చంద్రశేఖర్, సీఎంఓ అధికారులు స్మితా సభర్వాల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డల చెంతకు నేనొస్తా... తేలుస్తా
పట్టాలిచ్చాకే తిరిగొస్తా

(మొదటిపేజీ తరువాయి)

విభేదాల సమస్య తీవ్రంగా ఉండగా ఈ సమస్య పరిష్కారంపై సీరియస్‌గా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ తన వద్దకు వచ్చిన ఎమ్మెల్యేలతో దీనిపై చర్చించినట్లు తెలుస్తోంది. పోడుభూములకు పట్టాలిచ్చే సమస్యపై తాను సీరియస్‌గా ఉన్నానని, ఇంతపెద్ద రాష్ట్ర సమస్యను పరిష్కరించిన తాము ఆదివాసీ ప్రాంతాల సమస్యను కూడా చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని, తానే దీనికి స్వయంగా పూనుకుంటానన్నారు. త్వరలో దీనిపై ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని సీఎం భరోసానిచ్చినట్లు తెలుస్తోంది. తమ ప్రాంతంలో పోడుభూముల సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యేలు వివరించగా,ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు లబ్దిదారులు, భూమికి సంబంధించిన వివరాలు సేకరించిపెట్టుకోవాలని వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఒకేసారి పరిష్కారం చేసి పూర్తి హద్దులు ఏర్పాటుచేసేలా అధికారులకు ఆదేశాలిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. భూముల సమస్యలను పరిశీలించడం, పట్టాలివ్వడం అంతా ఒకేసారి జరిగిపోవాలని, అవసరమైతే తాను అక్కడే నిద్రచేసి సమస్య పరిష్కారమయ్యాకే హైదరాబాద్ వస్తానని చెప్పినట్లు తెలిసింది.'నాతో పాటు మీరు కూడా నిద్రచేయాల్సి వస్తది..సిద్ధంగా ఉండాలి' అని చెప్పినట్లు సమాచారం. ఆదివాసీ ప్రాంతాలు అన్నిరకాలుగా అభివృద్ధి చెందాలని, ఇందుకోసం ప్రత్యేక అథారిటీ కూడా ఏర్పాటుకు సిద్ధమని సీఎం అన్నట్లు తెలిసింది. రాజకీయాలకంటే ప్రాంతం బాగుపడడమే ముఖ్యమని, రాజకీయాలు పక్కనబెట్టి గిరిజనుల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం.

ఎమ్మెల్యేల వినతులపై సీఎం సానుకూలం

సీఎంను కలిసిన సందర్భంగా పోడుసమస్యతో పాటు మణుగూరు కేంద్రంగా ప్రత్యేకరెవెన్యూడివిజన్ ఏర్పాటుచేయాలని, వందపడకల ఆస్పత్రికి వైద్యులు,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చాలని పినపాక ఎమ్మెల్యే రేగాకాంతారావు వినతిపత్రం అందజేయగా, ములుగుకేంద్రంగా సమక్క-సారలమ్మ జిల్లా ఏర్పాటుచేస్తుండడంపై సీతక్క సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పోడుసమస్య పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. నేతల వినతులపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు నేతలు తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య కూడా నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాలు అందజేసినట్లు తెలుస్తోంది.

కృతజ్ఞత లేనివారికి సేవ చేయలేం

రాజునే ముంచేశారు!

●సత్యం సేవలను మరిచారు ●108 అంబులెన్స్ రూపకర్త ఆయనే ●సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు, ప్రముఖ దాత, రొటేరియన్ దాకోజు రవిశంకర్ వ్యాఖ్యలు



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ''సత్యాన్ని గోదావరిలో ముంచేశారు, గోదావరి జిల్లాలకు సత్యం రామలింగరాజు ఎంతగా సేవలందించినా వాటన్నింటిని మర్చిపోయా రు.'' ఈ వ్యాఖ్యలు చేసింది ఆషామాషీ వ్యక్తికాదు. దక్షిణభారత సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రముఖులు దాకోజు రవిశంకర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తమౌతోంది. సత్యం రామలింగరాజుకు జరిగిన అన్యాయం ప్రస్పుటమౌతోంది. ఆయన పట్ల గోదావరి జిల్లాలు అనుసరించిన వైఖరికి అద్దంపడుతోంది.

బెంగళూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడైన రవిశంకర్ సాఫ్ట్‌వేర్ రంగ నిపుణుడు. సంపన్నుడు మాత్రమే కాదు. గొప్ప దాత కూడా. ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న విద్య, ఆరోగ్య పథకాలకు ఆయన వందకోట్ల విలువైన విరాళాలు ఇచ్చారు. బిల్‌గేట్స్ తర్వాత రోటరీకి ఇంతమొత్తంలో విరాళం అందించిన దాత రవిశంకరే. ప్రస్తుతం బెంగళూరులో స్థిరపడ్డ రవిశంకర్ కుటుంబీకుల మూలాలు గోదావరి జిల్లాల్లో ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణ పథకాలకు భూరి విరాళమిచ్చిన రవిశంకర్‌ను తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని రోటరీ క్లబ్‌లన్నీ ఘనంగా సన్మానించాయి. ఆయనతో ముఖాముఖి ఏర్పాటు చేశాయి. జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రోటేరియన్లతో పాటు ఆయన కూడా రవిశంకర్‌తో ముఖాముఖిలో భాగస్తుల య్యారు. నేరుగా కొన్ని ప్రశ్నలడిగారు. కుటుంబీకుల మూలాలున్న గోదావరి జిల్లాలకు మీ వంతు సాయంగా ఏం చేయనున్నారంటూ కలెక్టర్ ప్రశ్నించారు. దీనికి రవిశంకర్ ఇచ్చిన జవాబుకు అంతా నివ్వెరపోయారు. గోదావరి జిల్లాలు సహజంగానే సస్యశ్యామం, సంపన్నమైనవి. వీరికి ఎవరో వచ్చి ఏమీ చేయాల్సిన అవసరం లేదు. చేసినా ఆ కృతజ్ఞతను వీరు ప్రదర్శించరు. దేశంలోనే సాఫ్ట్‌వేర్‌రంగానికి ఆద్యుడు సత్యం రామలింగరాజు ఈ జిల్లాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటికీ ఆయన పేరిట ఉన్న ఫౌండేషన్ విద్య, ఆరోగ్యం, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాలకు విశేష కృషి చేస్తోంది. అలాంటి రామలింగరాజు ప్రతిష్టను గోదావరిలో ముంచేశారు. ఆయన భవిష్యత్‌ను గోదావరిపరం చేశారంటూ రవిశంకర్ వ్యాఖ్యలు చేశారు. తనకు పట్టణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తిలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే తన విరాళాలు ఉపకరించాలన్నారు. ఎవరో పిలిచి గౌరవిస్తారని, లేదా సన్మానిస్తారని తాను విరాళాలు ఇవ్వలేదన్నారు. సమాజ సేవలో తనకు ఒక రకమైన తృప్తి ఉందన్నారు. అయినా సరే గోదావరి జిల్లాల్లో సేవా కార్యక్రమాలకు తాను సిద్ధంగా లేనన్నారు.ప్రపంచ ప్రఖ్యాత హార్వార్డ్ వర్శిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన రామలింగరాజు దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగ విస్తృతికి కృషి చేశారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలిచ్చారు. ఆయన వద్ద తర్ఫీదు పొంది వేలాది మంది సొంతంగా ఈ రంగంలో పరిశ్రమలు నెలకొల్పారు. ప్రపంచ ప్రఖ్యాతగాంచారు. సంపన్నులుగా రూపుదిద్దుకున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే 108 అంబులెన్స్ పథకానికి రూపకల్పన చేయడం మరో ఎత్తు. ఈ పథకం ఇప్పుడు భారతదేశ వ్యాప్తంగా అమల్లో ఉంది. వేల సంఖ్యలో రోగుల్ని సకాలంలో ఆసుపత్రులకు చేరుస్తోంది. ఈ పథకానికి రూపకర్త, నిర్వహణ బాధ్యత అన్నీ సత్యం రామలింగరాజువే. ఇప్పటికీ రైలుబండి ఎవరు కనిపెట్టారు.. కరెంట్ బల్బ్ ఎవరు రూపొందించారని పాఠ్యాంశాల్లో చదువుకునే భారతీయులు రోజు వందల సంఖ్యలో అత్యవసర రోగులకు ప్రాణాధారంగా నిలుస్తున్న 108సర్వీసుల్ని ఎవరు రూపొందించారన్నది మాత్రం పట్టించుకోరు. ఇలాంటివి ఇక్కడి పాఠ్యపుస్తకాల్లో కనిపించవు. బిల్‌గేట్స్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా సత్యం రామలింగరాజును పక్కనే కూర్చోబెట్టారు. రామలింగరాజు మనవాడేనంటూ ప్రపంచానికి గొప్పగా చాటారు.అలాంటి సత్యం రామలింగ రాజు దుర్భర జైలు జీవితాన్ని అనుభవించారు. ఆయన భవిష్యత్‌ను నాశనం చేశారు. అలాంటి ప్రాంతానికి సేవచేసే ధైర్యం, ఆసక్తి కూడా నాకు లేవంటూ రవిశంకర్ చేసిన వ్యాఖ్యలకు కలెక్టర్ కూడా హతాశులయ్యారు.



స్పీకర్‌ను అభినందించిన మాజీమంత్రులు, ఎమ్మెల్సీలు

సంప్రదాయాల ప్రకారం సభ నడిపిస్తా

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి శనివారం అసెంబ్లీ ఆవరణలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఒకరు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులు , మరొకరు రాజ్యాంగాన్ని రచించిన మహనీయులు. వాళ్ళిద్దరినీ స్పీకర్ స్థానంలో ఉండి గౌరవించుకునే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా అని ఈ సందర్భంగా పోచారం మీడియాతో అన్నారు. సభను హుందాగా, పక్షపాతం లేకుండా సజావుగా నడిపించే బాధ్యత తనపై ఉందన్నారు. సభ నిబంధనల ప్రకారం ప్రతిపక్షపార్టీలకు మాట్లాడే స్వేచ్ఛని స్తానని, వారి సూచనలు స్వీకరించి సభాసంప్రదాయాలు పాటిస్తానని అన్నారు.

అభినందనల జల్లు

రాష్ట్ర శాసనసభస్పీకర్‌గా నియమితులైన పోచారం శ్రీనివాసరెడ్డిపై అభినందనల జల్లు కురుస్తోంది. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో పాటు మాజీమంత్రులు తన్నీరు హరీష్‌రావు, ఈటల రాజేందర్, సీఎల్పీనేత భట్టివిక్రమార్క, ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, పాతూరి సుధాకర్‌రెడ్డి, భానుప్రసాద్, బాలసాని లక్ష్మీనారాయణ, గంగాధరగౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుద్దిళ్ళశ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు స్పీకర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందించారు.



స్పీకర్ సమక్షంలో రాజాసింగ్ ప్రమాణం

భాజపా శాసనసభ్యు డు రాజాసింగ్ శనివారం శాసనసభ్యు డిగా ప్రమాణం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఉదయం తన ఛాంబర్‌లో రాజాసింగ్ చేత ప్రమా ణం చేయించారు. ఎంఐఎం శాసనస భ్యుడు ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా శాసనసభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించిన విషయం తెలిసిం దే. అయితే ఎంఐఎం సభ్యుడు ప్రొటెం స్పీకర్‌గా అధ్యక్షస్థానంలో ఉంటే తాను ప్ర మాణం చేసేది లేదంటూ స్పష్టంచేశారు. గురు, శుక్రవారాల్లో సభ్యులచే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించినప్పటికీ రాజాసింగ్ మాత్రం సభకు హాజరు కాలేదు. శుక్రవారం స్పీకర్‌గా పోచారం ఏకగ్రీవంగా ఎన్నికవడంతో శనివారం ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు.

అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదలీలను పూర్తి చేయండి

పెండింగ్‌లో ఉన్న అంతరాష్ట్ర ఉద్యో గుల బదిలీలను వెంటనే పూర్తి చేయా లని వైకాపా అధ్యక్షుడు జగన్ తెలం గాణ సీఎం కేసీఆర్‌ను కోరారు. బది లీలకు సంబంధించి ఉత్తర్వులు విడు దల చేయాలని కోరుతూ ఈ మేరకు శనివారం కేసీఆర్‌కు లేఖ రాశారు.

పీఆర్సీపై మౌనం!

● ఐఆర్ ప్రస్తావనా లేదు ● ఉద్యోగుల వయోపరిమితి పెంపు ఊసూ లేదు ● గవర్నర్ ప్రసంగంపై ఉద్యోగవర్గాల్లో చర్చ.. నిరాశ ● గత నెలలో 1200 మంది పదవీ విరమణ.. ● ఈనెలలో మరో వెయ్యిమందికి రిటైర్మెంట్ ● వయోపరిమితిపై నిర్ణయం తీసుకుంటే వీరికి లబ్ది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వేతన సవరణ, మధ్యంతర భృతి వంటి కీలక అంశాలను ప్రస్తావించకుండా గవర్నర్ నరసింహన్ ప్రసంగం కొనసాగడంతో ఉద్యోగవర్గాలు నిరాశకు గురయ్యాయి. ఇటీవలి ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కొలువదీరిన తెరాస సర్కారు సారథ్యంలో శాసనసభ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా ఈ సందర్భంగా శాసనసభ్యులను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగంలో ఉద్యోగవర్గాలకు సంబంధించిన కీలక అంశాల ప్రస్తావన లేకుండాపోయింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లు నెరవేరుతాయని ఆశగా వేచిచూసిన ఉద్యోగులకు నిరాశ తప్పలేదు. ఐఆర్, పీఆర్‌సి అమలు, ఉద్యోగుల వయో పరిమితి పెంపు అంశాలపై ఈ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావన రాలేదు. గత నెలలో 1200 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా, తాజాగా మరో 1000 మంది పదవీ విరమణ చేయనున్నారు. అయితే టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులు పదవీ విరమణ వయో పరిమితి వయస్సును 61 ఏళ్లకు పెంచుతామని స్పష్టమైన హామీనిచ్చింది. కాగా సీఎం కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దాదాపు నెలరోజులు దాటాయి. దీంతో ప్రభుత్వ హామీపై ఇప్పుడు ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్నికల హామీలో ఉద్యోగుల పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంచుతామని తమ ప్రధాన హామీగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ హామీ అమలుపై సహజంగానే ఆశలు పెరిగాయి. అయితే ఉత్తర్వుల జారీకి ముందుగా అనేక దశల్లో కసరత్తు, అధ్యయనం జరగాల్సి ఉంది. ఇదే సమయంలో ఉద్యోగుల్లో మాత్రం పదవీ విరమణ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తే బాగుంటుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

జూన్ 2వరకు జాప్యం తప్పదా?

అయితే మరో వాదన ప్రకారం రాష్ట్ర ఆవిర్భావ దినమైన జూన్ 2న అధికారికంగా ప్రభుత్వం ప్రకటన చేయవచ్చనే ప్రచారం కూడా ఉంది. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ అంశాన్ని చేర్చకపోవడంతో ఈ అంశం మరింత జాప్యం కానుందనేది స్పష్టమైంది. అయితే రెండు నెలుగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ హామీ అమలైతే తమకు రెండేళ్లు కలిసిరానుందని ఆశతో ఉన్నారు. అటువంటి ప్రతిపాదనేది ఇంకా అధికారికంగా అందకపోవడం, ఎటువంటి సర్క్యులర్ సిద్ధం కాలేదు. దీంతో గత నెలలో 1200 మంది రిటైర్ అయ్యారు. కాగా ఈ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ అంత సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు ఇంత భారం మోసేందుకు సిద్ధంగా లేనట్లుగా స్పష్టమవుతోంది. తాజాగా ఈనెల ఖర్చులకే రూ. 500 కోట్ల రుణం కోసం ఆర్థిక శాఖ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆర్థికశాఖ ప్రభుత్వంపై పడే ఆర్థిక భారంపై కనీస అంచనాలు రెడీ చేయలేదు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో సర్కార్ ఉద్యోగులకిచ్చిన హామీ మేరకు పదవీ విరమణ వయసును గత మూడేళ్ల క్రితమే 60 ఏళ్లకు పెంచింది. కర్నాటకలో రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లుగా అమలవుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఈ హామీని నెరవేర్చితే ప్రభుత్వంపై పడే భారం, ఉద్యోగుల సంఖ్య, ఎన్నేళ్లు ఇది భరించాలి అనే కోణంలో ప్రభుత్వం మొదట పరిశీలించి అంచనా వేయాల్సి ఉంది.

నేడు సభలో పంచాయతీ రాజ్ సవరణ బిల్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం ఆర్డినెన్స్‌ను నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ప్రవేశపెడ్తారు. తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్స్ -2018 పేరుతో ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టి ఆమోదం పొందనున్నారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చను కొప్పుల ఆశ్వర్ సభలో ప్రవేశపెడ్డారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రవేశపెట్టనున్నారు.

ఈసారికి బీఏసీ లేకుండానే..

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభ సమావేశాలు బీఏసీ మీటింగ్ జరగకుండానే ముగుస్తున్నాయి. కాంగ్రెస్ శాసనసభాపక్షనేత ఎన్నికలో ఆలస్యంకావడం, బీజేపీ సభ్యుడు కూడా మూడోరోజు వరకు ప్రమాణ స్వీకారానికి రాకపోవడం, టీడీపీ సభ్యుడు ఇంకా ప్రమాణ స్వీకారమే చేయకపోవడం, ఆ పార్టీ శాసనభా పక్షం ఏర్పడకపోవడంతో బీఏసీ ఏర్పాటు కాలేదు. దీంతో బిజినెస్ అడ్వైజరీ కమిటీ భేటీ లేకుండానే శాసనసభ తొలివిడత సమావేశం ముగించాలని అధికారపక్షం నిర్ణయించింది. సాంకేతికంగా బీఏసీ ఏర్పడకపోవడం, కేవలం గవర్నర్ ప్రసంగానికే సమావేశాలు పరిమితం చేయాలని నిర్ణయించడంతో బిజినెస్ కూడా ఏమీ లేనందున ఏకాభిప్రాయంతోనే తొలి సమావేశాలు ఆదివారం ముగిస్తున్నట్లు తెలుస్తోంది. బీఏసీ ఏర్పడలేదు కాబట్టి ఆ సమావేశం నిర్వహించలేదన్న ప్రశ్నే ఉత్పన్నంకాదని అధికారపక్షం భావిస్తోంది.

రైతులకు తక్షణ పరిహారమివ్వండి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కాల్వలనిర్మాణం సందర్భంగా భూమిని కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందివ్వాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ముథోల్ నియోజకవర్గం పరిధిలోని రైతులకు పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి స్పందించి, ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. చిన్నసుద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకుగురైన ప్రజలకు భూపరిహారం, ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ముథోల్ కమ్యూనిటీహాల్ అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.



ప్రభుత్వ ఉద్యోగులకు పిజ్జాలు డెలివరీ చేసిన బుష్

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ సరికొత్త అవతారం ఎత్తాడు. పిజ్జా డెలివరీ బాయ్‌గా మారాడు. షట్‌డౌన్ నేపథ్యంలో వేతనాల్లేకుండా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం స్వయంగా పిజ్జాలు తీసుకెళ్లి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇప్పుడిది అంతర్జాలంలో వైరల్ అవుతోంది. వేతనాల్లేకుండా దేశానికి సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మా తరపున ప్రత్యేక అభినందనలు. వీరికి మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు అంటూ బుష్ కామెంట్ చేశారు. బుష్ ఆరు పిజ్జాలు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కానీ అక్కడ మొత్తం ఎంతమంది ఉద్యోగులు ఉన్నారన్న విషయం మాత్రం వెల్లడికాలేదు. పార్లమెంటులో రెండు పార్టీలు సమస్య పరిష్కారం దిశగా కృషిచేయాలని బుష్ పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్లపాటు ప్రథమ పౌరుడిగా బాధ్యతల్లో ఉన్న బుష్, ఒక్క రోజు కూడా షట్‌డౌన్ పరిస్థితులు ఎదుర్కోలేదు.




బర్గర్ల కోసం.. క్యూలైన్‌లో బిల్‌గేట్స్

వాషింగ్టన్: బిల్‌గేట్స్.. ప్రపంచానికి పరిచయం అక్కర్లేని ప్రముఖుడు. విశ్వ కుబేరుల్లో రెండవ వ్యక్తి. మైక్రోసాఫ్ట్ దిగ్గజం. ఇంతటి గొప్పవ్యక్తి ఓ పిజ్జా కేంద్రం వద్ద క్యూలైన్లో నిలబడ్డాడు. అదీ ఎంతో సాదాసీదాగా.. తన వంతు వచ్చేదాకా ఓపిగ్గా నిల్చుని కొన్ని పిజ్జాలు, కొన్ని ఫ్రైలు కొనుక్కుని వెళ్లారు. శుక్రవారం నాటి ఈ సంఘటనకు సంబంధించిన ఫొటో ఫేస్‌బుక్‌లో ప్రత్యక్షమై వైరల్ అవుతోంది. వినమ్రతకు, నిరాడంబరానికి ఇంతకంటే నిలువెత్తు నిదర్శనం ఏముంటుంది? అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ తరానికి స్ఫూర్తిదాత అంటూ కొనియాడుతున్నారు. లక్షకోట్ల సంపద కలిగివుండి.. ప్రపంచంలో అతిపెద్ద సేవాసంస్థను నిర్వహిస్తూ కొన్ని పిజ్జాలు, ఫ్రైలు, కోక్ కోసం క్యూలైన్లో నిల్చోవడం ఊహించగలమా అన్న కామెంట్లు హల్‌చల్ చేస్తున్నాయి.

కూటముల ప్రతిధ్వనులు!

ఇక వచ్చేవన్నీ ర్యాలీల రోజులే. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ఇలాంటి ఇంకెన్నో ర్యాలీలు రావడం ఖాయం. అవన్నీ ఒకటికిమించి మరొకటి ఉంటాయని వేరే చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ర్యాలీల ప్రస్థానంలో తొలి భారీ ర్యాలీ నిర్వహించిన ఘనతను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కొట్టేశారు. కోల్‌కతా ర్యాలీ ప్రతిపక్షాన్ని ఒక మైలురాయికి చేర్చినట్లే కనిపిస్తున్నది. ఇంతపెద్ద ర్యాలీ..అంతపెద్ద వేదిక..చాలామంది నాయకులు..కనీసం ఇరవై రెండు మంది...నిస్సందేహంగా ఇదొక మెగా ర్యాలీ. ఇంత పెద్ద ర్యాలీ జరిగిందంటే..ఇంతమంది హేమాహేమీ నాయకులు ఒక వేదికను పంచుకున్నారంటే..రెండో పార్శ్వం మరో చిత్రాన్ని స్పష్టంగా చూపిస్తున్నది. వీరందరి ఉమ్మడి శత్రువు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ఆ మోడీ ఇప్పటికీ బలంగా ఉన్నట్లే. ఎంత బలంగా అంటే..ఇంతమంది ఒక్కచోట చేరినంత బలంగా. ప్రతిపక్షాల సంఘటితత్వం మోడీలోని బలాఢ్యుణ్ణి జాతికి కొత్తగా పరిచయం చేస్తున్నట్లుంది. అంతేకాదు. సంఖ్యాపరంగా పెరుగుతున్న కూటములు మోడీ ప్రాబల్యానికి చిహ్నంగా నిలుస్తున్నాయి. దీన్నిబట్టి వచ్చే లోక్‌సభ ఎన్నికలు హోరాహోరీగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అంతేకాదు. ఒక కోణంలో చూస్తే..జాతీయ పార్టీల మీద ప్రాంతీయ పార్టీల యుద్ధంలా సాగే అవకాశాలూ కొట్టిపారేయలేము. యునైటెడ్ ఇండియా నినాదంతో జరిపిన కోల్‌కతా ర్యాలీ ఆ నినాదాన్ని ప్రతిబింబించిందా? వివిధ పార్టీల నేతలు ఒక్కచోట చేరితే అది సమైక్య భారతావనికి సూచికగా పరిగణించొచ్చా? తాము కలిస్తేనే అది సమైక్య భారత్ అవుతుందని వారు భావిస్తున్నారా? ఇంత చేసినా వీరి లక్ష్యం ఒక్క మోడీ మాత్రమేనన్నది సుస్పష్టం. ఇన్ని కూటములు తనమీదికి దండయాత్రకు వస్తున్నాయని రేపు ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోడీ తన వాక్చాతుర్యంతో ప్రజలను ఒప్పించి మెప్పించి మళ్లీ గెలిస్తే..ఆ గెలుపు యునైటెడ్ ఇండియాకు ప్రతిరూపం కాదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రతిపక్షం నుంచి కన్నా రేపు ప్రజలనుంచి వస్తేనే హేతుబద్ధ సమాధానాలుగా చెలామణి అవుతాయి.

ఎన్డీయే కూటమి తర్వాత జాతీయ కూటమిగా ఇప్పటికే మనుగడలో ఉన్నది యూపీయే కూటమి. ఇక మూడో కూటమి ఎస్పీ-బీఎస్పీ ఆవిర్భవించింది. అది ఒక్క ఉత్తర ప్రదేశ్ పరిమితమైనా దాని ప్రభావం ఇతర కూటముల సమీకరణాల మీద పడుతుంది. మాయావతి, అఖిలేష్ యాదవ్ కేవలం ఉత్తరప్రదేశ్ కోసం కట్టిన ఈ కూటమి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించగలమన్న ధీమాతో ఉన్నారు. ఇక తాజాగా కోల్‌కతాలో జరిగిన మమతా బెనర్జీ ర్యాలీ నాలుగో కూటమిగా లెక్కల్లోకి చేరుతున్నది. పిల్లి మెడలో గంట కట్టేదెవరన్న ప్రశ్న. ఆ ప్రశ్నకు మమతా బెనర్జీ తానేనంటూ జవాబిచ్చారు. అందర్నీ ఒకచోటికి చేర్చి ప్రధానమంత్రి బరిలో తానున్నానంటూ క్రియాశీలక సవాలు విసిరినట్లయింది. అంత బహిరంగంగా సాధికారికంగా కర్చీఫ్ వేసేసినట్టుమాట. అయితే ఇది ఆమె ఒక్కరి తోనే ఆగుతుందా? దానికి ఏమాత్రం సానుకూల సమాధానం చెప్పుకునే పరిస్థితి లేదు. ఇదే కూటమిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. నిజానికి ఈ కూటమికి ఆద్యుడు తానేనన్నది ఆయన అభిప్రాయంగా ఉంటుంది. ఆయన ఇప్పటికి ఒకటికి రెండుసార్లు జాతీయ స్థాయిలో ఈ నేతలందర్నీ చుట్టబెట్టారు. అందువల్ల రేపు ఢిల్లీలో కూటములరాజ్యం వచ్చే అవకాశాలుంటే బాబే చక్రం తిప్పాలన్న యోచనతో ఆయన మరింత చొరవ తీసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. తానూ త్వరలోనే అమరావతిలో బహిరంగ సభ పెడతానని చంద్రబాబు కోల్‌కతా ర్యాలీ వేదిక మీద ప్రకటించారు. ఆయన ఉద్దేశం ఇంతకన్నా భారీ ర్యాలీని తానూ నిర్వహిస్తానని చెప్పడమే. తద్వారా తానూ రేసులో ఉన్నట్టు చెప్పుకోవడానికి ఆయన ప్రయత్నిస్తారు. ఢిల్లీలో చక్రం తిప్పాలన్న ఆశ తనకు లేదని చంద్రబాబు పదేపదే చెబుతుంటారు. అలాగే ప్రధానమంత్రి పదవి మీద వ్యామోహం లేదని కూడా సందర్భం వచ్చినప్పుడల్లా ప్రకటిస్తుంటారు. అది నిజమే కావచ్చు. కాని ఒకప్పటి సమీకరణాలకు ఇప్పటి సమీకరణాలకు పోలికే లేదు. ఇప్పుడు కేంద్రంలో నరేంద్ర మోడీని గద్దె దింపడమే ఆయన ప్రధాన లక్ష్యం. అహరహం శ్రమించైనా యావత్ ప్రతిపక్ష పార్టీలను ఒకచోటకి చేర్చి ఉమ్మడి కూటమి కట్టించి ఎన్డీయేని గద్దెదించాలని శపథం పట్టినట్టు ఆయన పనిచేస్తున్నారు. అందులో భాగంగా అవకాశమొస్తే ప్రధాని రేసులో ఉండేందుకు ఆయన వెనకాడబోవచ్చు. అదీగాక పాతికేళ్ల క్రితం చూస్తే చంద్రబాబుకి అందివచ్చిన వారసుడు లేడు. ఇప్పుడు అలా కాదు. ఆయన కుమారుడు లోకేష్ రాజకీయ రంగప్రవేశం చేశారు. ఎమ్మెల్సీగా ఉన్నారు. మంత్రి అయ్యారు. అటు పార్టీ కార్యక్రమాలు, ఇటు మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతదూరం వచ్చాక అవకాశమొస్తే రాష్ట్ర పగ్గాలు కుమారుడికి అప్పగించి తాను ఢిల్లీ గద్దెనెక్కడానికి చంద్రబాబుకి అభ్యం తరం ఎందుకుంటుం ది? ఇదంతా రెండు మూ డు నెలల్లో లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టే అనుకోండి. ఆమాటకొస్తే ఏ కూటమి రాజకీయాలైనా ఎన్నికల్లో ఎవరికి ఎన్నెన్ని సీట్లు వచ్చాయన్నదానిమీదే ఆధారపడి ఉంటాయి. కోల్‌కతా ర్యాలీ ద్వారా మమతా బెనర్జీ ఒక్కరే తెరమీదికి రాలేదు. ర్యాలీ జరపడం ద్వారా ఆమె బరిలోకి వచ్చి నిలిస్తే..అదే ర్యాలీకి రాకపోవడం ద్వారా మాయావతి తెరమీదికి వచ్చారు. కేవలం తన ప్రతినిధిని పంపారు. అది కూడా అన్యమనస్కంగానే పంపినట్టు కనిపిస్తున్నది. ఎస్పీ-బీఎస్పీ కూటమిలోని తన భాగస్వామి అఖిలేష్ యాదవ్ వచ్చారు గాని ఆమె రాలేదు. కోల్‌కతా ర్యాలీ లో ఏమి జరుగుతుందో ఆమెకు తెలుసు. వక్తలందరూ మమతను ఆకాశానికి ఎత్తేస్తారు. దాంతో సహజంగానే ఆమె ఫోకస్ అవుతారు. దేశం మదిలో ఆమె ప్రధానమంత్రి అభ్యర్థిగా నమోదైతే మరి తన సంగతేమిటి? పోనీ ఆ సభ విఫలమైతే అది వేరే సంగతి. మమతా బెనర్జీ కోటలో మమతా బెనర్జీ తనకు తానుగా పట్టుబట్టి పెట్టిన సభ విఫలమవుతుం దని ఆమె శత్రువులు కూడా ఊహించరు. అందు వల్ల ఎటు చూసినా ఆమె ప్రాజెక్టు కావడం తథ్యం. అలాంటి వేదిక మీద నుంచి తానూ ప్రధానమంత్రి బరిలో ఉన్నా నని తనకు తానుగా చెప్పు కోవడం ఎంత కష్టం? ఆ సంగతి మాయావతి కి తెలుసు కాబట్టే ఆమె డుమ్మా కొట్టారు. ఇదే సమయంలో ఒక సందే హం రావచ్చు. మరి ఆమె కూటమి లోని అఖిలేష్ యాదవ్ వచ్చారు కదా! మాయావతి తోను, మమత తోను పోలిస్తే అఖిలేష్ చాలా జూనియర్. ఆ సంగ తి అఖిలేష్‌కీ తెలుసు. తాను ప్రధాన మంత్రి బరిలోకి ప్రవేశం చే అర్హతను ఇంకా పొందలేదు. అలాం టప్పుడు ప్రతిపక్ష ఐక్యత ఎజెండాగా జరిగిన ర్యాలీకి వెళ్లడంలో లాభమే తప్ప తనకు వ్యక్తిగతంగా నష్టమేమీ ఉండదు. ఈ లెక్కలేసు కునే ఆయన హాజరయ్యారు. అయితే అఖిలేష్ తన తండ్రిని ప్రధాని బరిలో నిలబెట్టే ప్రయత్నం చేయరా? ఆ ఆలోచనే ఉంటే ఈ ర్యాలీకి రావడం అఖిలేష్‌కీ కష్టంగా ఉండేదే. అయితే తండ్రీ కొడుకుల మధ్య కేవలం రక్తసంబంధం తప్ప రాజకీయ సం బం ధబాంధవ్యాలు సరిగా లేవు. ఆపరిస్థితుల్లో అఖిలేష్ తన రాజకీయ భవిష్యత్తుని తానే ఒంటరిగా రచించు కుంటున్నా రు. అందు వల్ల తండ్రి కోసం ఆయన కూటము లకు గండికొట్టే ప్రయత్నాలు చేయకపోవ చ్చు.



కోల్‌కతా కూటమి గా మున్ముందు ముద్రపడే ఈ నాలుగో కూటమిలో ఇంత వరకు ముగ్గురు ప్రధా ని అభ్యర్థులు లెక్క తేలు తున్నారు. ఇదే కూటమి లో ఇంకో వైరుధ్యం ఉంది. అఖిలేష్- మాయా వతి ఉప కూటమి కాంగ్రెస్ పార్టీని పక్కన పెట్టింది. తద్వారా కాంగ్రెస్ పార్టీని అంటరాని పార్టీగా ఉత్తరప్రదేశ్ ఓటర్లకు చెప్పినట్టయింది. ఒకవేళ జాతీయ స్థాయిలో ఆపార్టీకి ఒకమోస్త రు లేదా గణనీయస్థాయిలో సీట్లొచ్చినా దాని సీటు మాత్రం వెనకేనన్న సంకేతాలిచ్చిన ట్టయింది. ఈ విషయంలో మమతా బెనర్జీదీ కొంచెం అటు ఇటుగా ఇదే వైఖరి. ఆమె రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి సుతరామూ ఒప్పుకోవడం లేదు. అలాగని కాంగ్రెస్ లేని కూటమి వల్ల ఉపయోగం లేదని తెలుసు. కాంగ్రెస్ పార్టీతో జత కడితే మాయావతి రారని ఆమె నమ్మకం. అందుకే సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కోల్‌క తా ర్యాలీకి రాకుం డా ఉండేవిధంగా మమతా బెనర్జీ జాగ్రత్త పడ్డారు. అయినా మాయావతి రాలేదు. ఆమెకు ఈ కోల్‌కతా వేదిక మీద కాం గ్రెస్ పార్టీ ఉనికికన్నా మమతాబెనర్జీతో పోటీ యే ముఖ్యమైంది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ లేకపోతే వేరే సంకేతాలు వెళతాయన్న ఉద్దేశంతో ఆ పార్టీ తరపున మల్లికార్జున ఖర్గే. అభిషేక్ సింఘ్వీని పంపించారు. అభిషేక్ సింఘ్వీని అటు కాంగ్రెస్ ప్రతినిధిగా కాకున్నా పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్య సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఎటు చూసినా ఇబ్బంది లేకుండా ఆయన్ని కూచోబెట్టారు. వ్రతం జరిగినట్టూ ఉంటుంది..పుణ్యం దక్కినట్టూ ఉంటుంది. ఈ ర్యాలీకి మాయావతి రాకుండా..ఆమె కూటమిలోని అఖిలేష్ రావడం ద్వారా..మున్ముందు తమ ఉప కూటమి నడత ఎలా ఉంటుందో సూచాయగా చెప్పినట్టయింది.

మాయావతి ప్రమేయాన్ని బట్టి, కాంగ్రెస్ పార్టీ ఉనికిని బట్టి ఎప్పటికప్పుడు లెక్కలేసుకునే వైఖరే కనిపిస్తున్నది. మమతా బెనర్జీ జరిపిన కోల్‌కతా ర్యాలీకి నేతలు భారీగా రావడమే కాకుండా జనసందోహమూ భారీగానే వచ్చింది. వేదిక మీద ఆరుగురు మాజీ ముఖ్యమంత్రులు, నలుగురు ప్రస్తుత ముఖ్యమంత్రులు, అనుభవాలతో డక్కామొక్కీలు తిన్న వృద్ధ నేతలు, ఉత్సాహం ఉరకలేస్తున్న యువనేతలు.. ఇలా అన్ని వయస్సుల సమ్మిళితమై ఆ ర్యాలీ కొత్త ఆశలకు ఊపిరులూదింది. మమతా బెనర్జీ ఒకరోజు ముందు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ చేసి ర్యాలీకి ఆహ్వానించారు. ఇక్కడే ఆమె దారి తప్పారనిపిస్తున్నది. సీఎం కేసీఆర్ కోల్‌కతా వెళ్లి దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఆవిర్భావ అవసరాన్ని గురించి ఆమెతో చర్చించి వచ్చారు. తన మనోగతాన్ని ఆమెకు వెల్లడించారు. అంటే తాను కోల్‌కతా ర్యాలీకి ప్రణాళిక రచించక ముందే ఆయన ఆమెని కలిశారు. అయినా ఆమె తన ఆలోచనలను కేవలం ఒకరోజు ముందుదాకా కూడా పంచుకోకుండా కేవలం కొద్ది గంటల ముందుగా ఫోన్‌లో ఆహ్వానించడంలోని ఔచిత్యం ప్రశ్నార్థకమే. కోల్‌కతా ర్యాలీకి, తన ఫెడరల్ ఫ్రంట్ వ్యూహానికి మధ్య సైద్ధాంతిక వ్యత్యాసం ఉందని గ్రహించిన సీఎం కేసీఆర్ ఆమె ఆహ్వానాన్ని నిశ్శబ్దంగానే తిరస్కరించారు. ఆయన వెళ్లలేదు. బీజేపీ, కాంగ్రెస్ లేని ఫ్రంట్ ఆయన లక్ష్యం కాగా.. కాంగ్రెస్ లేకుండా కష్టమని మమత భావిస్తున్న తరుణంలో ఆ ర్యాలీకి కేసీఆర్ వెళ్లడంలో అర్థం ఉండదు. దీన్నిబట్టి ఫెడరల్ ఫ్రంట్ మరో కూటమిగా తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయక తప్పదు. దీన్నిబట్టి ఇప్పటికి మొత్తం మీద ఐదు కూటములు లెక్కతేలుతున్నాయి. ఇందు లో ఒక్క కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ మౌలిక లక్షణాలు మాత్రం సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ దిశగా తనతో కలిసి వచ్చే పార్టీలతోనే ముందుకెళ్లే కసరత్తులో కేసీఆర్ ఉన్నారు. ఇక మమతా కూటమి గాని, మాయావతి కూటమి గాని, యూపీఏ కూటమి గాని ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని బట్టి ఆలోచనలు మార్చుకుంటూ.. లక్ష్యానికి అనుగుణమైన మార్గాన్ని ఎంచుకుంటూ ముందుకు వెళ్లే అవకాశాలే ఎక్కువున్నాయి.

రెండు కూటములు మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా ఉద్విగ్నభరిత వాతావరణా న్ని సృష్టిస్తున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ తన ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణ ప్రయత్నాల్లో భాగంగా వైసీపీతో చర్చలు జరపడం తెలుగు రాజకీయాల్ని ఒక కుదుపు కుదిపింది. జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పక్షంగా ఉన్న సంగతి తెల్సిందే. ఈసారి ఎలాగైనా అధికారం హస్తగతం చేసుకోవాలని జగన్ ఈమధ్యే ఏడాదికాలపు పాదయాత్ర జరిపారు. కేంద్రంలో మోడీని గద్దెదించాలంటే ఏపీలోని లోక్‌సభ సీట్లు చాలా ముఖ్యమని గ్రహించిన కేసీఆర్ జగన్‌ని తన కూటమిలోకి ఆహ్వానించారు. జగన్ కూడా ప్రస్తుతం తనకు తోడు కోరుకుంటున్నారు. ఏపీలో చంద్రబాబుని ఎదుర్కోవాలంటే కాకలుదీరిన యోధుడు అవసరమని భావిస్తున్నారు. ఆడబోయే తీర్థం ఎదురైనట్టు.. కాకలు దీరిన యోధుడే కాకుండా..ఏకంగా పక్కరాష్ట్రం ముఖ్యమంత్రే స్నేహహస్తం చాస్తే ఇంకేం కావాలి? అందుకే ఆలస్యం చేయకుండా జగన్ కేసీఆర్ పంపిన దూతలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆ ప్రయత్నం కార్యసాధన క్రమంలోనే సక్రమంగా సాగుతున్నది. సీఎం కేసీఆర్ రెండో అంచెలో భాగంగా తానే అమరావతి వెళ్లి జగన్‌తో అన్ని విషయాలు మాట్లాడి సయోధ్యను ధృవీకరించుకుని రావాల్సిఉంది. మోడీ మీద యుద్ధం పేరుమీద జగన్‌తో కేసీఆర్ సయోధ్య కుదుర్చుకోవడాన్ని తెలుగుదేశం తప్పుబడుతోంది. ఆ సాకుతో కేసీఆర్ తనమీద యుద్ధానికి తలపడుతున్నారన్నది చంద్రబాబు ఆరోపణ. ఇలాంటి ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎన్నికలు ముగిసేదాకా నడుస్తూనే ఉంటాయి. మొత్తంమీద రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరు ముఖ్యమంత్రులు రెండు వేర్వేరు కూటములు నడుపుతున్నారన్నది మాత్రం వాస్తవం. ఇందులో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అనే కూటమికి తానే సారథై..తానే సిద్ధాంతకర్తగా..తానే రూపశిల్పిగా

తానే స్వయంగా చర్చలు జరుపుతూ ముందుకెళుతున్నారు. చంద్రబాబు మాత్రం జాతీయస్థాయిలో అందర్నీ కలిపే ప్రయత్నంలో తానొక సంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆ కూటమికి ఎవరు సారథి అన్న విషయం మాత్రం గుంభనంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇన్ని కూటముల మధ్య సాగే పోరులో రేపు ఫలితాల తర్వాత ఏయే కూటములు కలవాల్సి వస్తుందన్నది మరో ప్రశ్న. అందుకే ఏయే కూటముల మధ్య భావసారూప్యత గరిష్టస్థాయిలో ఉంటుందో ఇప్పటినుంచే ఆ దిశలో ప్రజలు ఆలోచించసాగారు. మోడీని ఓడించడమే ప్రతిపక్షాల లక్ష్యం కావచ్చుగాని అంతటి ఏకైక ఎజెండాతో జనం కూడా ఉన్నారా అంటే అది సమాధానం దొరకని ప్రశ్నే. అందుకే..ఎవ్వరొచ్చినా పాలనలో పారదర్శకత..స్థిరత్వం ఉంటే చాలన్నది ప్రజల మనోగతం. ఆ మనోగతాన్నే ప్రజలు ప్రతిసారీ వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు..మధ్యలో ఎవరెవరో వచ్చి హైజాక్ చేస్తుంటారు!

-వయ్యస్సారెస్

మాయావతి ప్రమేయాన్ని బట్టి, కాంగ్రెస్ పార్టీ ఉనికిని బట్టి ఎప్పటికప్పుడు లెక్కలేసుకునే వైఖరే కనిపిస్తున్నది. మమతా బెనర్జీ జరిపిన కోల్‌కతా ర్యాలీకి నేతలు భారీగా రావడమే కాకుండా జనసందోహమూ భారీగానే వచ్చింది. వేదిక మీద ఆరుగురు మాజీ ముఖ్యమంత్రులు, నలుగురు ప్రస్తుత ముఖ్యమంత్రులు, అనుభవాలతో డక్కామొక్కీలు తిన్న వృద్ధ నేతలు, ఉత్సాహం ఉరకలేస్తున్న యువనేతలు.. ఇలా అన్ని వయస్సుల సమ్మిళితమై ఆ ర్యాలీ కొత్త ఆశలకు ఊపిరులూదింది. మమతా బెనర్జీ ఒకరోజు ముందు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ చేసి ర్యాలీకి ఆహ్వానించారు.

విలక్షణమైన స్క్రీన్ ప్లేతో 'విలన్' సక్సెస్




తోటపల్లి సాయినాథ్,
9394449777

మాస్ కథాంశంతో నడిచే చిత్రాలకు సహజత్వానికి దగ్గరగా స్క్రీన్ ప్లే ఉన్నప్పుడే అవి ప్రేక్షకుల అభిమానం పొందుతాయన్న అభిప్రాయం సర్వత్రా ఉంది.ఇదే అభిప్రాయంతో నేను స్క్రిప్ట్ రాసిన చిత్రం విలన్. వాస్తవంగా ఈ చిత్రం తమిళంలో విలన్ పేరుతో విడుదలై గొప్ప విజయం సాధించింది.ఈ సినిమాలో అజిత్ హీరో.అదే సినిమాను తెలుగులో సుంకు రమేష్ సారథ్యంలో నిర్మించారు.తెలుగు విలన్ చిత్రంలో రాజశేఖర్ హీరో. కొత్త అమ్మాయి నేహా దూపియా హీరోయిన్.

ఇక నేను ఈ సినిమాకు స్క్రిప్ట్ రాయడానికి కారణం,సుంకు రమేష్‌తో 1984 నుంచి ఉన్న పరిచయమే.ఆయన ఫిలిం ఫైనాన్సర్.మీడియేటర్ కూడా. చెన్నైలో ఉన్న నాకు ఆయన ఓ రోజు ఫోన్ చేశారు.హైదరాబాద్ వస్తే ఓ సినిమా గురించి మాట్లాడదామని అన్నారు. నేను హైదరాబాద్ వెళ్ళగానే ఆయన నన్ను శింగనమల రమేష్ దగ్గరకు తీసుకెళ్ళారు. అక్కడ మల్లికార్జునరావు అనే పాత పరిచయస్థుడు ఉన్నారు. కెఎస్ రవికుమార్ తమిళంలో దర్శకత్వం వహించిన విలన్ చిత్రాన్ని వాళ్ళు ముగ్గురూ కలిసి తెలుగులో నిర్మిస్తున్నట్టు చెప్పారు. కెఎస్ రవికుమార్ మిమ్మల్ని తీసుకుని రమ్మన్నారని చెప్పారు. నేను కెఎస్ రవికుమార్‌తో కలిసి పడియప్ప అనే తమిళ సినిమాకు పని చేశాం. తెలుగులో నర్సింహం చిత్రం... రజనీకాంత్ నటించిన ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్. కెఎస్ రవికుమార్ తమిళంలో మంచి పేరున్న సక్సెస్‌ఫుల్ డైరక్టర్. తమిళంలో ఆయన చేసిన ముత్తు, పడియప్ప, ఒరిజినల్ పెదరాయుడు. కమలహసన్‌తో పంచతంత్ర.... దశావతార వంటి చిత్రాలు ఘనవిజయం సాధించిన సంగతి అందరికీ తెలుసు. రవికుమార్ బస చేసిన హోటల్‌కి మేమంతా వెళ్ళాం. ఆయన నన్ను చూడగానే చాలా కాలం నుంచి మనం ఎదురు చూసిన రోజు వచ్చిందంటూ నాతో కలిసి తెలుగు సినిమా చేయడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు.మేమంతా కలసి తమిళంలో అజిత్ నటించిన విలన్ సినిమా డివిడి చూశాం. లాంఛనాలన్నీ పూర్తి అయిన తర్వాత నేను ఆ డివిడీని తీసుకుని వెళ్ళి ఆ చిత్రానికి డైలాగ్స్ రాయడం ప్రారంభించాను.

చిత్రం కథ విషయానికి వస్తే ఆ చిత్రంలో కథాంశం చాలా విలక్షణమైంది. హీరో రాజశేఖర్ సిటీ బస్సు కండక్టర్‌గా పని చేస్తూనే ఒక ఉన్నతమైన ఆశయంతో మరో పాత్రలో నటిస్తూ ఉంటాడు.ఆయన వికలాంగుడుగా కూడా నటిస్తుంటే డ్యూయల్ రోల్‌లా ఉంటుంది.ఎందుకు ఆయన ఆ విధంగా నటిస్తున్నాడు. చివరికి ఏం సాధించాడు అన్నది చిత్రంలో కొత్త పాయింటు. హీరో రాజశేఖర్



సినిమాలో హుషారుగా,జోవియల్‌గా నటించారు. హీరోని ప్రెజెంట్ చేయడంలో రవి కుమార్ ది డిఫరెంట్ స్టైల్. హీరో రాజశేఖర్ ను యాంగ్రీ యంగ్‌మన్ గా ప్రజెంట్ చేశారు. నూతన నటి అయినప్పటికీ హీరోయిన్ నేహా దూపియా ఎంతో ఆసక్తితో అన్ని సీన్లలో చక్కటి నటన కనబర్చింది.

ఈ చిత్రం షూటింగ్ జరుగుతున్నప్పుడు నాకు బాగా గుర్తున్న విషయం ఏమంటే మాస్ ఎలిమెంట్ ఓ చిత్రం విజయానికి కచ్చితంగా ప్రాణం వంటిది.ముఖ్యంగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్నప్పుడు మాస్ ఎలిమెంట్‌ను చాలా జాగ్రత్తగా గాజు వస్తువులా భావించాలి.ఆ చిత్రం విజయానికి అదే ప్రధాన కారణం అవుతుంది.1980 నుంచి 2000 సంవత్సరం వరకూ కానీ ఆ తర్వాత కూడా మాస్ ప్రేక్షకులు పెరుగుతూనే ఉన్నారు. రొమాన్స్,కామెడీ వంటి సీన్లను అభిరుచితో చూసేవారు 40 శాతం ఉంటే యాక్షన్ ,ఫైట్స్ తోఉంటే మాస్ అంటే ఇష్టపడే వారు 60 నుంచి 70 శాతం ఉంటారు.చిత్ర కథకు అనుగుణంగా మాస్ అప్పీయరెన్స్ ఉంటేనే అది సక్సెస్ అవుతుందని పాఠం నేర్పిన చిత్రం విలన్.గడిచిన 20 సంవత్సరాల్లో ప్రేక్షకుల అభిరుచిలో పెద్దగా తేడా లేదు. యాక్షన్ సినిమాల్లో కొత్తదనం ఉంటే ఎప్పటికి ఆదరణ అలాగే ఉంటుంది.చక్కటి కథాంశం,దానికి తగ్గట్టు రొమాన్స్ ,అంతే పకడ్బందీగా స్క్రీన్ ప్లే ఉంటే మాస్ చిత్రాలు ఎప్పుడైనా హిట్టవుతాయని ఈ చిత్రం నిరూపించింది.

శేఖర్ కమ్ముల వంటి దర్శకులు 2004 సంవత్సరం తర్వాత సినిమా ట్రెండ్‌ను మార్చారు. ఇప్పటి ట్రెండ్ విషయానికి వస్తే, పెళ్ళి చూపులు,అర్జున్ రెడ్డి, ఆర్ ఎక్స్ 100, గీత గోవిందం, క్షణం, ఇప్పటి ఎఫ్ -2వంటి చిత్రాలను సూపర్ హిట్ చేసిన ప్రేక్షకుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుంది. ప్రస్తుత సమాజంలో చదువుకున్న వారి సంఖ్య బాగా పెరిగింది. కాబట్టి వాళ్ళకో స్టయిల్,టేస్ట్ ఉంటాయి. సినిమా కథ,కథనం, పటిష్ఠంగా ఉంటే ప్రేక్షకులు దానిని సూపర్ డూపర్ గా హిట్ చేస్తారని ఈ రెండు, మూడేళ్ళలో మనం గమనిస్తూనే ఉన్నాం. మసాలాతో కూడిన ఎంటర్ టైనర్ చేస్తే దానిని అన్ని తరగతుల వారు చూస్తారు. సహజత్వం ఎక్కడా కోల్పోకుండా మాస్ ఎలిమెంట్‌ను నడిపిస్తే ఆ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది.

ఈ అభిప్రాయంతోనే విలన్ చిత్రంలో దర్శకుడు కెఎస్ రవి కుమార్ సహజత్వానికి పెద్దపీట వేశారు.ఈ సినిమాలో ఎక్కడైనా సుమోలు గాలిలో ఎగరవు. కత్తులతో నరికితే తలలు గాలిలో ఎగిరి పడవు. ఐటం సాంగ్‌లు లేవుకానీ, అంత ఉత్కంఠ గొలిపే విధంగా సహజత్వానికి దగ్గరగా ఉండే యాక్షన్ ఫిల్మ్‌గా ఆయన దానినితీర్చి దిద్దారు. ప్రస్తుతం ఫీల్ గుడ్ మూవీలను ఆదరించే ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగానే ఉంది.వారిని ఆకట్టుకోవాలంటే మాస్ యాక్షన్ సినిమాల్లో కూడా నమ్మశక్యంగా ఉండే సన్నివేశాలు ఉండాలని ఆయన అభిప్రాయం .దీనికి అనుగుణంగానే మేం విలన్ చిత్రం నిర్మాణలో సహజత్వానికి దగ్గరగా ఉండే విధంగా స్క్రీన్ ప్లే రాసుకున్నాం. కథలో ,కథనంలో, ఒక టెంపో క్రియేట్ చేయగలిగితే సక్సెస్ కచ్చితంగా వస్తుంది. చిత్ర విజయానికి ప్లానింగ్ తో కూడిన స్క్రీన్ ప్లే చాలా ముఖ్యం. ఈ విషయాన్ని తు.చ. తప్పకుండా పాటించాం., కాబట్టే విలన్ చిత్రం ప్రేక్షకులకు నచ్చింది.దానికి తగ్గట్టు గా రాజశేఖర్ నటన,ఆ పాత్రలకు ఆయన తగ్గట్టుగా యాక్షన్,రొమాన్స్ లతోపాటుకొన్ని సీన్లలో కామెడీ గా నటించి మెప్పించారు. ఈ సినిమాకు విజయశ్రీగారు కెమెరా వుమన్.ఆమె అశోక్ కుమార్ శిష్యురాలు. భర్త కృష్ణతోకలిసి ఆమె చాలా చక్కగా సీన్లను చిత్రీకరించారు.ఈ చిత్రంలో మ్యూజిక్ అద్భుతంగా పండింది.రీరికార్డింగ్ కూడా బాగా వచ్చింది. ఇవన్నీ ఇంత చక్కగా సమకూరడంలో నిర్మాతలు శింగనమల రమేష్, సుంకురమేష్, మల్లికార్జునరావుల కృషి చాలా ఉంది. అందరి కృషి, అంకిత భావం,పట్టుదలతో పాటు విలక్షణమైనస్క్రీన్ ప్లే వల్ల విలన్ చిత్రం విజయం సాధించింది.

మహాభారతంలో... సావిత్రి

సావిత్రి మద్రరాజు అశ్వపతి పుత్రిక. ఆతడు సంతానార్థియై సావిత్రీదేవిని పూజించాడు. ఆ దేవి ప్రత్యక్షమై వరం కోరమన్నది. అపుడు ఆతడు పుత్రుణ్ణి ఇవ్వమన్నాడు. అది కుదరదు నీకు పుత్రికే కలుగుతుంది. ఇది బ్రహ్మ నిర్దేశం. కాని ఈ కన్నియ కారణంగా నీకు పుత్ర శతలాభం ప్రాప్తిస్తుందని అనుగ్రహించింది. తర్వాత సావిత్రీదేవి వరప్రసాదంగా కుమార్తెను ధర్మపత్ని మాళవి వలన ఆతడు పొందాడు.

తర్వాత సావిత్రి యౌవనవతి అయ్యింది. తండ్రి యోగ్యవరుణ్ణి వెదకసాగినా ఎవ్వరూ అటువంటివారు కన్పించలేదు. సావిత్రి మాత్రం సత్యవంతుడి గుణగణాలకు ఆకర్షిత అయి ఆతణ్ణి ప్రేమిస్తున్నది గాని సిగ్గుతో తల్లిదండ్రులకు చెప్పుట లేదు. ఒకరోజు నారద మహర్షి వచ్చాడు. కన్యక వివాహం గూర్చి ప్రశ్నించాడు. అశ్వపతి తన అసమర్థతను తెలియజేశాడు. అపుడామె కొంతకు కొంత సిగ్గుతగ్గించుకుని సత్యవంతుణ్ణి ప్రేమిస్తున్నానని చెప్పింది. సత్యవంతుడు ద్యుమత్సేనుడి కుమారుడు. ద్యుమత్సేనుడు శత్రువుల చేతిలో ఓడి అరణ్యవాసం చేస్తున్నాడు. నేత్రహీనుడూ అయ్యాడు. ఈ విషయం తెలిసే సావిత్రి ఆతణ్ణి వరించానన్నది. ఆమె స్థిర నిర్ణయానికి తిరుగుండదని తండ్రి గ్రహించి సత్యవంతుడెట్టివాడో తెల్పమని నారదుణ్ణి కోరాడు. సత్యవంతుడి గుణగరిష్ఠతను నారదుడు ఏకరవు పెట్టాడు. సత్యవ్రతుడు అవడంతో సత్యవంతుడయ్యాడని, అసలు పేరు చిత్రాశ్వుడని చెప్పాడు. అయితే ఒకటే లోపం అన్నాడు. నేడు మొదలుకొని ఒక సంవత్సరకాలమే జీవిస్తాడని చెప్పాడు.

అయినా సావిత్రి మనసు మారలేదు. ఆమె పుణ్యమహిమ వలన పుర్ణాయుష్కుడవు తాడేమో అట్లే వివాహం చెయ్యమన్నాడు నారదుడు. విపినంలోనే సావిత్రి సత్యవంతుణ్ణి పెండ్లాడింది. క్రమం తప్పక అత్త మామల్ని భర్తని సేవింప దొడగింది. రోజులు లెక్కిస్తున్నది. ఇక నాల్గు దినాలు మాత్రమే భర్త జీవితా నికి గడువున్న ది. దాంతో త్రిరాత్రోపవాస వ్రతాన్ని ఆచరించదొడగింది. మామ, ద్యుమత్సేనుడు ఈ కఠిన వ్రతం వలదన్నాడు. కాని ఆమె సకల శుభాలకైది ఆచరిస్తున్నానం. ఇందుకైన కారణం మీదట మీకు తెలుస్తుందన్నది. మూడు రోజులు గడిచాయి. నాల్గోరోజూ పారణం చేసి భుజించలేదు. మామ చెపినా వినలేదు. ప్రొద్దు క్రుంకేదాకా భుజించను. వ్రతప్రారంభంలో అలా దీక్ష పూనానన్నది. సత్యవంతుడు సమిత్కుశ ఫలాలు తేవగా అరణ్యానికి వెళుతున్నాడు. తానూ వస్తానన్నది. నీవు ఉపవాసంతో నీరసించి ఉన్నావు. రావలదన్నాడు.



వనశోభ తిలకించడానికై వస్తాను, ఉపవాస క్లేశం నాకేమాత్రం లేదని చెప్పి అనుసరించింది. అత్తమామల అనుజ్ఞ కూడా పొందింది. మనసులోని అలజడి బయట పడనీయలేదు. వనశోభ తిలకిస్తూ కొంతదూరం నడిచారు. సత్యవంతుడు పండ్లు సేకరించి గొడ్డలితో వంటకట్టెలకై చెట్లను నరకజొచ్చాడు. శ్రమ అధికమై, నిర్వీర్యుడై, వివర్ణుడై సావిత్రి అంకంపై తలనిడి విశ్రమించాడు. తర్వాత భీకరాకారుడై యముడు సత్యవంతుడి ప్రాణహరణార్థం వచ్చాడు. పాతివ్రత్య మహిమవల్ల ఆమెకు కన్పించాడు. సత్యవంతుడు మహాపుణ్యనిధి అవడం చేత తానే స్వయంగా వచ్చానన్నాడు. అది ఆతడిచ్చిన గౌరవం. లేకుంటేతత యమభటులు వచ్చేవాళ్లు. ప్రాణాలు గ్రహించి వెళుతుండగా సావిత్రి భర్త దేహాన్ని రహస్య ప్రదేశంలో దాచి యముణ్ణి అనుసరించింది. ఆతడు వారించాడు. మార్గమే అగమ్యమన్నాడు. ఆమె వినలేదు. పతుల మార్గమే సతుల ధర్మమన్నది. నాపతి భక్తివల్ల, నీ అనుగ్రహం వల్ల నాకు అగమ్యమార్గం ఉండదన్నది.

అన్ని మార్గాలలో ధర్మమార్గం ప్రధానం. ధర్మానికి ఆధారం సజ్జనులు. నీవు సజ్జన శేఖరుడవు. నీదర్శనం అయ్యింది. అది వృథాకాదు. కాగా రిత్తహస్తాలతో ఎలా తిరిగి వెళ్లనన్నది. యముడామె ప్రగల్భవచనాలకు అద్భుతం చెంది ఇలా పలికాడు. ఓ సావిత్రి! నీ ఉదారవాక్యాలు నన్ను సంతోషింపజేశాయి. నీకు ఒక వరం ఇస్తాను. అదీ నీ పతి ప్రాణం మాత్రం కాదు అని. అపుడు ఆమె నా మామ రిపువిమర్దనుడై, చక్షురహితుడై అరణ్యావాసం చేస్తున్నాడు. ఆయనకు నేత్రాలు ఇవ్వమన్నది. తథాస్తు అన్నాడు సమవర్తి. తర్వాత కూడా ఆమె ఆతడి వెనుకే వెళ్లసాగింది. పెద్దలు మనోవాక్కాయ కర్మలతో ఎవ్వరికీ అపకారం చెయ్యరు. దీన జన రక్షణ వారిధర్మం. అనంతంగా అందరి కోర్కెలు తీర్చుతారు. ఆశ్రితుల్ని అన్ని విధాల కాపాడతారు. నీకు తెలియందేముంది? ధర్మగతులన్నింటికి నీవే ఆధారం.అందుకే నీవు ధర్మదేవతవయ్యావు. నీవు అందరియెడల సమభావుడవు కాబట్టి సమవర్తివి. యమించే వాడివి కావున యముడవు. కల్మష శమనం చేయడం చేత శముడవు అని పలికింది. ఆ మాటలకు యముడు ప్రీతుడై మరోవరం కోరమన్నాడు అదే సత్యవంతుడి ప్రాణాలు విడిచి. అపుడామె శత్రువులవల్ల పోయిన రాజ్యాన్ని తన మామకు ఇప్పించమన్నది. అట్లే అగుగాక అన్నాడు ధర్మరాజు. ఇది దుర్గమంపు త్రోవ ఇక రావలదని పలికాడు. అయినా ఆమె నిలువలేదు. మరల ధర్మసూక్ష్మం చెప్పింది. పతిబాటలో నడవడం ధర్మమన్నది. నీవు ప్రకట ధర్మవిశేష తత్పరవని పొగడి మరోవరం కోరమన్నాడు యమధర్మరాజు. తన తండ్రికి శతపుత్రలాభం వరంగా పొందింది. అయినా ఆగలేదు.

నీవు బహుదూరం వచ్చి అలసావు. దప్పిక గొన్నావు. ఇక నిలవమన్నాడు. నాకు దప్పికలేదు. అలసట లేదు. సతులకు పతి భక్తేముఖ్యం. భర్తను పొందటమే సతులకు ధర్మం. ఆత్మధర్మ నిరతులైన వారే పుణ్యాత్ములు. వారు అరుదు. అయితే వారి సంసర్గమే సకలపాపహరం అన్నది. వారి వల్లే సమస్తచరాచరజగత్తు సాగుతున్నదన్నది.

అట్టివారిలో నీవు ముఖ్యుడవు. సఖ్యం సాప్తపదీనమని గదా పెద్దలమాట. మనమిద్దరం ఎన్నో మాటలు, మాట్లాడినాం. ఎంతోదూరం కలిసి నడిచాం. కాగా స్నేహితులం. బంధువులం. మిత్రమనోరథం తీర్చడం అవశ్యకర్తవ్యం గదా! అన్నది. యముడు ఆమె మాటలకు మెచ్చి మరోవరం ఇస్తానన్నాడు. పతిప్రాణం తప్ప అనలేదు. భర్తలేని జీవనం దుస్సహం. ఆమె జీవితం సమస్త మంగళకార్యావిశేషాలలో నింద్యం. కావున పతి ప్రాణభిక్ష పెట్టమన్నది. యముడు సంతోషించి సత్యవంతుడి ప్రాణాలు తిరిగి ఇచ్చాడు. పైగా నాల్గువందల సంవత్సరాలు జీవిస్తాడు. వందమంది పుత్రుల్ని పొంతుతాడు. కులవర్ధనుడై, దేవతల్ని అధ్వరాదులవల్ల సంతృప్తుల్ని చేస్తాడని చెప్పి అంతర్థానం చెందాడు. సావిత్రి తిరిగివచ్చి పతి దేహాన్ని అంకమందు చేర్చి నిరీక్షించింది. నెమ్మదిగా నిద్రవీడిన మాదిరిగా సత్యవంతుడు లేచాడు. తననెవరో ఎత్తుకు వెళ్లిన విధం చెప్పాడు. నెమ్మదిగా భార్య అండతో తల్లిదండ్రుల్ని చేరాడు. తండ్రికి నేత్రాలు వచ్చాయి. ఆశ్రమవాసులు ఆశ్చర్యచకితులయ్యారు. జరిగిన విషయాన్నంతా సావిత్రి అత్తమామలకు, మునులకు చెప్పింది. వారు ఆమెను కీర్తించి దీవించారు. ఇంతలో శత్రువులు పరాజితులయిన విధం చెప్పి చతురంగ బలాలతో పౌరముఖ్యులు మంత్రులేతెంచి రాజధానికి రాజును సకుటుంబకంగా తీసుకుపోయారు. ద్యుమత్సేనుడు తన కొడుకును యౌవరాజ్య పట్టాభిషిక్తుణ్ణి చేసి సుఖించాడు.

"తన మగని, నత్తమామల
జననీ జనకులను, తన్ను సకల కులంబున్
ఘనముగ సముద్ధరించెను
జనవర సావిత్రి ధర్మచరితము కంటే" అని మార్కండేయుడు పలికి, ఈ ద్రౌపది కూడా అట్టిదే. మిమ్మల్ని, మీ అన్వయాన్ని ఉద్ధరిస్తుందని చెప్పి తన ఆశ్రమానికి వెళ్లాడు.


సావిత్రి వరపుత్రి. ధీనిధి. మంజువాణి. పుంవత్ప్రగల్భ కూడా. నేర్పరి. కార్యసాధన చతుర, సుదృఢచిత్తం, దక్షత ఆమె సొంతం. దాంతో వరించి నవాడి ప్రాణాలు దక్కించుకున్నది. సందర్భ సాను కూల వాక్యాలతో, యథార్థస్తుతితో యముణ్ణి సంప్రీ తుణ్ణి చేసి విజయం సాధించింది. తెలిసో తెలియకో సత్యవంతుణ్ణి ప్రేమించింది. మధ్యలో ఆతడు ఏక సంవత్సర మాత్రాయుష్కుడని తెలిసినా వెనుదిరగలేదు. ఆమె సుస్థిర ప్రేమే సత్యవంతు ణ్ణి బ్రతికించి భాగ్యవంతుణ్ణి చేసింది.



కళారత్న, (హంస)
డా.సి హెచ్.బాబావలిరావు
హైదరాబాద్, 9989792247

న్యాయం...ఎనలేని జాప్యం

- కోర్టుల్లో పెరిగిపోతున్న పెండింగ్ కేసులు ● తగ్గుతున్న జడ్జీల సంఖ్య
- లక్షా 87 వేల కేసులతో తెలంగాణ హైకోర్టు ప్రారంభం ● మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 24 ● పని చేస్తున్న జడ్జీల సంఖ్య 13



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సత్వర న్యాయం, సమాన న్యాయం దేశ ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగి పోతోంది. ఇక న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సిబ్బంది సంఖ్య తగ్గిపోతోంది. సామాన్యులకు సత్వర న్యాయం సాకారమయ్యే అంశం మరుగున పడిపోతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు రెండు హైకోర్టులు ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమయ్యింది. తమ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు కావాలనే తెలంగాణ న్యాయవాదుల ఆకాంక్ష నెరవేరింది. జనవరి 1న తెలంగాణ హైకోర్టు ఆవిర్భవించింది.

తెలంగాణలో...

ఈ నేపథ్యంలో లక్షా 87 వేల పెండింగ్ (ఓపెనింగ్ బ్యాలన్స్) కేసులతో తెలంగాణ హైకోర్టు ప్రారంభమైంది. ఉమ్మడి హైకోర్టులో మొత్తం 3.40 లక్షల కేసులు పెండింగ్ ఉండగా, ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో సగానికి పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నాణ్యమైన న్యాయాన్ని సకాలంలో అందించేందుకు తీవ్రమైన కృషి చేయాల్సి ఉంది. ఇందుకోసం అందుబాటులో ఉన్న న్యాయమూర్తులతో క్రమశిక్షణ, సమతుల్యతతో అవసరమైన వేగాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణ హైకోర్టు కార్యకలాపాల ప్రారంభం సందర్భంగా తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ వ్యాఖ్యానించడం గమనార్హం. తెలంగాణ హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 24. కాగా ప్రస్తుతం 13 మంది న్యాయమూర్తులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి హైకోర్టులో దాదాపు రోజుకు 60 నుంచి 90 కేసులు నమోదయ్యేవి. ఈ కేసుల్లో 60 శాతం ఏపీ నుంచి దాఖలయ్యేవి. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత రోజుకు 30 నుంచి 40 కేసులు మాత్రమే దాఖలయ్యే అవకాశం ఉందని, మొత్తం మీద కేసుల సంఖ్య తగ్గుతుందని న్యాయవాదులు అభిప్రాయపడ్తున్నారు. ఖాళీల కారణంగా న్యాయమూర్తులకు పనిభారం తగ్గే అవకాశం లేకుండా పోయింది.

సుప్రీంకోర్టులో

సుప్రీంకోర్టులో మే, 2017 నాటికి 60,751 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 24 హైకోర్టుల్లో గత సంవత్సరం సెప్టెంబర్ నాటికి 40.11 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఉమ్మడి హైకోర్టులోనే 3,40,000 కేసులు విచారణలో ఉండేవి. హైకోర్టులో కేసులు పేరుకుపోయే ప్రక్రియ నానాటికీ పెరిగిపోతోంది. 2012 వరకు 2,10,101 పెండింగ్ కేసులుండగా, అవి 2016 సెప్టెంబర్ నాటికి వాటి సంఖ్య 2,85,663కు చేరింది.

ఏడాదికి దాదాపు 18 వేలకు పైగా కేసులు పెండింగ్ లో ఉంటున్నాయి.

దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల తీరుతెన్నులు

దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మొత్తం కేసులు. 2,41,47,468. వీటిలో సివిల్ కేసులు, 77,50,856. క్రిమినల్ కేసులు 1,63,96,612. పదేళ్లకు పైబడినవి, 22.63 లక్షలు (9.37 శాతం). 5 నుంచి పదేళ్ల కేసులు, 39.66 లక్షలు (16.43 శాతం). ఇక రెండేళ్ల నుంచి ఐదేళ్ల కేసులు, 70,50 లక్షలు (29.19 శాతం). చివరగా రెండేళ్ల లోపు కేసులు 1,09 కోట్లు(45.03శాతం).

ఆంధ్రప్రదేశ్ రాష్ట వ్యాప్తంగా మొత్తం కేసులు 4,33,391. వాటిలో సివిల్ కేసులు 2,47,288. క్రిమినల్ కేసులు 1,86,103. పదేళ్లకు పైబడిన కేసులు 8.131 (1.88 శాతం). ఐదు నుంచి పదేళ్ల కేసులు 48.773 (11.25 శాతం). రెండేళ్ల నుంచి ఐదేళ్ల కేసులు 1,29,038 (29.77శాతం). రెండేళ్ల లోపు కేసులు 2,47,449 (57 శాతం).

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం కేసులు 3,88,780. వాటిలో సివిల్ కేసులు 1,87,244. క్రిమినల్ కేసులు 2,01,536. పదేళ్లకు పైబడినవి 23,524 (6.05 శాతం). ఐదు నుంచి పదేళ్ల కేసులు 52,336 (13.46 శాతం). ఇక రెండేళ్ల నుంచి ఐదేళ్ల కేసులు 1,25,966 (32.40శాతం) రెండేళ్ల లోపు కేసులు 1,86,954 (8.09 శాతం) పెండింగులో ఉన్నట్లు తెలుస్తోంది.

న్యాయమూర్తులు, సిబ్బంది కొరత

దీనికి తోడు న్యాయాధికారులు, సిబ్బంది ఖాళీలు ఎక్కువగా ఉండటం వల్ల సమస్య మరింత జఠిలమవుతోంది. పది లక్షల జనాభాకు 50 మంది ఉండాలని 198లో లా కమిషన్ సిఫారసు చేసినా ఇప్పటి వరకు 13 మందికి మించి ఉండటం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా 24 హైకోర్టుల్లో 406 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టులో 32 జడ్జీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ మొత్తం 61 పోస్టులకు గాను ప్రస్తుతం 29 మంది మాత్రమే పని చేస్తున్నారు. 2014 జూన్ 30న దేశంలో 906గా ఉన్న జడ్జీల సంఖ్య ప్రస్తుతం 1,079కి చేరుకుంది. న్యాయ కార్య నిర్వాహక వ్యవస్థల కృషి ఫలితంగా ఒక ఏడాది కాలంలో 126 పోస్టులు భర్తీ చేశారు. ఈ ఏడాది జులై 24 వరకు 75 మంది న్యాయమూర్తుల నియామకం జరిగింది. ఉమ్మడి హైకోర్టులో మంజూరైన శాశ్వత జడ్జీల సంఖ్య 46 కాగా, కేవలం 29 మంది మాత్రం సేవలందిస్తున్నారు. ఇక అదనపు న్యాయమూర్తుల పోస్టులు 15 ఉండగా వీటిలో ఎవరూ నియమితులు కాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. ఇక జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 21,374 పోస్టులకు గాను 16,528 భర్తీ అయ్యాయి.4,846 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 900 మంది పనిచేస్తున్నారు. అయినా ఖాళీలు కొనసాగుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో మంజూరైన 16,537 పోస్టులు కాగా సుమారు40 శాతం ఖాళీలు ఉన్నాయి. 1987 నాటి 120వ లా కమిషన్ సూచనల మేరకు ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల సంఖ్య పెరుగుతూ ఉండాలి. ఆ నివేదిక ప్రకారం 2015 నాటికి 1.36 లక్షల మంది న్యాయాధికారుల నియామకం జరగాలి. కానీ కేవలం 21వేలలోపు సేవలందిస్తున్నారు. గ్రావాల్లో కేసుల పరిష్కారానికి కేంద్రం గ్రామీణ న్యాయాలయాల చట్టాన్ని తెచ్చినప్పటికీ పలు రాష్ట్రాల్లో ఇది అమలుకు నోచుకోవడం లేదు. 11 రాష్ట్రాల్లో 320 గ్రామీణ న్యాయాలయాలను నోటిఫై చేయగా అవి 8 రాష్ట్రాల్లో 204 మాత్రమే ఏర్పాటయ్యాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో వాటి ఊసెత్తకపోవడం కొసమెరుపు.

- కోర్టులు, న్యాయాధికారుల సంఖ్యను పెంచాల్సి ఉంది.
- కింది కోర్టుల్లో విచారణ సాఫీగా, సక్రమంగా జరిగేలా చూడాలి.
- న్యాయపరిష్కారం కోసం చేసిన అధ్యయనాల నివేదికలు, సమావేశాల్లో చేసే తీర్మానాలను అమలు చేసినపుడే సామాన్యులకు సత్వర న్యాయం జరుగుతుంది.
- తెలంగాణ హైకోర్టు పూర్తి స్థాయిలో పనిచేయాలంటే ఖాళీగా ఉన్న 11 మంది న్యాయమూర్తుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.

న్యాయస్థానాలూ పెరగాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో జిల్లా కేంద్రాలు ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టింది. గతంలో ఉన్న 10 జిల్లాల స్థానంలో అదనంగా మరో 21 కొత్త జిల్లాలు గతంలోనే ఏర్పడ్డాయి. మొత్తం జిల్లాల సంఖ్య 31 కాగా... ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాల మేరకు రాష్ట్రంలో నూతనంగా నారాయణపేట, ములుగు జిల్లా కేంద్రాలుగా మరో రెండు జిల్లాలు ఆవిర్భవించాయి. దీంతో తెలంగాణ రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 33కు చేరింది. పాలనా సౌలభ్యం, సుపరి పాలనతో పాటు న్యాయ వ్యవస్థపై కూడా దృష్టిని సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సామాన్య ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించడం కోసం జిల్లాకో జిల్లా కోర్టును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కొంతకాలం పాటు ఇవే జిల్లా కోర్టులు వాటి అధికార పరిధిలో కొనసాగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వివిధ జిల్లాల్లో 10 జిల్లా కోర్టులు మాత్రమే పని చేస్తున్నాయి. భవిష్యత్తులో వీటికి తోడు మరో 23 జిల్లా కోర్టులు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇప్పుడున్న జిల్లా సబ్ కోర్టులే జిల్లా కోర్టులుగా రూపాంతరం చెందే అవకాశముంది. ఇందుకోసం జిల్లా జడ్జీలు, సీనియర్ సివిల్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలను భారీ సంఖ్యలో నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. న్యాయవ్యవస్థలో ప్రస్తుతమున్న జిల్లా జడ్జీల సంఖ్య రెండు రెట్లు పెంచాల్సి ఉంటుంది.

ఇక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, కోర్టు అధికారులు, స్టెనోలు, రికార్డు అసిస్టెంట్లు, సహాయకులు అవసరమవుతారు. జిల్లా కోర్టుల్లో పనిచేసేందుకు సుమారుగా 499 మంది జడ్జీలు కావాలి. వీరిలో 228 జిల్లా జడ్జిలు, 151 మంది సీనియర్ సివిల్ జడ్జీలు, 124 మంది జూనియర్ సివిల్ జడ్జీలు కావాలి. ఇక పెద్ద సంఖ్యలో జుడీషియల్ సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కొత్త కోర్టులకు భవనాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లా కోర్టుల్లో జడ్జీల సంఖ్య ఇలా ఉంది. హైదరాబాద్ నగరంలోని సిటీ సివిల్ కోర్టు సముదాయంలో కోర్టుల సంఖ్యతో పాటు జడ్జీల సంఖ్య కూడా అధికంగానే ఉంది. ఆ తర్వాత స్థానంలో రంగారెడ్డి జిల్లా కోర్టు ఉంది. సిటీ సివిల్ కోర్టులో ప్రస్తుతం ఉన్న జడ్జీల సంఖ్య.

జిల్లా జడ్జీలు 17, సీనియర్ సివిల్ జడ్జీలు 15, జూనియర్ సివిల్ జడ్జీలు 15. రంగా రెడ్డి జిల్లా కోర్టులో..జిల్లా జడ్జీలు 14, సీనియర్ సివిల్ జడ్జీలు 11, జూనియర్ సివిల్ జడ్జీలు 6.వరంగల్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీల సంఖ్య 12, సీనియర్ సివిల్ జడ్జీలు 7, జూనియర్ సివిల్ జడ్జీలు 10..ఆదిలాబాద్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు7, సీనియర్ సివిల్ జడ్జీలు 6, జూనియర్ సివిల్ జడ్జీలు 3.కరీంనగర్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు 10, సీనియర్ సివిల్ జడ్జీలు 7, జూనియర్ సివిల్ జడ్జీలు 4. నిజామాబాద్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు 10, సీనియర్ సివిల్ జడ్జీలు5, జూనియర్ సివిల్ జడ్జీలు 5..ఇక నల్గొండ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు 9, సీనియర్ సివిల్ జడ్జీలు 5, జూనియర్ సివిల్ జడ్జీలు3 ..మెదక్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు 9, సీనియర్ సివిల్ జడ్జీ పోస్టులు 4 ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా కోర్టులో జిల్లా జడ్జీలు 11, సీనియర్ సివిల్ జడ్జీలు 8, జూనియర్ జడ్జీల సంఖ్య 3 ఉన్నాయి. ఖమ్మం జిల్లా కోర్టులో జిల్లా జడ్జీల సంఖ్య 9, సీనియర్ సివిల్ జడ్జీలు 3, జూనియర్ సివిల్ జడ్జీ పోస్టుల సంఖ్య 6 ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కామారెడ్డి, వరంగల్(అర్బన్), జయశంకర్ జిల్లా, జనగాం, మహబూబాబాద్, భద్రాద్రి, సంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, నాగర్ కర్నూలు, గద్వాల, నారాయణ పేట , ములుగు సూర్యాపేట, యాదాద్రి, వికారాబాద్, మేడ్చల్ జిల్లా కేంద్రాల్లో జిల్లా కోర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే నూతనంగా ఏర్పడిన జిల్లాల వారీగా కేసులను ఆయా జిల్లా కోర్టులకు కేటాయించాల్సి ఉంది. అప్పుడే కక్షిదారులకు సత్వర న్యాయం అందే అవకాశం కలుగుతుంది.

వరంగల్‌లో స్వైన్‌ఫ్లూ కలకలం



డా. శ్రీనివాస్‌రావు

ఎంజీఎం, ప్రభ న్యూస్ : వాతావరణ మార్పులతో ఒకవైపు విషజ్వరాలతో ప్రజలు మంచాన బారిన పడుతుండగా, మరోవైపు స్వైన్ ఫ్లూ స్వైర విహారం చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాల తోపాటు పలు ప్రాంతాల ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా వాతావరణ పరిస్థితుల కారణంగా పిల్లలు, వృద్ధులు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన విషజ్వరాల బారిన పడుతున్నారు. గతంలో జయశంకర్ జిల్లా, రేగొండ మండలానికి చెందిన బక్కెర రాజవీరు స్వైన్‌ఫ్లూ వ్యాధితో చికిత్స పొందుతూ ఎంజిఎంలో చనిపోగా, శనివారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పిల్లల వార్డులో శిశువుకు స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నట్లు తేలడంతో ప్రజలతో పాటు వైద్యులు కలవరం చెందారు. ఈ సందర్భంగా ఎంజీఎం వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం శిశువుకు పరీక్షలు చేయగా, స్వైన్ ఫ్లూ పాజిటీవ్ అని తేలిందన్నారు. శిశువుకు ప్రత్యేక వార్డులో మెరుగైన వైద్యసేవలుఅందిస్తున్నామని, ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గానే ఉందన్నారు. ప్రముఖ జనరల్ ఫిజిషియన్ మెర్గు సుధాకర్ మాట్లాడుతూ హెచ్1, ఎన్1 అనే వైరస్ సులభంగా గాలీ ద్వారా మనిషి నుంచి మనిషికి వ్యాప్తించడం ద్వారా ఈ వ్యాధిపై చికిత్సకన్నా..నివారణ ముఖ్యం అంటున్నారు. ముఖ్యంగా ఆయాసం పడిన.. శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, జ్వరం అనేది సాధారణ స్వైన్ ఫ్లూ లక్షణాలు. వీటితో పాటు కొంతమందికి ఒళ్లు నొప్పులు, ముక్కుకారడం, దగ్గు, తలనొప్పి, వాంతులు తదితర కారణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులను సంప్రదించాలని కోరారు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్వైన్‌ఫ్లూ రోగులకు ప్రత్యేక వైద్యం

ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు ముఖ్యంగా స్వైన్‌ఫ్లూ రోగులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక వార్డును సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వైన్‌ఫ్లూపై ప్రజలు భయపడనవసరంలేదని, స్వైన్‌ఫ్లూవ్యాధిపై అవగాహన పెంచడానికి ఎంజీఎం వైద్యులు ఎప్పటికి అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్నట్లు సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రత్యేక బృందం సైతం స్వైన్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ రోగులకు వైద్యచికిత్సలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

గుర్రపుతండా కన్నీరు మున్నీరు



నివాళులర్పిస్తున్న ఎంపి గుత్తా, ఎమ్మెల్యే రవీంద్రకుమార్


నేరేడుగొమ్ము, ప్రభ న్యూస్ : అమెరికాలో గత నెలలో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలు స్వగ్రామమైన గుర్రపుతండాకు చేరుకోగా అందరూ కన్నీరుమున్నీరయ్యారు. నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము మండలంలోని గుర్రపుతండాకు చెందిన శ్రీనివాస్ నాయక్, సుజాతల ముగ్గురు పిల్లలు క్రిస్మస్‌కు ఒకరోజు ముందు అగ్నికి ఆహుతయ్యారు. సాత్విక్ నాయక్, జయసుచిత, సుహాన్ నాయక్‌ల మృతదేహాలు గుర్రపు తండాకు చేరుకోవడంతో ఆ తండావాసులు కన్నీటిపర్యంతమయ్యారు. శనివారం క్రిస్టియన్ ఆచారం ప్రకారం ప్రార్థనలు నిర్వహించడంతో సమీప ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్దఎత్తున తరలివచ్చారు. పాస్టర్లు సాల్మన్ వెంకట్ లాల్, లాల్‌సింగ్ లాజర్, బోడ క్రిస్టఫర్, జోస్ అరిస్టన్, ఎలెక్స్ మేరిలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. శ్రీనివాస్ నాయక్ కుటుంబాన్ని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌లు పరామర్శించారు.

మల్లేపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

ఊట్కూర్, ప్రభ న్యూస్ : ఊట్కూర్ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఘర్షణ పడిన 33 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా, మల్లేపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థుల మధ్య ఘర్షణలో ఇరు వర్గాలు ఒక్కరిపై ఒక్కరు దాడి చేసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు 33మందిపై కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేసి నారాయణపేట కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామంలో అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

సంక్రాంతి ప్రయాణికులు 4.49 లక్షలు

- గత ఏడాది కంటే 18 శాతం పెరిగిన రైలు ప్రయాణాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రత్యేక రైళ్ళను నడిపిన ద.మ.రై కేవలం మూడు రోజుల్లో రూ. 3.99 కోట్లను ఆర్జించింది. ఈ నెల 11, 12, 13 తేదీలలో సుమారు 4.49 లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చిన రైల్వే శాఖ గతేడాది కంటే 18 శాతం ప్రయాణికులను అధికంగా తరలించింది. గతేడాది సంక్రాంతి సీజన్‌లో 3.79 లక్షల మందిని రైల్వే శాఖ గమ్యస్థానాలకు చేర్చగా ఈ సారి 18 శాతం వృద్ధితో 4.49 లక్షల మందిని చేర్చిం ది. ఫలితంగా గతేడాది రూ. 3.08 కోట్లను ఆర్జించిన రైల్వే శాఖ ఈ సారి 29 శాతం వృద్ధితో రూ. 3.99 కోట్లను ఆర్జించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ అధికంగా ఉంటుందని ముందే ఊహించిన రైల్వే శాఖ ప్రయాణికులకు ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విస్తృత ఏర్పాట్లను చేసింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, కాకినాడ, నరసాపురం, విశాఖపట్టణం, భువనేశ్వర్, బెంగళూరులతో పాటు జైపూర్, కొచువేలి, బరౌని ప్రాంతాలకు కూడా ప్రత్యేక రైళ్ళను నడి పారు. ఎనిమిది ప్రత్యేక రైళ్ళతో పాటు ఏడు జనసాధారణ్ రైళ్ళు, ఒక హమ్‌సఫైర్ రైలు, 11 సువిధ రైళ్ళను నడిపించారు.


బూర్గంపాడులో గంజాయి స్వాధీనం



పట్టుబడిన రూ. 53 లక్షల గంజాయి

బూర్గంపాడు/నారాయణఖేడ్, ప్రభ న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండల పరిధిలోని సంజీవరెడ్డి పాలెం గ్రామ సమీపంలో గంజాయిని బూర్గంపాడు ఎస్సై టి. వెంకటప్పయ్య పట్టుకున్నారు. గంజాయి పట్టుకున్న విషయాన్ని శనివారం మండల కేంద్రంలో డీఎస్పీ జి. మధుసూధన్‌రావు తెలిపారు. సంజీవరెడ్డి పాలెం గ్రామ సమీపంలో ట్రాక్టర్‌లో నుంచి 76 గంజాయి ప్యాకెట్లను అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ఎస్సై వెంకటప్పయ్య పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో డిసిఎం వ్యాన్, ట్రాక్టర్‌లను తనిఖీ చేయగా, గంజాయి ప్యాకెట్లు ఉండటంతో ఇద్దరు నిందితులు ఆర్. ప్రవీణ్, ఎల్. ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ప్రధాన నిందితుడు భాస్కర్‌తో పాటు మరి కొందరు తప్పించుకున్నట్లు తెలిపారు. పట్టు బడిన 78 ప్యాకెట్‌ల గంజాయి విలువ రూ.53లక్షల 63వేలు ఉంటుందని తెలిపారు. ఎస్సై టి.వెంకటప్పయ్యను డీఎస్పీ అభినందించారు.

సంగారెడ్డి జిల్లాలో గంజాయి స్థావరంపై దాడి



ఒడిశా నుంచి తీసుకొచ్చి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రూ. 12.5 లక్షల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి నిల్వ ఉంచిన స్థావరంపై ఖేడ్ డీఎస్పీ ఆర్.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. సంగారెడ్డి జిల్లా, ఇరక్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బీంలాతండాలో అక్రమంగా గంజాయి నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు పోలీసు బృందం దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. దాడి సందర్భంగా తండాకు చెందిన పాత్‌లోత్ సంతోష్, రాథోడ్ దేవిదాస్, రాథోడ్ కాశీనాథ్, రాథోడ్ శ్రవన్, రాథోడ్ దోండిదాస్‌లను పటుకున్నామని, కర్నాటకకు చెందిన శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 2 కిలోల బరువు కలిగిన 52 ప్యాకెట్ను, 104 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నామని తెలిపారు.

సాంకేతిక లోపంతో విమానం నిలిపివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో నిలిచిపోయింది. బోర్డింగ్ పాస్ తీసుకుని ప్రయాణీకులు ఫ్లైట్ ఎక్కిన తర్వాత ఫ్లైట్ బయలుదేరే సమయంలో రెండు ఇంజన్లలో ఓ ఇంజన్ పనిచేయట్లేదని పైలట్లు గుర్తించారు. దీంతో విమానం టేకాఫ్ చేయకుండా నిలిపివేశారు. శనివారం తెల్లవారుజామున 6.55 గంటలకు తిరుపతి బయలుదేరాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం కారణంగా విమానం ఎగిరే పరిస్థితి లేదని సంస్థ అధికారులు ప్రకటించారు.విమానంలో టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు తదితరులు ఉన్నట్లు సమాచారం.

పార్లమెంట్ ఎన్నికలపై కసరత్తు

- సీఎస్‌తో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై అప్రమత్తంగా ఉండాలని, ప్రణాళికాబద్ధంగా శాంతిభద్రతలు, సిబ్బంది నియామకంపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్‌లు అన్నారు. శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 22న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్న నేపథ్యంలో సీఎస్ పలు శాఖలతో చర్చించి కీలక సూచనలు చేశారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేసినట్లుగా పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగుల బదలీలు కూడా ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో సిబ్బంది కేటాయింపు ఇబ్బందులుండబోవన్నారు. అయితే అవసరం మేరకు అదనపు బలగాలను కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు చురుగ్గా సాగుతోందని, ఎన్నికల కమిషన్ ఈనెల 25వరకు సమయమిచ్చిందని, కానీ తాము ఫిబ్రవరి 4వరకు గడువును కోరినట్లు ఆయన వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణపై ఆదివారం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవాలని సూచించారు. వివరాలు సరిగ్గా ఉన్నాయో లేవో కూడా పరిశీలించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు 13లక్షల పైచిలుకు అభ్యంతరాలు వచ్చాయని, కొత్త ఓటర్లు భారీగా చేరుతున్నారని పేర్కొన్నారు. ఓటర్లకు 40లక్షల పోస్టు కార్డులను పంపామని రజత్ కుమార్ వెల్లడించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదుకు ఇంకా సమయం ఉందన్నారు. ఎన్నికల షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రాడ్యుయేట్ అయిఉండి ఓటర్‌గా నమోదు చేసుకోలేదు అనేందుకు వీలు లేదన్నారు. ప్రతీ ఒక్క అర్హుడు నమోదు చేసుకోవాలన్నారు. ఈ భేటీలో డీజీపి మహేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

అటవీ రక్షణకు ప్రాధాన్యం

- కేంద్ర అటవీ శాఖ సంచాలకుడు సిద్ధాంతదాస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ కోసం విశేష కృషి చేయాలని, విరివిగా చెట్లను పెంచడంతో కలిగే ఉపయోగాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ సంచాలకులు సిద్ధాంత దాస్ అన్నారు. హైదరాబాద్ నగర శివార్లలోని దూళపల్లి ఫారెస్ట్ అకాడమీలో శనివారం నిస్సారమైన అటవీ భూములను సారవంతం చేసేందుకు బూడిదను వినియోగించి సారవంతం చేయడంపై జరిగిన జాతీయ సదస్సును దాస్ ప్రారంభించి ఉపన్యసించారు. ఇటీవల ప్రధాని మోడీ పారిస్‌లో జరిగిన పర్యావ రణ మార్పు సదస్సులో చేసిన ప్రసంగంలో అటవుల ప్రాధాన్యత గురించి మాట్లాడారని, చెట్ల ద్వారా పర్యావరణ సమతుల్యత పెరుగుతుందన్న విషయాన్ని ప్రస్తావించారన్నారు. ప్రస్తుత పరిస్థితులలో అటవీ పరిరక్షణ సవాల్‌గా మారిందని, అడవుల సంరక్షణ వల్ల మానవాళికి జరిగే మేలును ఎలుగెత్తి చాటాల్సి ఉందన్నారు. అటవుల పరిరక్షణకు బూడిద ఎంతగానో తోడ్పడుతుందని, థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తిచేసే విద్యుదుత్పత్తి సంస్థలు బూడిదను తప్పనిసరిగా అటవీ ప్రాంతంలో వదిలి వేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. సదస్సులో ఉత్తరాఖండ్ అటవీ శాఖ మాజీ ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ ఆర్‌బీఎస్ రావత్, ఫ్లైయాష్ అండ్ రిసర్చ్ కేంద్రం సెక్రటరీ జనరల్ డాక్టర్ విమల్‌కుమార్, తెలంగాణ అటవీ శాఖ ముఖ్య సంరక్షకులు పీకే ఝా తదితరులు పాల్గొన్నారు.

భవనంపైనుండి పడి కార్మికుడి మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బహుళ అంతస్తుపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. హైదరాబాద్ పాతబస్తీ మీర్‌చౌక్ ఏసీపీ డివిజన్ రైన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. నల్గొండ జిల్లా మునావన్ తండా పియాపల్లికి చెందిన ఎం.శంకర్ నాయక్ కుమారుడు మోహన్ నాయక్(20) బాగేజహారా బస్తీలోని ఒక బహుళ అంతస్థుల భవన నిర్మాణంలో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. శనివారం మోహన్ నాయక్ ఆ భవనంలోని 3వ అంతస్తులో పని చేస్తున్న సమయంలో కాలుజారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. భవన యజమానులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తున్న సమయంలో మృతి చెం దాడు.

మహిళా భద్రతకు

రాష్ట్రం పెద్దపీట

సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్‌పర్సన్ రాగం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసిందని తెలంగాణ సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్‌పర్సన్ రాగం సుజాత తెలిపారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు షీటీంలతో పాటు పలు చట్టాలను రూపొందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. సాంఘిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో మహిళల భద్రత మనందరి బాధ్యత పేరుతో రచించిన పుస్తకాన్ని శనివారం సాంఘిక సంక్షేమ బోర్డు కార్యాలయంలో రాగం సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. మహిళ భద్రతపై అవగాహన కల్పించేకార్యక్రమాన్ని ప్రభుత్వం తమ శాఖకు అప్పగించిందని, దానిలో భాగంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ఆమె తెలిపారు. గృహహింస చట్టాలు, బాలబాలికలను కాపాడే అంశాలు, పోషకాహార పదార్థాల సేకరణ అంశాలను పుస్తకంలో వివరించామన్నారు.






ఎల్‌అండ్‌టీకి సెబీ షాక్

● రూ.9000 కోట్ల బై బ్యాక్‌కు నో

న్యూఢిల్లీ : ఇంజినీరింగ్ రంగ దిగ్గజం ఎల్ అండ్ టీకి భారత నియంత్రణ మండలి (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) షాక్ ఇచ్చింది. రూ.9000 కోట్ల మేరకు షేర్లను బై బ్యాక్ చేయాలన్న ఎల్ అండ్ టీ నిర్ణయానికి అనుమతులు ఇచ్చేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిరాకరించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీ ఈ విషయాన్ని శనివారం రెగ్యులేటరీ సమాచారంలో తెలిపింది. ఎల్ అండ్ టీ మొత్తం 6.1 కోట్ల షేర్లను బై బ్యాక్ చేయాలని భావించింది. ఒక్కో షేరుకు రూ.1,475 చెల్లించాలని భావించింది. ఈ లెక్క బై బ్యాక్ విలువ సుమారు రూ.9000 కోట్లు అవుతుంది. కాగా ఈక్విటీ షేరు రూ.1,475 వద్ద సుమారు 6.1 కోట్ల షేర్లను బై బ్యాక్ చేయనున్నామని గత ఏడాది ఆగస్టులో ఎల్ అండ్ టీ ప్రతిపాదించింది. అక్టోబర్ 15 నాటికి ఈ కంపెనీ షేర్లను కలిగి ఉన్నవారు ఈ బై బ్యాక్ అర్హులుగా పేర్కొంది. కానీ చివరికి రూ.9000 కోట్ల బైబ్యాక్‌కు సెబీ అనుమతి ఇవ్వకపోవడంతో ఎల్ అండ్ టీ షేర్ హోల్డర్లకు నిరాశే మిగిలింది. బై బ్యాక్‌కు అనుతివ్వకపోవడంపై సెబీ వివరణ కూడా ఇచ్చింది. బైబ్యాక్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే గ్యారెంటీ, గ్యారెంటీ రహిత బకాయిల్లో భారీ మార్పులు వస్తాయని చెప్పుకొచ్చింది.



గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో
మేం భాగస్వాములం

● వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రుణాలకు ప్రాధాన్యం
● మాఫీతో రుణాల వసూళ్ళు ఆలస్యం ●'ఆంధ్రప్రభ'తో
సిండికేట్ బ్యాంకు హైదరాబాద్ జోనల్ జీఎం విజయ్ కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణం పెంచే విధంగా తమ బ్యాంకు రుణాలు ఇస్తున్నామని సిండికేట్ బ్యాం కు హైదరాబాద్ జోనల్ జనరల్ మేనేజర్ ఎస్.విజయ్ కుమార్ చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎం ఎస్ఎంఈ) పరిశ్రమలు, వ్యవసాయం, రిటైల్ రంగాల్లో రుణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహి ళలను ప్రోత్సహించేందుకు పెద్దఎత్తున రుణాలు ఇస్తున్నామని, ఇది పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటుందని ఆయన 'ఆంధ్రప్రభ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

రూ.48 వేల కోట్ల వ్యాపారం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి రూ.48,004 కోట్ల వ్యాపారం చేశామని, ఇందులో రూ.27,733 కోట్ల రుణా లు ఇచ్చామని ఆయన తెలి పారు. తమ బ్యాం కు సేకరించిన రూ.20,271 కోట్ల డిపాజిట్లతో రూ.8,656 కోట్ల కాసా డిపాజిట్లు ఉన్నా యని, ఇది మొత్తం డిపాజిట్లలో 42.68 శాతంగా నమోదైందని విజయ్ కుమార్ తెలిపారు. తమ బ్యాం కుకు మొత్తం 13.36 శాతం నిరర్థక ఆస్తులు ఉన్నాయని, ఇందులో 11 శాతం వ్యవసాయ రంగం నుంచే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న ఆశల్లో ఉన్న రైతాంగం పంట రుణాలు చెల్లించే దుకు సుముఖంగా లేరని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నా టికి ప్రాథమిక రంగానికి రూ.18,304 కోట్లు, వ్యవ సాయ రంగం రూ.11,932 కోట్లు, రిటైల్ రంగంలో రూ.6,134 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 4,586 కోట్ల రుణాలు ఇచ్చామని ఆయన తెలిపారు.

టెక్నాలజీ, వ్యాపారంలో ముందంజ

బ్యాంకింగ్ రంగంలో అనేక మార్పులు వస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణం గా వ్యాపారం, టె క్నాలజీని వినియోగించుకోవడంలో తమ బ్యాంకు ముందు వరుసలో నిలిచిందన్నారు. బ్యాంకులో వివిధ సేవలు అందిస్తున్న విభాగాలకు తగ్గట్టుగా ని యామకాలు జరుగు తున్నాయని, ప్రత్యేకత కలిగిన వారికే ప్రాధాన్యత ఉంటుందని విజయ్ కుమార్ చెప్పారు. వరంగల్‌లో ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న కాక తీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మొత్తం 324 యూనిట్లకు రూ.396 కోట్ల రుణాన్ని తమ బ్యాంకు ఇస్తుందని విజయ్ కుమార్ తెలిపారు. ఈ పార్కులో ఏ ఇతర బ్యాంకుకు అవకాశం లేకుండా మొత్తం రుణాలను తామే ఇస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లా ముల్కనూరు డెయిరీ విస్తరణకు రుణాలను పూర్తిగా సిండికేట్ బ్యాంకే ఇస్తుందన్నారు.

గ్రామీణ యువత, మహిళలకు శిక్షణ

గ్రామాల్లో ఉన్న వనరులను గుర్తించి అక్కడి యువతకు, మహిళలకు శిక్షణ కూడా ఇస్తున్నామని ఆయన చెప్పారు. ఎంఎస్ఎం ఈలో దాదాపు 10కిపైగా విభాగాల్లో నైపుణ్యాభివృద్ధిలో ఆరు రోజుల నుంచి మూడు నెలల వరకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణా కాలంలో భోజన వసతి కూడా తమ బ్యాంకే ఉచి తంగా సమకూరుస్తుందని విజయ్ కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనే రుణాలు ఎక్కువగా ఇస్తున్న తమ బ్యాంకు పట్టణాల్లో కూడా దృష్టిసారించి రిటైల్, హౌసింగ్, వాహ నాలు, విద్యా రుణాలు పెద్దఎత్తున ఇస్తున్నామని చెప్పారు.

తగ్గిన బంగారం ధరలు

వారం రోజులు పసిడిపై రూ.60 క్షీణత



ఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడికి డిమాండ్ తగ్గడంతో శనివారం ధర స్వల్పంగా తగ్గింది. పది గ్రాముల బంగారంపై రూ.60 త గ్గింది. 10 గ్రాముల బంగారం ధర రూ.33,160 పలికింది. ప్రపంచ వ్యాప్తంగా నగల వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గినట్టు తెలుస్తున్నది. ఇక కిలో వెండిపై రూ.280 తగ్గింది. ప్రస్తుతం స్వచ్ఛమైన వెండి కిలో రూ.40,100గా ఉంది. అంతర్జాతీయంగా నాణేలకు డిమాండ్ తగ్గినట్టు తెలు స్తున్నది. న్యూయార్క్‌లో బంగారం ధర 0.77 శాతం తగ్గింది. దీంతో ఔన్స్ పసిడి ధర 1,282.30 డాలర్లు పలికింది. వెండిపై 1.26 శాతం తగ్గి 15.41 డాలర్లు పలికింది. ఢిల్లీ విష యానికి కొస్తే.. పది గ్రాముల 99.9 శాతం స్వచ్ఛమైన బంగారంధర రూ.33,160గా ఉంది. 99.5 శాతం స్వచ్ఛ మైన బంగారం రూ.33,010గా ఉం ది. శుక్ర వారం కూడా బంగారంపై రూ.80 త గ్గిన విషయం తెలిసిందే. ఇక బంగారం, వెండి వారాంతానికి ధ రల్లో వ్యత్యాసాలు గ మనిస్తే.. వారం రోజుల్లో పది గ్రాముల బంగారంపై రూ.60 తగ్గింది. వారం రోజుల్లో కిలో వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

ఇక ఈ-కామర్స్

సరికొత్త వ్యాపారం వైపు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ

●అమెజాన్, వాల్‌మార్ట్ కొనే ఆలోచన..! ●తొలి అడుగు గుజరాత్ నుంచే.. ●రిలయన్స్ జియో రిటైలర్లతో కలిసి ముందుకు..●గతనెల్లోనే ఈ-కామర్స్ నిబంధనలు కఠినతరం
● అంబానీ కోసమే అంటున్న విపక్షాలు



న్యూఢిల్లీ : భారత్‌లో ఈ-కామర్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ తరుణంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ తీసుకున్న నిర్ణయం విదేశీ కంపెనీలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటి వరకు టెలికాం రంగంలో చరిత్ర సృష్టించిన ముఖేష్ త్వరలో ఈ కామర్స్ రంగంలోకి అడుగు పెడుతున్నట్టు ప్రకటించారు. ఇందు కోసం ఆమెజాన్, వాల్‌మార్ట్‌ను కొనుగోలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ముందుగా తన సొంత రా ష్ట్రం గుజరాత్‌లో ఆన్‌లైన్ షాపింగ్ ఫ్లాట్‌ఫాం ద్వారా 1.2 మిలియన్ రిటైలర్స్, స్టోర్ యజమానులకు సేవ లందించనున్నారు. రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్‌లు కలిసి సంయుక్తంగా కొత్త ఈ కామర్స్ ఫ్లాట్‌ఫాం ద్వారా గుజరాత్‌లో 12 లక్షల చిన్న రిటైలర్స్, షాప్ యజమానులకు సేవలందిస్తుందని ముఖేష్ అంబానీ అంటున్నారు. ఇప్పటికే భారత్‌లో ఈకామర్స్ వెబ్‌సైట్లు ఎంతో పాపులర్ అయ్యాయి. భారత్‌లో ఆమెజాన్, వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థలకు గట్టి పోటీ ఇవ్వడానికి రిలయన్స్ ఆన్‌లైన్ షాపింగ్‌ను తీసుకొచ్చి తన ప్రత్యేకత చాటాలని అంబానీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది.

జియో నెట్‌వర్క్‌తో రంగంలోకి...

ఆసియా ఖండంలో అత్యంత సంపన్నుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ముఖేష్ అంబానీ తన సొంత సంస్థ అయిన రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవలను కూడా ఈ కామర్స్ షాపింగ్ రంగంలో వినియోగించుకునేందుకు యత్నిస్తున్నారు. దీని కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఏడాది కాలంలో రిలయన్స్ సంస్థ ఈ కామర్స్ సరికొత్త ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే ఈ కామర్స్ రంగంలో రిలయన్స్ వస్తే మాత్రం విదేశీ సంస్థలు తన దుకాణాలు సర్దుకోవాల్సిందే అనే వాదన కూడా వినిపిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈకామర్స్ సంస్థల్లో ఫ్లిప్‌కార్ట్, ఆమెజాన్ ముందు వరుసలో ఉన్నాయి. జియో రిలయన్స్ రిటైల్‌లు సంయుక్తంగా కొత్త ఈ కామర్స్ మార్కెట్‌ను లాంచ్ చేస్తాయని రిలయన్స్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఒక గుజరాత్ రాష్ట్రంలో అత్యధికంగా రిటెయిలర్లు లబ్ది పొందనున్నారు. సుమారు 12 లక్షల మంది ఈ కామర్స్ ఫలాలతో లబ్ది పొందడంతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. అయితే దీనికి సంబంధించిన గ్రౌండ్ వర్క్ ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు నగరాల్లో జరుగుతున్నట్టు సమాచారం. దేశ వ్యాప్తంగా జియో కుటుంబంలో 280 మిలియన్ సబ్ స్క్రైబర్లు ఉన్నారు. 6500 నగరాల్లో సుమారు 10,000 ఔట్‌లెట్లను నిర్వహిస్తున్నది. వీరంతా జియో యాప్, డివైజ్‌ల ద్వారా వ్యాపారస్తులను ఏక తాటిపైకి తీసుకొస్తారని రిలయన్స్ రిటైల్ ప్రధాన ఎగ్జిక్యూటివ్ వి.సుబ్రమణ్యం తెలిపారు.

విదేశీ ఈ-కామర్స్‌పై కేంద్రం గుస్సా




విదేశీ ఆన్‌లైన్ షాపింగ్ రిటైలర్స్‌పై కేంద్ర గతనెల్లోనే ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలను కూడా కఠినతరం చేసింది. అయితే ముఖేష్ అంబానీ ఈ కామర్స్ రంగంలో అడుగు పెట్టబోతున్నట్టు తెలుసుకునే కేంద్రం ఈ చర్యలకు పాల్పడిందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అంబానీకి మేలు చేసేందుకే కేంద్రం నిబంధనలు కఠినతరం చేసిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక కంపెనీకి చెందిన వస్తువులను ఎక్కువ డిస్కౌంట్‌లు ఇచ్చి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న నేపథ్యంలో సదరు కంపెనీ వస్తువులు తీసుకున్న ఇతర వ్యాపారులు భారీగా నష్టపోవాల్సివస్తోందని కేంద్రం దీనిపై వివరణ ఇచ్చింది. ఇలా చేయడంతో స్థానిక వ్యాపారులు లాభపడే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలోనే విదేశీ యాజమాన్యాలు నడుపుతున్న ఈ కామర్స్ వెబ్‌సైట్లపై ఆంక్షలు విధించింది. దీంతో ఆమెజాన్, వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లకు ఇబ్బందులు తప్పడం లేవు. అయితే కేంద్రం తీసుకొచ్చిన ఈ నిబంధనలు రిలయన్స్ ఈ కామర్స్‌కు వరంలా మారనున్నాయి. రిలయన్స్ ఈ కామర్స్‌కు సంబంధించి ముఖేష్ అంబానీ క్రమంగా వివరాలను బయటకు వెల్లడిస్తూ వచ్చారు. జులైలో తమ కంపెనీ షాపింగ్ రంగంలో వినూత్న పద్ధతులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందంటూ సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్తులో రిలయన్స్ ఈ కామర్స్ రంగంలో అడుగుపెట్టి పోర్టల్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ పోర్టల్ ప్రారంభిస్తారని ఆ సమయంలో ఎవరూ ఊహించలేదు.

భారత్ నెంబర్ 1 కావడం ఖాయం

ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ టీవీ మోహన్‌దాస్ పై

బెంగుళూరు : ముఖేష్ అంబానీ కంపెనీ రిలయన్స్ ఈ-కామర్స్ రంగంలో అడుగుపెడితే డిజిటల్ వలసవాదం భయం పోయి, వస్తువులు తక్కువ ధరకు లభిస్తాయని ఇన్వెస్ట్‌మెంట్ గురు, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ టీవీ మోహన్‌దాస్ పై అభిప్రాయపడ్డారు. రిలయన్స్ రంగ ప్రవేశంతో కొనుగోలుదారులు కూడా లాభపడ్తారని అన్నారు. ఇదే జరిగితే మాత్రం ప్రపంచంలో భారత్ విన్నర్ నిలిచి గణనీయమైన అభివృద్ధి సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. దీంతో పాటు ఆన్‌లైన్ రిటైల్ రంగంలో నెలకొన్న డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన భయాందోళనలు కూడా తొలగిపోతాయన్నారు. రిలయన్స్ ఈ-కామర్స్ రంగంలో రిటైల్ నెట్‌వర్క్‌కు సంబంధం కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు. ఫలితంగా వస్తువుల ధరలు తగ్గుముఖం పడతాయని, సరఫరా విషయంలో నెలకొన్న ఆందోళనలు కూడా దూరం అవుతాయని అన్నారు. వస్తువులు కూడా మన్నికగా ఉంటూ అవి పాడవకుండా ఉంటాయని, అనుకున్న సమయంలో డెలివరీ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. దీంతో అంతిమంగా కొనుగోలుదారులు ఎంతో లాభపడ్తారని అన్నారు. ఆన్‌లైన్ టు ఆఫ్‌లైన్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలనే ఆలోచనను గుజరాత్ సమ్మిట్‌లో అంబానీ ముందు ఉంచగా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ టీవీ మోహన్‌దాస్ పై వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా రోజురోజుకూ పెరుగుతున్న అంతర్జాతీయ సంస్థల ద్వారా డేటా వలసవాదం అరికట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ ముఖేష్ అంబానీ ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. చమురు, టెలికాం రంగాల్లో ప్రభంజనం సృష్టించిన ముఖేష్ అంబానీ చూపు ఈ కామర్స్ రంగంపై పడింది. త్వరలోనే జియో, రిలయన్స్ రిటైల్ కలిపి సరికొత్త ఈ కామర్స్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తామని గుజరాత్ సదస్సులో ముఖేష్ ప్రకటించిన విషయం తెలిసిందే..



మేక్ ఇన్ ఇండియా బాగుంది

●కార్ల తయారీలో భారత్‌తో కలిసి ముందుకు
●చెక్ రిపబ్లిక్ ప్రధాని ఆండ్రేజ్ బాబిస్



పుణె : చెక్ రిపబ్లిక్ కార్ల తయారీ రంగ సంస్థ స్కో డా ఆటో, ఫోక్స్ వ్యాగన్ గ్రూప్ ఇండియా కలిసి పుణె లోని చాకన్‌లో శనివారం కొత్త తరహా టెక్నాలజీ సెంట ర్‌ను ప్రారంభించాయి. 2.0 ఇండియా ప్రాజెక్టులో భా గంగా ఈ మ్యానుఫ్యా కర్చింగ్ ప్లాంట్‌ను నెలకొల్పినట్టు వివరించా యి. భారత్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు కోసం స్కోడా, ఫోక్స్ వ్యాగన్ గ్రూప్ ఇండియా సంయుక్తంగా 250 మిలియన్ యూరోలు (సుమారు రూ.2000 కోట్లు) ఖర్చుపెడుతున్నాయి. ఇండియాలో ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌కు స్కోడా నేతృ త్వం వహిస్తున్నది. కొత్తగా నెలకొల్పబడిన సెంటర్‌లో 250 మంది ఇంజినీర్స్‌కు ఉపాధి లభిస్తుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో చెక్ రిపబ్లిక్ ప్రధాని ఆండ్రేజ్ బాబిస్, స్కోడా ఆటో టెక్నికల్ డెవలప్‌మెంట్ మేనేజ్ మెంట్ బోర్డు సభ్యుడు క్రిస్టియన్ స్ట్రూబ్, ఫోక్స్ వ్యాగన్ గ్రూప్ ఇండియా చీఫ్ గురుప్రతాప్ బోపరాయి పాల్గొన్నారు. 2.0 ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి ఔరంగాబాద్, పుణెలోని రెండు ప్లాంట్లు ఎంతో సహకరిస్తాయని వివరించారు. 95 శాతం వస్తువులు స్థానికంగా తయారు చేయాలనేది ఇండియా 2.0 ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని కంపెనీ ప్రతినిధులు వివరించారు. చెక్ రిపబ్లిక్ ప్రధాని ఆండ్రేజ్ బాబిస్ మాట్లాడుతూ.. భారత్‌లో స్కోడా ఆటో వ్యాపార విస్తరణలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భారత్‌కు దీర్ఘ కాలిక ప్రయోజనాలు అందించే విధంగా స్కోడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందన్నారు. 2020-21 కల్లా స్కోడా, ఫోక్స్ వ్యాగన్ ఉత్పత్తులు మార్కెట్‌లో విడుదల చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చెక్ రిపబ్లిక్, భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి 2.0 ప్రాజెక్టు ఎంతో ఉప యోగ ప డు తుం ద ని అన్నారు. ప్రతీ ఏడాది వేలాది మంది భారతీయులు చెక్ రిపబ్లిక్ వస్తున్నారని, యూరప్ దేశాల్లో స్థిరమైన ఆర్థిక స్థితిని కొనసాగించడానికి ప్రయత్నిస్తోందని తెలి పారు. మేక్ ఇన్ ఇండియా నినాదం ఎంతో బాగుందన్నారు.

ఆఫ్రికా.. ప్రధాన భాగస్వామి

●వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో సుష్మా స్వరాజ్



గాంధీనగర్ : ఆఫ్రికా దేశాలతో భారత్ నిరం తరం సత్సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు వెళ్తుందని, ఎంతో నమ్మకమైన భాగస్వామి అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. గాంధీనగర్‌లో కొనసాగుతున్న 9వ వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. భారత దేశ విదేశీ ఆర్థిక పాలసీల్లో ఆఫ్రికా దేశాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని ప్రధాని నరేంద్రమోడీ, సుష్మా స్వరాజ్ ఇప్పటికే ప్రకటించారు. సుమారు 50 ఆఫ్రికా దేశాల ప్రతినిధులతో పాటు పలువురు మంత్రులు ఈ సదస్సులో పాల్గొన్నా రు. రక్షణతో పాలు రంగాల్లో నమ్మకమైన భాగ స్వామిగా ఆఫ్రికా ఉంటుందని సుష్మా అన్నారు. సదస్సులో ఒక రోజు మొత్తం ఖండానికి సంబంధించిన ఇన్వెస్టర్‌ల కోసం కేటాయించడం జరిగిందన్నారు. ఆఫ్రికన్ దేశాల ఆర్థిక వ్యవస్థ ప్రాముఖ్యత గుర్తించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీనికి ముందు ఉగాండ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి హెన్రీ ఒకెల్లో మాట్లాడుతూ.. గతం నుంచే ఇండియా, ఆఫ్రికా మధ్య సంబంధాలు చాలా బలంగా ఉన్న విషయం అందరికీ తెలుసు అని అన్నారు. ఆఫ్రికా ప్రజలతో భారత్ ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగిస్తూ ఉంటుందని, గత నాలుగేళ్ల కాలంలో ఆఫ్రికాతో బంధం మరింత బలోపేతం అయ్యిందని అన్నారు. భారత్ నుంచి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు 29 సార్లు ఆఫ్రికా దేశాల్లో పర్యటించినట్టు తెలిపారు.

ఇండిగోలెర్న్‌కు ఏంజల్ నిధులు



హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన ఎడ్ టెక్ అంకుర సంస్థ ఇండిగో లెర్న్ ఏంజల్ ఇన్వెస్టర్ల ద్వారా తాజాగా రూ.93 లక్షల నిధులు సమకూ ర్చుకున్నారు. మన దేశంతో పాటు అమెరికాకు చెందిన ఏం జల్ ఇన్వెస్టర్లు ఇందులో పెట్టుబ డులు పెట్టారు. ఏప్రిల్, 2018 లో సమకూరిన పెట్టుబడులతో కలుపుకుంటే ఇప్పటి వరకు ఈ అంకుర సంస్థ రూ.1.88 కోట్ల మేర నిధులు సమకూర్చుకోగలిగింది. విద్యార్థులకు, యువతకు ఎన్నో అంకుర సంస్థలు ఆన్‌లైన్‌లో వివిధ రకాలైన విద్యా సంబంధమైన కోర్సులు అందిస్తున్నది. చార్టెడ్ అకౌంట్ (సీఏ) కోర్సు చేస్తున్న వారికి సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్ శిక్షణను ఆన్‌లైన్‌లో భారత్‌లో మొట్ట మొదటి సారి ఇండిగో లెర్న్ సంస్థ అందిస్తున్నది. సీఏ శిక్షణతో పాటు అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ శిక్షణను ప్రస్తుతం అందిస్తుండగా, త్వరలో సీఏ ఫైనల్, 10 ప్లస్ టూ విద్యార్థులకు అనువైన శిక్షణను అందించడానికి సంస్థ సన్నాహాలు ప్రారంభించింది. 2017లో శ్రీరాం సోమయాజుల, ప్రముఖ సీఏ శిక్షకులు సత్య రఘు సీఏ కోర్సులో ఆలిండియా టా పర్‌గా నిలిచిన సూరజ్ లఖోటియా, బిట్స్ పిలానీ టెక్కి శరత్ వేమూరి కలిసి స్థా పించిన ఈ హైదరాబాద్‌కు చెందిన ఎడ్ టెక్ అంకుర సంస్థ ఇండిగోలెర్న్ ఇప్పటి వరకు 20వేలకు పైగా సీఏ విద్యార్థులకు తన ఆన్‌లైన్ కోర్సుల ద్వారా ఎంతో ఉప కరించింది. ఇప్పుడు సమకూరిన నిధులు అంకుర సంస్థను ఇంకా అభివృద్ధి చేయ డానికి ఎంతగానో ఉపయోగపడ్తాయని ఇండిగో లెర్న్ సంస్థ వ్యవస్థాపకులు తెలియజేశారు.

మంఖాల్ వద్ద
100 ఎకరాల్లో ప్లాస్టిక్ పార్కు

ప్లాస్టిక్, పాలీమర్ పరిశ్రమల కోసం మంఖాల్‌లో నిర్మించిన వంద ఎక రాల ప్లాస్టిక్ పార్కులో మౌలిక వసతుల రూపకల్పన పూర్తయిం దని, స్థలాలను లబ్దిదారులకు కేటాయిం చడమే మిగిలిందని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరస్ అసోసియేషన్ (తాప్మా) ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన తాప్మా పాలీమర్ కాన్ఫరెన్స్ - 2019 సద స్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాప్మా అధ్యక్షుడు బీఎల్ భం డారీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీవోవో పునీత్ మదన్, విండ్మల్లర్ అండ్ హోల్చేర్ (జర్మనీ) మేనేజింగ్ పార్టనర్ పీటర్ స్టెయిం బ్యాక్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ప్రేం కంకారియా, వినీత్ కాన్ఫరెన్స్ కమిటీ చైర్మన్ శివకుమార్ గుప్త పాల్గొన్నారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ, హైదరాబా ద్‌లో 1965లో మొదటి ప్లాస్టిక్ పరి శ్రమ ఏర్పాటైందని, ప్రస్తుతం 1500 పరిశ్రమలకు మించి ప్లాస్టిక్ పరిశ్ర మలు ఉన్నాయన్నారు. పరిశ్రమ ఏర్పాటు కోసం ఔటర్ రింగ్‌రోడ్డు వద్దనున్న సుల్తాన్‌పూర్ స్థలం సిద్ధంగా ఉందని, పరిశ్రమల విస్తరణకు ఇక్కడ స్థలం కేటాయిస్తామన్నారు.

టెక్నాలజీతో జీవన విధానంలో మార్పు

- నేతన్నల కోసం మైక్రోసాఫ్ట్ ఈ-కామర్స్ ప్లాట్ ఫాం : జయేష్ రంజన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజల జీవన విధానాలను డిజిటల్ టెక్నాలజీ మారుస్తోందని, మైక్రోసాఫ్ట్‌తో కలిసి పనిచేయడం వల్ల చేనేత కళాకారులకు టెక్నాలజీని చేరువ చేయగలుగుతున్నామని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్ లాంటి నూతన కార్యాచరణ ద్వారా చేనేత కళాకారులు తమకు తాముగా ఆర్థిక స్థిర త్వం పొందడం, ఈ రం గంపై ఆధార పడిన వారికి ఉపాధి కలుగుతోందని ఆయన అన్నారు. మైక్రో సాఫ్ట్ ఇండి యా చేనేత కళా కారుల కోసం తన నూతన ఈ-కామర్స్ వేదికను శనివారం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో జయేష్ రంజన్‌తో పాటు మైక్రోసాఫ్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ భన్సాలి కూడా పాల్గొన్నారు. తమ కొత్త ఈ- కామర్స్ ప్లాట్‌ఫాం, డిజిటల్ ఎంపవర్‌మెంట్ సెంటర్లు, కొత్త డిజైన్ కరిక్యులం ప్రవేశపెట్టడం ద్వారా వారసత్వ చేనేత కళాకారులు పునర్జీవింపచేయడంతో పాటు వినియోగదారులకు చేరువ అవుతారని భన్సాలి అన్నారు. తన ఉపకార చర్యల ప్రాజెక్టు రీవే వ్‌లో భాగంగా ఈ వేదికను ఆరంభిం చింది. ఈ ఈ-కామర్స్ ప్లాట్‌ఫాం చేనేత కళాకారులు, కొనుగోలుదారులను అ నుసంధానం చేస్తుంది. ఈ కొత్త ఈ- కామర్స్ వెబ్‌సైట్‌లో చేనేత కళాకారుల సిగ్నేచర్ కలెక్షన్లు ప్రదర్శిస్తాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాష న్ టెక్నాలజీ (నిఫ్ట్)తో కలిసి మైక్రోసాఫ్ట్ క్యాడ్, కలర్ ఫర్ హ్యాండ్లూమ్ వీవింగ్ అంశంలో ప్రత్యేక కరిక్యులం రూపొందించి డిజిటల్ ట్రైనింగ్ ఇన్ హ్యాండ్లూమ్ డిజైన్‌లో చేయ నుంది. డిజైన్ కోర్సు శిక్షణకు సంబం ధించి తొలి బ్యాచ్ ఉత్తీర్ణులకు గుర్తింపు పత్రాలు పొందారు.


క్షీణించిన సౌత్ ఇండియా బ్యాంకు లాభాలు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ సౌత్ ఇండియా బ్యాంకు ఈ ఏడాది మూడో త్రైమాసికంలో 27 శాతం లాభాలు తగ్గాయి. డిసెంబర్ 31, 2018 నాటికి బ్యాంకు సుమారు రూ.83.85 కోట్ల నికర లాభాలు క్షీణించాయి. గత ఆర్థిక సంవత్సరంలో మాత్రం సౌత్ ఇండియా బ్యాంకు రూ.115 కోట్ల నికర లాభాలను మూటగట్టుకుంది. ఈ ఏడాది మొత్తం రెవెన్యూ రూ.1,921.93 కోట్లుగా నమోదైంది. 2017-18 ఆర్థిక సం వత్సరంలో రూ.1,735.77 కోట్ల లాభాలు గడించింది. స్థూల నిరర్థక ఆస్తులు 4.88 శాతం పెరిగాయి. గతేడాది 3.40 శాతం నమోదైనట్టు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో బ్యాంకు పేర్కొంది. నికర నిరర్థక ఆస్తులు అక్టోబర్-డిసెంబర్, 2018 కాలంలో 3.54 శాతం పెరగ్గా, గతేడాది 2.35 శాతం నమోదైంది.



హెచ్‌డీఎఫ్‌సీ నికర లాభం 20.3 శాతం

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నికర లాభాల్లో 20.3 శాతం వృద్ధి సాధించినట్టు హెచ్‌డీఎఫ్‌సీ పేర్కొంది. డిసెంబర్ 31 వరకు మూడో త్రైమాసికంలో రూ.5,586 కోట్లు నికర లాభం రాగా, అందులో అత్యధికం నికర వడ్డీ ఆదాయం ఎక్కువ అని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్-డిసెంబర్‌లో రూ.4,642.6 కోట్ల నికర లాభాలను పొందింది. ఈ ఏడాది మొత్తం ఆదాయం రూ.30,811.27 కోట్లు నమోదు కాగా, గతేడాది రూ.24,450.44 కోట్లు గడించింది. నికర వడ్డీ ఆదాయం వృద్ధి రూ.12,576.8 కోట్లు (21.9 శాతం) ఉంది. గతేడాది రూ.10,314.3 కోట్లుగా నమోదైంది. 23.7 శాతం ఆస్తుల వృద్ధి సాధించింది. స్థూల నిరర్థక ఆస్తులు 1.38 శాతం పెరిగింది. గతేడాది 1.29 శాతం పెరిగినట్టు వివరించింది. నికర నిరర్థక ఆస్తులు 0.42 శాతం క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరంలో 0.44 శాతం క్షీణించింది.



ఎడ్యుకేషన్ పవర్‌హౌస్‌గా తెలంగాణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం ఎడ్యుకేష్ పవర్‌హౌస్‌గా అభివృద్ధి చెందుతోందని సాంఘికసంక్షేమ శాఖ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. శనివారం జూబ్లీహిల్స్ మిన్ట్ హోటల్‌లో అనేబ్లింగ్ స్పేసెస్ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2020నాటికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలల్లో పది లక్షల మందికి ప్రవేశం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సోషల్ ఎమోషనల్ లెర్నింగ్స్ అనే అంశంపై లెర్నింగ్ సంస్థ ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. తరగతి గదుల్లో ఎలా ఉండాలి, చదువులోనే కాకుండ బయటి ప్రపంచంలో ఎలా ఉండాలి, ఎటువంటి సవాళ్లనైనా ఏవిధంగా ఎదుర్కోవాలి, లైవ్ స్కిల్స్‌ను విద్యార్థి దశలోనే ఏ విధంగా అలవరుచుకోవాలని అన్న అంశాలు ఈ సదస్సులో చర్చించటం మంచి పరిణామమని అన్నారు. పాఠ్యాంశాల్లోనే కాకుండా బయట కూడా ప్రాక్టీస్ చేసినప్పుడే లైవ్‌స్కిల్స్ అలవడతాయని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని, అంతేకాకుండా సమాజంలో తమచుట్టూ ఉంటూనే ఉన్నత స్థానాలకు చేరిన వారి విజయగాధలను విద్యార్థులకు పరిచయం చేయాలని అన్నారు. ఆటువంటి వారి ప్రభావం విద్యార్థుల చదువుమీద కూడా పడుతుందన్నారు. అడపాదడపా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ, కాన్ఫిడెన్స్ లెవల్స్ విద్యార్థుల్లో పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖకు రూ. 7 వేల కోట్లు బడ్జెట్ ఇస్తుంటే అందులో 1220 కోట్లు సాంఘికసంక్షేమం కింద ఉన్న విద్యారంగానికే ఖర్చు చేస్తున్నట్టు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్‌స్క్వేర్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ క్రిష్ణన్ సుబ్బరామన్, ఫోకస్ హౌస్కూల్ ప్రిన్సిపల్ మిన్హాజ్ , టాటా ఇన్సిట్యూట్స్ ప్రొ. సోనియాతోపాటు సయ్యద్ యూసఫ్, సాహిత్య, మల్లీశ్వరి, రవికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల వేషాలకు చంద్రబాబు సిద్ధం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఏపీకి పత్యేక హోదాపై గతంలోఎగతాళి ఎద్దేవా చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో మరో మారు ఎన్నికల వేశాలకు సిద్ధమవుతున్నారని వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పార్టీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సజ్జల మాట్లాడుతూ దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహం ముందు చంద్రబాబు ఫోటో చూస్తే గాంధీ ముందు గాడ్సే నిలబడ్డట్టు ఉందన్నారు. హరికృష్ణ పార్థివ దేహం వద్ద చంద్రబాబు టీఆర్‌ఎస్ నేతలతో రాజకీయాలు పొత్తులపై మాట్లాడారన్నారు. అందరికీ తెలిసేలా కేటీఆర్ వైఎస్‌ఆర్ పార్టీ అధ్యక్షుడు జగన్ ఇంటికి వచ్చి ఫెడరల్ ఫ్రంట్ గురించి చర్చలు జరిపారన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ ఏపీలో పోటీ చేయకపోయినా చంద్రబాబు ఆ పార్టీని బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు అధికారమే తప్ప ఏపీ ప్రజలపై మమకారం లేదన్నారు. వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అన్నారు. 2014లో బీజేపీనుంచి తమ పార్టీకి అహ్వానం ఉన్నా వెళ్లలేదన్నారు. 175అసెంబ్లీ స్థానాల్లో తమపార్టీ ఒంటిరిగానే పోటీ చేసిందన్నారు. రాష్ట్రంలో లేని ప్రత్యర్థులను సృష్టించేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీలను టోకున కొనేస్థాయికి చంద్రబాబు వెళ్లారన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు . దేశంలో ఏపీ కేంద్రబిందువుగా ,రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

తొలగించిన బీసీ కులాలను చేర్చాలి

• జాతీయ బీసీ సంక్షేమ సంఘం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. చట్టవిరుద్ధంగా బీసీ జాబితాలో ఉన్న 26 కులాలను రాష్ట్ర ప్రభుత్వం 2014 ఆగస్టులో తొలగించారని సంఘం జాతీయఅధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. శనివారం గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో కోలా జనార్దన్, నీల వెంకటేష్, దాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఏదైనా కులాన్ని బీసీ జాబితాలో కలపాలన్నా.. తొలగించాలన్నా.. బీసీ కమిషన్ సిఫారసులు చేయాలని అలా కాకుండా ఏకపక్షంగా ప్రభుత్వం బీసీ జాబితాలో ఉన్న 26 కులాలను తొలగించారని ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. రాష్ట్రంలోని శెట్టి బలిజ, గవర, తూర్పుకాపు, కొప్పుల వెలమ, కళింగ, గాజుల బలిజ, నాగవంశ, దేవాంగ, పోలినాటి వెలమ అరవ, బైరి వైశ్య, నాగ వడ్డెలు, అచ్చుకట్టు, పొదర, కురాకు కులాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరు, వీరి పిల్లలు 2014 వరకు బీసీలుగా చెలామణి అయ్యారు. 2014 ఆగస్టు తరువాత నుంచి వారిని బీసీలు కాదని పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వీరు విద్య, ఉద్యోగాలకు బీసీలుగా అర్హత లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

అగ్రవర్ణ రిజర్వేషన్లపై 22న ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రవర్ణ పేదలకు కేంద్రం తీసుకొచ్చిన 10 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా 22న ఢిల్లీలో జాతీయ ఓబీసీ సదస్సును నిర్వహించనున్నారు. అగ్రవర్ణ పేదలకు కేంద్రం రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శనివారం జరిగిన సంఘం సమావేశంలో అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై జాతీయస్థాయిలో ఉద్యమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. రిజర్వేషన్లు ఇవ్వడం చట్టవిరుద్ధమని, రిజర్వేషన్ల స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించడం కూడా బీసీలపై కుట్రననే అన్నారు.

చైనాకు లక్ష కేజీల వెంట్రుకలు పంపిన పాక్

ఇస్లామాబాద్: గడిచిన ఐదేళ్ల కాలంలో చైనా దేశానికి పాకిస్థాన్ 105,461 కేజీల మానవ వెంట్రుకలను ఎగుమతి చేసింది. ఈ మేరకు పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీకి ఆ దేశ వాణిజ్య శాఖ మంత్రి తెలిపినట్లు పాక్ కు చెందిన డాన్ పత్రిక తెలిపింది. మేకప్ రంగంలో వృద్ధి కారణంగానే చైనాలో మానవ వెంట్రుకలకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా చైనాలో విగ్‌లు ధరించడం ఫ్యాషన్‌గా మారడం కూడా మానవ వెంట్రుకలను చైనాకి ఎగుమతి చేయడానికి మరొక కారణమని ప్రముఖ బ్యూటీషియన్ ఏఎమ్ చౌహాన్ తెలిపారు. అంతేకాకుండా జుట్టు ఉపకరణాల స్థానిక ఉత్పత్తి ఇటీవల తిరస్కరించడం కూడా మరో కారణంగా తెలుస్తోందని ఆయన అన్నారు. గతంలో స్థానికులు తమ చేతులతో సవరాలు, గడ్డాలు, విగ్గులు తయారు చేసేవారని కానీ చైనీస్ మేకప్ రంగం కారణంగా స్థానిక కళాకారులు మార్కెట్ కోల్పోయారని ఆయన తెలిపారు. ఎగుమతిదారులు హెయిర్ సెలూన్లలో డబ్బాలు వేసి కేజీ రూ.5,000, 6,000 రూపాయల సగటు ధరతో వెంట్రుకలను కొనుగోలు చేస్తున్నారని చౌహాన్ తెలిపారు. అమెరికా, చైనా దేశాల్లోని వినోదరంగాల నుంచి హెయిర్‌కు విపరీతమైన డిమాండ్ ఉండటంతో హై క్వాలిటీ హెయిర్‌ను అక్కడికి కూడా పాక్ ఎగుమతి చేస్తోంది. అదే సమయంలో పాకిస్థాన్ కూడా సవరాలు, విగ్‌లు ఇతరదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.

నకిలీ సిమ్‌లతో ఖాతాలు ఖాళీ

● హ్యాకింగ్.. ఫిషింగ్ మెయిల్స్‌తో సమాచార సేకరణ ● నైజీరియాలో తిష్ట.. మనదేశంలో నేరాలు ● ఎట్టకేలకు నైజీరియన్ గ్యాంగ్ గుట్టు ...రట్టు ● ఆరుగురి అరెస్ట్.. భారీగా సామాగ్రి స్వాధీనం ● నైజీరియన్ నేరగాళ్లకు మనవాళ్ల సహకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలోని ప్రముఖ సంస్థల బ్యాంకు అకౌంట్లు, కంప్యూటర్లు, ఐడీ, ఈమెయిల్ వివరాలు హ్యాక్ చేసి, ఆయా ఖాతాదారుల రిజిస్టర్డు ఫోన్‌నెంబర్లపై డూప్లికేట్ సిమ్‌లు పొంది వారి ఖాతాల్లోని సొమ్మును తమ ఖాతాల్లోకి మళ్లించి మోసం చేస్తున్న నైజీరియన్ గ్యాంగ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. సిమ్ స్వాప్ గ్యాంగ్‌గా పిలిచే ఈ ముఠాలోని ఆరుగురి సభ్యులను అరెస్టు చేసిన 17 మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, మూడు హార్డ్‌డిస్కులు, ఒక పాస్‌పోర్ట్, రెండు నకిలీ రబ్బర్‌స్టాంప్‌లు, మూడు చెక్‌బుక్‌లు, మూడు పాస్‌బుక్‌లు, ఆరు డెబిట్ కార్డులు, రెండు ఆధార్ కార్డులు, పాన్‌కార్డు, లామినేషన్ మెషిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాలే కేంద్రంగా ఆయా సంస్థల బ్యాంకింగ్, రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్ నెంబర్ల వివరాలు సేకరించి ఈ మోసానికి పాల్పడుతున్న నైజీరియన్ గ్యాంగ్ సభ్యులలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒడేఫ్ హెన్రీ, సంతోష్ బెనర్జీ, అంకన్ సాహా, రజత్‌కుందు, చందన్‌వర్మ, సంజిబ్ దాస్‌లు అరెస్టయినారు. కాగా ఈ కేసులో కింగ్‌పిన్‌గా వ్యవహరించి విదేశాల నుంచి ఫిషింగ్(చౌర్య) మెయిల్స్ ద్వారా కథ నడిపించి మిగతా సభ్యులకు సూచనలందించిన నైజీరియన్ ఎబిగ్బో ఇన్నోసింట్ పరారీలో ఉన్నట్లు సైబరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ చింతల్‌లోని ఒక బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు అసలు దొంగలను పట్టుకున్నారు.



కోటికి పైగా కొట్టేసిన గ్యాంగ్

వెంకటకృష్ణను మోసగించిన తరహాలోనే అనేక సంస్థల ఖాతాలనుంచి కూడా దాదాపు కోటి రూపాయలను ఈ నైజీరియన్ గ్యాంగ్ స్వాహా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.24,00,000, చెన్నైకి చెందిన ఎస్‌కెఎస్ ఎంటర్‌ప్రైజెస్, కార్తీక్ ఎంటర్‌ప్రైజెస్‌ల నుంచి రూ.25,00,000, కోల్‌కతాకు చెందిన దేవ్ ఇంప్లెక్స్ నుంచి రూ.25,00,000, అహ్మదాబాద్‌కు చెందిన న్యాప్చూర్ ట్రేడర్స్ నుంచి 13,00,000, కోల్‌కతాకు చెందిన ఏబుల్ లాజిస్టిక్స్ నుంచి రూ.48,000లతో పాటు కోల్‌కతాకు చెందిన ఎం న్యూక్లబ్, ఎల్‌ఎమ్ ఎక్స్‌పోర్ట్, మా భవానీ ట్రేడర్స్, ఢిల్లీకి చెందిన యూనిక్ ట్రేడర్స్, అహ్మదాబాద్ వసయా ట్రేడర్స్, చెన్నైకి చెందిన బాస్ షిపింగ్, జె.మేరీ విల్సన్ తదితర కంపెనీలను మోసగించినట్లు ప్రస్తుత పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా, ఇంకా అనేక కంపెనీలు/ఫర్మ్‌లకు చెందిన సొమ్ములను ఈ గ్యాంగ్ దండుకుని ఉండొచ్చని.. అయితే పరారీలో ఉన్న కింగ్ మేకర్ దొరికితే ఈ కేసుకు సంబంధించి పూర్తి సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

మోసం చేసేది ఇలా...

నైజీరియా కేంద్రకంగా గ్యాంగ్‌లో కీలక నిందితుడు ఎబిగ్బో ఇన్నోసింట్ మోసపూరిత పథక రచన చేశాడు. ఇండియా కంపెనీ/ఫర్మ్‌ల ఇ-మెయిల్ ఐడీలను టార్గెట్ చేసి వాటిని హ్యాక్ చేసి ఫిషింగ్ మెయిల్స్ పంపేవారు. ఆ ఫిషింగ్ మెయిల్స్ ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్, రిజిష్టర్డ్ మొబైల్ నెంబర్స్ తదితరాలు సేకరించేవారు. తాను సేకరించిన వాటిని తన గ్యాంగ్ సభ్యులకు చేరవేసి వారికి తగు సూచనలంద జేసేవాడు. దీంతో మిగతా గ్యాంగ్ సభ్యులు ఆయా కంపెనీల నకిలీ డాక్యుమెంట్లతో కంపెనీల రిజిష్టర్డ్ మొబైల్ నెంబర్స్‌ని పొందేవా రు. అనంతరం తాము టార్గెట్ చేసిన కంపె నీ/ఫర్మ్‌ల నుంచి వారికి తెలియకుండానే తమ తమ ఖాతాల్లో నిందితులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ ఘరానా మోసానికి పాల్పడ్డారు. డీసీపీ(క్రైం) జానకి షర్మిల నేతృత్వంలో కేసును ఛేదించిన సైబర్ క్రైమ్ సిబ్బంది ఏసీపీ కె.శ్రీనివాస్, ఎస్‌ఐ విజయ్‌వర్ధన్, ఏఎస్‌ఐ యు.సిద్ధేశ్వర్, పీసీలు నంద యాదవ్, వెంకటేష్, భరత్, రవి, సురేష్, విజయ రామిరెడ్డి, రఘు నందన్, మహిళా కానిస్టేబుల్ లక్ష్మీలను సైబరాబాద్ సీపీ సజ్జనార్ అభినందిం చారు. వారికి అవార్డులివ్వనున్నట్లు తెలిపారు.



హైదరాబాద్

ఐదు నిమిషాల్లో 9 లక్షలు గల్లంతు

చింతల్ వాసి పంతం వెంకట కృష్ణకు ఎలిమ్, షలోమ్ పేరిట కెమికల్ కంపెనీలున్నాయి. ఆయా సంస్థల పేరుతో కరెంట్, ఓవర్ డ్రాఫ్ట్ బ్యాంక్ అకౌంట్లు నిర్వహిస్తున్నారు. అయితే తనకు తెలియకుండా, తన అకౌంట్ల నుంచి దాదాపు 9 లక్షల రూపాయలు మళ్లించబడ్డాయని గుర్తించిన వెంకటకృష్ణ పోలీసులను ఆశ్రయించడంతో ఈ డొంక కదలింది. సికింద్రాబాద్‌లోని సౌత్ ఇండియన్ బ్యాంక్, సుచిత్ర బ్రాంచ్‌లో తనకున్న రెండు అకౌంట్లకు సంబంధించి ఇచ్చిన మొబైల్ నెంబర్లపై 15వ తేదీ(శనివారం)న రాత్రి 8 గంటలకు మొబైల్ నెట్‌వర్క్ కనెక్షన్ డిస్‌కనెక్ట్ అయినట్లు సమాచారం అందింది. అంటే ఆ నెంబర్లపై అప్పటికే నిందితులు డూప్లికేట్ సిమ్‌లు పొందారన్నమాట. ఈ క్రమంలో 17వ తేదీన ఉదయం 9.45 నుంచి 9.50 మధ్య ఐదు నిమిషాల వ్యవధిలో తన కంపెనీ బ్యాంకు అకౌంట్లలో కొన్ని నెట్ బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్స్ చోటు చేసుకున్నాయని గుర్తించిన వెంకట కృష్ణ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ విభాగానికి ఫిర్యాదు చేశాడు. దీంతో బ్యాంకు అధికారులు వెరిఫికేషన్ నిర్వహించగా తన కంపెనీలైన ఎలిమ్ కెమికల్స్ నుంచి రూ.5,00,000, షలోమ్ కెమికల్స్ నుంచి రూ.4,00,000 కోల్‌కతాలోని ఇతర బ్యాంకు అకౌంట్స్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తేలింది. దీంతో 17వ తేదీన మొబైల్ టెలికాం సంస్థలకు వెళ్లి ఫిర్యాదు చేయగా, కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు తన కంపెనీలకు సంబధించి నకిలీ డాక్యుమెంట్లతో తన మొబైల్ నెంబర్‌తో కొత్త సిమ్‌కార్డును పొంది నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.9,00,000 కాజేశారని గుర్తించారు. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఇందుకు కారకులైన అంతరాష్ట్ర సిమ్ స్వాప్ గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు కింగ్‌పిన్‌గా వ్యవహరించిన ఎబిగ్బో ఇన్నోసింట్‌ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దిగాయి.

బెట్టింగ్ మోజులో...

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బెట్టింగ్ మోజులో పడ్డాడు.. భార్యను వేధింపులకు గురిచేసిన ఓ భర్త నిర్వాకమిది. వివరాల్లోకి వెళితే... బోయినపల్లి అంజయ్య నగర్‌లో నరేష్, శ్వేతలు నివాసం ఉంటున్నారు. వివాహ సమయంలో 10 లక్షల కట్నం, 20 తులాల బంగారంను శ్వేత తల్లిదండ్రులు నరేష్‌కు అందజేశారు. గత కొంతకాలంగా భర్త నరేష్ బెట్టింగ్ మోజులో పడి ఉన్న డబ్బు, బంగారంను పోగొట్టుకున్నాడు. దీంతో మళ్లీ బెట్టింగ్ ఆడేందుకు భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశాడు. ఆ క్రమంలో ఆమెను ఇంటినుంచి పంపేశాడు. ఈ ఘటనతో శ్వేత భర్త నరేష్ ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. శ్వేతకు మద్దుతగా మహిళా సంఘం నాయకురాళ్లు కూడా దర్నా చేశారు. ఈ క్రమంలో శ్వేత మద్దతుదార్లకు, నరేష్ కుటుంబసభ్యుల మధ్య షర్షణ చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారనున్న క్రమంలో అల్వాల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి శ్వేత భర్త నరేష్, మామ వెంకటేష్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనకు న్యాయం జరిగేంతవరకు విశ్రమించేది లేదని భార్య శృతి చెబుతోంది.

షెల్ కంపెనీలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షెల్ కంపెనీలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోం ది. దీంతో షెల్ కంపెనీల ద్వారా లబ్ది పొందుతున్న వ్యాపారుల పని పడుతున్నారు జీఎస్టీ అధికారులు. శనివారం నాచారంలో ఓ ఐరన్ అండ్ స్టీల్ వ్యాపార సంస్థ యజమాని ఇంటితో పాటు కంపెనీల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. శంకరంపేట, నాచారం యూనిట్లలో భారీ అక్రమాలు బయటపడ్డాయి. మూడు డొల్ల కంపెనీల ద్వారా సుమారు 40 కోట్ల రూపాయల మేర ఇన్‌వాయిస్‌లు జారీ చేసినట్లు గుర్తించారు. ఈ నకిలీ ఇన్‌వాయిస్‌ల వల్ల ప్రభు త్వానికి రూ.4 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సదరు సంస్థ యజమానిని అరెస్టు చెయడమే కాకుండా మూడు కోట్ల రూపాయలు రికవరీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వారం రోజుల్లో మిగతా కోటి రూపా యలు చెల్లించే విధంగా యజమాని నుంచి పూచికత్తు తీసుకున్నారు. ఈ నేపథ్యం లో ఇతర రంగాలపై పన్ను ఎగవేతదారులపై జీఎస్టీ కమిషనరేట్ దృష్టిసారించింది.

ఐదుగురికి నోటీసులు జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిలపై అసత్య ప్రచారం కొనసాగిస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా పోస్టులు, వీడియోలు షేర్ అవుతున్న క్రమంలో షర్మిల హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీసీఎస్ పోలీసులు ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 8 వెబ్‌సైట్లకు నోటీసులు జారీ చేవారు. ఫేక్ పోస్టులతో సంబంధమున్న ఐదుగురికి పోలీసులు అరెస్ట్ నోటీసులు జారీ చేశారు. పదిరోజుల్లోగా సమాచారం ఇవ్వాలని యూట్యూబ్ చానెళ్లకు ఆదేశాలు జారీ చేశారు. చానెల్ యజమానులను పోలీసులు విచారిస్తున్నారు. వీడియో లింక్‌లకు కామెంట్లు పెట్టిన వారి వివరాలను సేకరిస్తున్నారు. వీడియో, ఆడియో తయారు చేసిన వారిని సీసీఎస్ పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

అయ్యప్ప ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించిన మహిళలు



తిరువనంతపురం: శబరిమళ అయ్యప్ప ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించిన ఇద్దరు మహిళల ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇద్దరు మహిళలను ఆందోళనకారులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని బలవంతంగా వెనక్కి పంపించారు. శనివారం ఉదయం షానిలా సతీశ్, రేష్మ అనే ఇద్దరు మహిళలు అయ్యప్పను దర్శించుకొనేందుకు నీలక్కల్ బేస్ క్యాంప్ కు చేరుకొన్నారు. అక్కడ వీరిద్దరిని గుర్తించిన ఆందోళనకారులు ఆలయంలోకి వెళ్లనివ్వకుండా వారని అడ్డుకొన్నారు. తమకు భద్రత కల్పించాలని ఇద్దరు మహిళలు పోలీసులను కోరారు. అయితే ఉద్రిక్తపరిస్థితుల మధ్య తాము ఇప్పుడు భద్రత కల్పించలేమని ఆ ఇద్దరు మహిళలను పోలీసులు బలవంతంగా వెనక్కి పంపించారు. బుధవారం కూడా ఈ ఇద్దరు మహిళలు పురుష వేషధారణలో వచ్చి అయ్యప్పను దర్శించుకొనేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇదిలా ఉండగా శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత ఇప్పటివరకు 51మంది స్త్రీలు ఆలయంలోకి వెళ్లినట్లు శుక్రవారం కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకి తెలిపింది.

శోభాయమానంగా హిల్ ఫెస్టివల్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రముఖ శైవక్షేత్రం గుంటూరు జిల్లాలోని కోటప్పకొండలో శనివారం అంగరంగ వైభవంగా కొండ పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆహ్లాదం, ఆధ్యాత్మికం, ఆనం దం, వినోదం కలబోసి రూపొందించిన హిల్ ఫెస్టివ ల్‌కు ప్రజల నుంచి తొలిరోజు భారీ స్పందన లభిం చింది. లక్షలాది మంది భక్తులు, యాత్రికులు తరలిరావడంతో కోటకప్పకొండ జనసంద్రమయిం ది. ఏడాదికి ఒకసారి వచ్చే కోటప్పకొండ తిరునాళ్ళకు మరో నెలరోజులకు పైగా సమయం ఉన్నప్పటికి ఇప్పటికే తిరునాళ్ళ వాతావరణం ఉట్టిపడేలా అద్భుతమైన ఏర్పాట్లను చేశారు. రాష్ట్రశాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో గత రెండు నెలలుగా టూరిజం, ఎండోమెంట్, ఫారెస్ట్ గ్రీనరీ, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు నిరంతరం శ్రమతో యాత్రికులకు అవసరమైన సకల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగింది.

విచారణ పూర్తయ్యేవరకు బదిలీ వద్దు

• కేరళ సీఎంకు అత్యాచార బాధిత నన్ వినతి

తిరువనంతపురం: బిషప్ ఫ్రాంకో ముల్లాకల్‌పై అత్యాచార ఆరోపణలు చేసిన కేరళ నన్‌తోపాటు మరో నలుగురు నన్‌లు తామంతా అత్యాచార ఆరోపణలపై విచారణ పూర్తయ్యేవరకు ప్రస్తుత మఠంలోనే కలిసి ఉంటామని సీఎం పినరయ్ విజయన్‌కు లేఖ రాశారు. నన్‌లను మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లాలని ఒత్తిళ్లు వస్తున్న నేపథ్యంలో బాధిత నన్ సీఎం విజయన్‌కు లేఖ రాశారు. కేసులో సాక్షులుగా ఉన్న తమపై దాడి జరిగే అవకాశం ఉందని తమకు హాని జరిగే అవకాశం ఉందని సీఎంకు రాసిన లేఖలో అత్యాచార బాధిత నన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కాన్వెంట్‌లో సహ సిస్టర్స్ సహకారం, మద్దతుతోనే జీవిస్తున్నాను. వారు ఓదార్పే తనకు ఊరటనిస్తుందని ఆమె పేర్కొన్నారు. బిషప్ అతని బృందం అమానుష చర్యలు కారణంగా తను విచ్ఛిన్నమైన పరిస్థితిలో ఉన్నానని ఆమె లేఖలో పేర్కొన్నారు. బిషప్ బృందం చాలా శక్తివంతమైందని వారు ఈ కేసును రూపుమాపే అవకాశం ఉందన్నారు. కాగా నలుగురు నన్‌లను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ మార్చి 2018న జారీ అయిన ఉత్తర్వులను పాటించాలని నోటీసులు జారీ అవటంతో ఆమె సీఎం విజయన్‌కు లేఖ రాశారు. బాధిత నన్ చర్చి అధికార యంత్రాంగానికి 2017లో ఫిర్యాదు చేయటం ప్రారంభించారు. ఈ క్రమంలో కొన్ని నెలల అనంతరం ఆమెకు 2018లో బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అయితే తాము సహచర సిస్టర్స్ సహకారంతో వాటిని పాటించలేదని నన్‌లు తెలిపారు.మొదటినుంచి న్యాయంకోసం అర్థిస్తున్నా చర్చి అధికారులు కళ్లు మూసుకున్నారని ఆందోళనలో పాల్గొన్న నన్ ఒకరు మీడియాకు తెలిపారు.

సుబోధ్ కుటుంబానికి 70లక్షల సాయం

● బులంద్‌షహర్ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ ఆఫీసర్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌శహర్‌లో గతేడాది డిసెంబర్‌లో జరిగిన అల్లర్లలో మూకదాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుభోధ్‌కుమార్ సింగ్ కుటుంబానికి యూపీ పోలీస్ డిపార్ట్మెంట్ శుక్రవారం 70 లక్షలను సాయంగా అందించింది. యూపీ ప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల పరిహారానికి ఇది అదనమని, తామందం కలిసి సొంతంగా సుభోధ్ కుటుంబాన్ని ఆదుకొనేందుకు 70లక్షల రూపాయలను అందించినట్లు సీనియర్ పోలీస్ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. బులంద్‌శహర్ ఘటనలో సుభోధ్‌పై గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. సుబోధ్‌పై దాడికి పాల్పడిన మరికొందరిని కూడా యూపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనను రాజకీయ కుట్రగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అభివర్ణించారు. తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకొనేందుకే కొంతమంది ఈ ఘటనపై అనవసర ప్రకటనలు చేస్తున్నారని యోగి తెలిపారు.

అత్యాచార కేసు వెనక్కి తీసుకోలేదని హత్య

గురుగావ్: అత్యాచార కేసు వెనక్కి తీసుకోలేదని 22ఏళ్ల అత్యాచార బాధితురాలిని దారుణంగా కాల్చిచంపిన ఘటన హరియాణాలోని గురుగావ్‌లో జరిగింది. శుక్రవారం ఆమె కోర్టులో కేసుకు సంబంధించిన వాంగ్మూలం ఇవాల్సి ఉండగా దీనికి కొన్ని గంటల ముందు ఆమె హత్య జరిగిందని పోలీసులు తెలిపారు. సందీప్‌కుమార్ అనే బౌన్సర్ డ్యాన్సర్‌గా పనిచేస్తున్న మహిళపై అత్యాచారం చేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో ఆమె వాంగ్మూలం ఇవ్వాలిసి ఉండగా నిందితుడు శుక్రవారం ఆమెను కాల్చి చంపాడని పోలీసులు తెలిపారు. అత్యాచార బాధిత మహిళపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపినట్టు వారు వెల్లడించారు. బాధితురాలి మృతదేహం గుర్‌గావ్-ఫరీదాబాద్ ఎక్స్‌ప్రెస్ వద్ద కుష్బూ చౌక్ సమీపంలో లభ్యమైందన్నారు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వటంతో హత్య జరిగిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లి మాట్లాడుతూ 2017 మార్చిలో తన కుమార్తె సందీప్‌పై అత్యాచారం కేసు పెట్టిందని అప్పటినుంచి అతడు కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నాడని ఆమె తెలిపారు. శుక్రవారం కోర్టులో వాంగ్మూలం ఇవ్వాలిసి ఉండగా ఉదయమే సందీప్ ఇంటికి వచ్చి తమ కుమార్తెతో కొద్దిసేపు కారులో కూర్చుని మాట్లాడాలని కోరాడని ఆమె కారు ఎక్కగానే తీసుకువెళ్లిపోయాడని తెలిపారు. అనంతరం తనకు ఫోన్‌చేసి కేసు వెనక్కి తీసుకోకపోతే తమ కుమార్తెను చంపెస్తాను అని బెదిరించాడని పోలీసులుకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షా తెలంగాణ పర్యటన వాయిదా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణ పర్యటన వాయిదా పడింది. గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకా రం షా ఈ నెల 22న కానీ, 28 వ తేదీన కానీ తెలంగాణలో పర్యటించాల్సి ఉంది. అంయితే కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న షా రెండు రోజుల క్రితం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరడం, అక్కడి వైద్యులు పరీక్షించి స్వైన్ ఫ్లూ సోకిందని నిర్ధారించిన విషయం తెలిసిందే.అమిత్‌షా ఇంకా ఎయిమ్స్‌లోనే చికిత్స పొందు తున్నారు. ఆస్పత్రి నుంచి ఒకటి రెండు రోజులలో డిశ్చార్జి అయినప్పటికీ పూర్తిగా కోలుకునేందుకకు సమయం పడుతుందని వైద్యులు చెబుతుండటంతో ఆయన పర్యటన వాయిదా పడిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 17 న అమిత్‌షా ఏపీలో జరుప తలపెట్టిన పర్యటన కూడా వాయిదా పడిన విష యం తెలిసిందే. అమిత్‌షాకు బదువులుగా హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజర య్యారు. ఇటీవల అమిత్‌షా కొల్‌కత్తా పర్యటన కూడా వాయిదా పడింది. ఆయ న పూర్తిగా కోలుకున్న తర్వాత పర్యటన షెడ్యూల్ ఖరారవుతుందని పార్టీ వర్గాలంటున్నా యి.పార్లమెం ట్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసేందుకు అమిత్‌షా తెలంగా ణలో పర్యటించ నున్నారని, ఈ పర్యటన కేవలం హైదరా బాద్‌కే పరిమితమై నప్పటికీ పార్టీని ఎన్నికల కార్యోన్ముఖం చేసేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందని నేతలు భావించారు. అమిత్‌షా పర్యటన నేపథ్యంలో తెలంగాణ పార్టీ నేతలు సన్నద్ధమవుతున్నారు. తాజాగా అమిత్‌షా అనారోగ్యం కారణంగా పర్యటన రద్దయ్యే అవకాశాలున్నాయన్న ఢిల్లీ నుంచి సంకేతాలు రాష్ట్ర పార్టీకి అందాయి.

రేపు మోడల్ స్కూల్ అడ్మిషన్ నోటిఫికేషన్


హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లోని 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం రేపు నోటిఫికేషన్ వెలువడనుంది. 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు మోడల్ స్కూల్స్ డైరక్టర్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 13న పరీక్షను నిర్వహిస్తారు. 6వ తరగతి వారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 7 నుంచి 10 వ తరగతి వారికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉం టుంది. మే 18 ఫలితాలను ఇవ్వనున్నట్టు డైరక్టర్ తెలిపారు. మే 19 నుం చి 31 వరకు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసి జూన్ 1 నుంచి క్లాసులను ప్రారంభించనున్నారు.

డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు గ్రేటెస్ట్ ఆసియా లీడర్ అవార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి చెందిన క్యాన్సర్ చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ సక్సేనాకు ప్రతిష్టాత్మకమైన గ్రేటెస్ట్ ఆసియా లీడర్ అవార్డు వరించింది. క్యాన్సర్ బాధితులకు సర్జరీ చేయకుండా కీమోథెరపీ వంటి సాంప్రదాయ పద్ధతిలో కాకుండా తక్కువ ఖర్చుతో ప్రత్యామ్నాయ ఆక్సిజన్ థెరపీతో వైద్యం చేయడం దిట్ట అయిన డాక్టర్ ప్రవీణ్ కుమార్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇండో సింగపూర్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరం సంస్థ ఈ అవార్డును డాక్టర్ సక్సేనాకు ఇవ్వనుంది. ఈ నెల 21న సింగపూర్‌లో జరిగే గ్రేటెస్ట్ ఆసియా లీడర్ అవార్డ్ ఫంక్షన్‌లో అవార్డును ప్రధానం చేయనున్నారు.

టీఆర్‌టీ ఎస్‌జీటీ, ఎస్‌ఏ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించిన టీఆర్‌టీ ఫలితాల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఎస్‌జీటీ ఉర్దూ- 281 పోస్టుల ఫలితాలను ప్రకటించారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్ గణితం తెలుగు మీడియంలో 191 పోస్టులకు ఫలితాలను ప్రకటించారు. వీటితోపాటు స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఇంగ్లీష్‌మీడియం-4 హిందీ మీడియంలో ఒక పోస్టుకు రిజల్ట్స్ ప్రకటించారు. పీఈటీ తెలుగు మీడియం-9, ఉర్దూ మీడియం-04, ఇంగ్లీష్‌మీడియం-01 పోస్టులకు ఫలితాలను ప్రకటించారు.



మా ఊరు - మా రాజ్యం

చక్కని పరిపాలనకు
ఈర్లదిన్నె ఫిదా

1981 నుంచి ఒకే కుటుంబానికి పట్టం

- ఐకమత్యంతో అభివృద్ధి, రెండు సార్లు ఏకగ్రీవం
- ఆదర్శంగా నిలిచిన గ్రామ పంచాయతీ



ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు

అమరచింత, ప్రభన్యూస్: రోజులు మారినా.. రాజకీయాలు మారినా... ఈర్లదిన్నె గ్రామ ప్రజలది ఒకే మాట, ఒకే బాట వారికి రాజకీయాలతో పనిలేదు. గ్రామంలోని చుక్క వంశం అంటే వల్లమాలిన అభిమానం. 38 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన చుక్క వంశానికి చెందిన వారి కుటుంబ సభ్యులకే గ్రామ సర్పంచ్ పదవిని కట్టబెట్టడం పరిపాటి. 1981లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొదటిసారి చుక్క లింగారెడ్డి గెలుపొందారు. చుక్క లింగారెడ్డి సర్పంచ్‌గా 1994 వరకు పనిచేశారు. 1995 నుండి 2004 వరకు లింగారెడ్డి సోదరుడు చుక్క చిన్న ఆశిరెడ్డిని రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. చుక్క చిన్న ఆశిరెడ్డి తన హయాంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపారు. చుక్క చిన్న ఆశిరెడ్డి చేసిన అభివృద్ధికి గ్రామ ప్రజలు ఫిదా అయ్యారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంలో ప్రజల మనసులను గెలుచుకున్నారు. నిధులను గ్రామ ప్రజలందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. 2005లో ఆయన అనంతరం ఆయన సతీమణి చుక్క లక్ష్మమ్మ ఎన్నికల్లో విజయం సాధించారు. 2005 నుంచి చుక్క లక్ష్మమ్మ తన పదవిలో కొనసాగినన్ని రోజులు గ్రామాభివృద్ధిలో రాజీ పడలేదు. 2013లో చుక్క లక్ష్మమ్మను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. ఆ నిధులను సర్పంచ్ లక్ష్మమ్మ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాలు, సీసీ రోడ్లను నిర్మించారు. ఈసారి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చుక్క వంశం ఎన్నికల్లో పోటీ చేసేందుకు సుముఖత చూపలేదు. దీంతో గ్రామస్తులు ఎవరూ నామినేషన్ వేయమని తేల్చిచెప్పడంతో గ్రామ ప్రజల అభీష్టం మేరకు చుక్క లక్ష్మమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో మూడవ సారి గ్రామ సర్పంచ్‌గా అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



గోండు గూడెం..
నవ్వింది



ఫలించిన 'మా ఊళ్లో మా రాజ్యం' నినాదం

- అడవుల జిల్లాలో గిరిజనుల చేతిలో 813 పంచాయతీలు

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : మావానాటే మావారాజ్ (మాఊరు మారాజ్యం) నినాదం గోండు గూడాలను ఆందోళన బాటపట్టించాయి.. అడవి ఒడిలో నిత్యం ఆందోళనలు జరిగేవి.. మాఊళ్లో మాకే రాజ్యం దక్కాలని పోరుబాట పట్టిన గోండు గూడాలు నవ్వుతున్నాయి.. అడవి తల్లి బిడ్డలు గ్రామ అధికారాన్ని చేజిక్కించుకుంటున్న వైనాన్ని చూసి అడవి తల్లి పులకరించిపోతుంది.. గూడాలు, తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో కొత్త గ్రామపంచాయతీలు అడవిబిడ్డలకు అధికారాన్ని కట్టబెట్టాయి. 613 గ్రామపంచాయతీల్లో స్వయం పాలన వైపు అడవి బిడ్డల అడుగులు పడుతున్నాయి. తరతరాల నుంచి వస్తున్న నినాదం సార్ధకమైంది. గూడాల్లో, తండాల్లో గిరిజనులు సంబరాలు జరుపుకుంటున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో ఎక్కువ భాగంపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. గోండు గూడాల్లో పోటీ లేకుండానే సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1508 గ్రామపంచాయతీల్లో గిరిజనులకు 613 గ్రామపంచాయతీలు రిజర్వ్ అయ్యాయి. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న గిరిజన ప్రాంతాల్లోనే ఈ పంచాయతీలున్నాయి. ఏజెన్సీ పంచాయతీలన్ని గిరిజనులకు రిజర్వ్ చేశారు. మావానాటే, మావరాజ్ కల సాకారం చేసుకునేందుకు మెజారిటీ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవాలనే ఆలోచనతో గిరిజనులు ప్రయత్నాలు చేసి సఫలమవుతున్నారు. మొదటి, రెండో విడుత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో గిరిజనులకు రిజర్వ్ చేసిన పంచాయతీలు ఏకగ్రీవం వైపు అడుగులు వేశాయి. ఏకగ్రీవమైతే ప్రభుత్వం నుంచి వచ్చే పారితోషికంతో గూడాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్న అభిప్రాయంతో గిరిజనులు ఏకీభవిస్తున్నారు. ఈసారి కొత్త గ్రామపంచాయతీలు ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఏర్పడ్డాయి. గూడాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో స్థానికపాలనలో మరింత ప్రాతినిధ్యం దక్కింది. ఆదిలాబాద్ జిల్లాలో 465 గ్రామపంచాయతీలుండగా 292 గ్రామపంచాయతీలు గిరిజనులకు రిజర్వ్ చేయబడ్డాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 334 గ్రామపంచాయతీలుండగా 192 గ్రామపంచాయతీలు గిరిజనులకు రిజర్వ్ చేయబడ్డాయి. మైదాన ప్రాంతాలైన నిర్మల్ , మంచిర్యాల జిల్లాల్లోను 129 గ్రామపంచాయతీలు గిరిజనులకు రిజర్వ్ అయ్యాయి. జిల్లాలోని 613 గ్రామాల్లో స్థానిక పాలన గిరిజనులకు దక్కడంతో మావానాటే మావరాజ్ నినాదం సార్ధకమైనట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎజెన్సీ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకునేవిధంగా ఆదివాసీ సంఘాలు గిరిజన గ్రామాల పెద్దలతో చర్చలు జరిపి ఏకగ్రీవానికి మార్గం సుగమం చేస్తున్నారు. మొదటి , రెండవ విడుతలో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో అనేక చోట్ల వారి ప్రయత్నం ఫలించింది. మూడో విడుత నామినేషన్‌ల పర్వం ముగియడంతో ఏకగ్రీవాలవైపు దృష్టిసారించారు.




ముగిసిన మూడో విడత నామినేషన్‌ల పర్వం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీ మూడో విడుత ఎన్నికల నామినేషన్‌ల పర్వం శుక్రవారం ముగిసింది. పోటాపోటిగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. మొదటి , రెండో విడుతలో జరిగే గ్రామపంచాయతీల్లో 256 గ్రామపంచాయతీలు ఏకగ్రీ వమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో భారీ సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ జిల్లాలో 115 గ్రామపంచాయతీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 37, నిర్మల్ జిల్లాలో 82, మంచిర్యాల జిల్లాలో 22 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మూ డో విడుత నామినేషన్ల గడువు ముగియడంతో ఉపసంహరణ గడు వు నాటికి మరిన్ని పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నాయి.

ఆ 8 గ్రామాల విలీనంపై రేపు తీర్పు

విలీనం కాకుంటే శివారు గ్రామాలకు ప్రత్యేకంగా ఎన్నికలు

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎనిమిది గ్రామాలు విలీనం పై ఉత్కంఠత నెలకొంది, విలీనంకు సంబంధించిన అంశం హైకోర్టులో ఉంది. ఈనెల 21న తుదితీర్పు వెలువడే అవకాశం ఉంది. తీర్పు కోసం శివారు గ్రామాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 1987 తరువాత కరీంనగర్ నగరంలో శివారు గ్రామాల విలీనంకు తరచూ బ్రేక్‌పడుతూ వస్తుంది. 1987లో అప్పటి శివారు గ్రామపంచాయతీలైన రాంపూర్, రాంనగర్‌లను కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో నగర విస్తీర్ణం పెరిగింది. 2005లో కరీంనగర్ మున్సిపాలిటీని అప్పటి ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చింది. కార్పొరేషన్‌గా మార్చినందున విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో శివారులోని మరో 10 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదిస్తూ జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అయితే 2013లో హైకోర్టును అప్పటి సర్పంచ్‌లు ఆశ్రయించడంతో విలీనంకు బ్రేక్‌పడింది. 2014 తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత మరోమారు ప్రయత్నాలు జరిగాయి, కరీంనగర్‌ను కేంద్రం స్మార్ట్ సిటీగా ఎంపికచేయడంతో దీన్ని గ్రేటర్‌నగరంగా మలచాలని తొలుత 20 గ్రామాలను, ఆ తరువాత 14 చివరకు ఎనిమిది గ్రామాలను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తాజా మాజీ సర్పంచ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ తీర్పు సోమవారం వెలువడనుంది. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో విలీనం పంచాయతీలో పంచాయతీ అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహించలేదు. అయితే ఇందుకు సంబంధించిన తీర్పు 21న వెలువడనుండటంతో ప్రజాప్రతినిధుల్లో ఉత్కంఠత చోటుచేసుకుంది. విలీనం వద్దంటూ పిటీషన్ వేసిన మాజీ సర్పంచులు మాత్రం విలీనంకు వ్యతిరేకంగానే జడ్జిమెంట్ వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. విలీనం జరగకుంటే ఈ ఎనిమిది పంచాయతీలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కరీంనగర్ నగరపాలక సంస్థలో రేకుర్తి, సీతారాంపూర్, పద్మనగర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లె, వల్లంపహాడ్ గ్రామాలతోపాటు తోపాటు తిమ్మాపూర్ మండ లంలోని అల్గునూరు, మానకొండూరు మండలంలోని సదాశివపల్లెలను విలీనం చేయాలని నిర్ణయించారు. విలీనంపై హైకోర్టు సానుకూలంగా స్పందిస్తే నగర విస్తీర్ణం, జనాభా పెరగనుంది. విస్తీర్ణం పెరగడంతోపాటు శివారు గ్రామాలను ప్రస్తుతం శివారు ప్రాంతాలలో ఉన్న డివిజన్లకు కలుపుతారు, నగరపాలక సంస్థల ఎన్నికల నాటికి డివిజన్ల సంఖ్యను పెంచి పునర్విభజన చేసే అవకాశాలు ఉన్నాయి. ఏ నిర్ణయమైనా నేడు వెలువడే తీర్పుపైనే ఆదారపడి ఉంది.



పల్లెల్లో మరాఠా మద్యం

- పంచాయతీ ఎన్నికల్లో మద్యం సిండికేట్ దోపిడీ
- మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతి
- చోద్యం చూస్తున్న అబ్కారీ అధికారులు

నిజామాబాద్ , ప్రభన్యూస్ బ్యూరో : పంచాయతీ ఎన్నికల్లో మద్యం పంపిణీ జోరుగా సాగుతోంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు మద్యం ఎరగా వేస్తున్నారు. మహిళా ఓటర్లకు మాంసం, కూల్‌డ్రింక్స్ ఇస్తుండగా, పురుష ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా పల్లెల్లో మద్యం పంపిణీ భారీ ఎత్తున చేస్తున్నారు. గ్రామాల్లో ఉండే వైన్స్‌లలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు రవాణా పరంగా, దూరంపరంగా నిజామాబాద్ నగరం అనుకూలంగా ఉంది. దీంతో పల్లె పంచాయతీ అభ్యర్థులు భారీ ఎత్తున మద్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా నిజామాబాద్ నగరంలోని వైన్స్ షాపులను ఎంచుకున్నారు. మండలానికి ఐదారు వైన్స్ షాపులు ఉండడంతో అన్ని గ్రామాలకు మద్యం సరఫరా చేసేంతగా నిలవలు ఉండవు. దీంతో తప్పనిసరి కావాల్సిన మద్యంను కొనుగోలు చేసేందుకు నగరంలోని వైన్స్ షాపులను ఎంచు కన్నారు. గ్రామాల నుంచి భారీగా మద్యం కొనుగోలు కోసం రావడంతో నగరంలోని వైన్స్ సిండికేట్ వ్యాపారులు దోపిడికి తెగబడ్డారు. ఎక్కడికక్కడ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులకు దండిగా ముడుపులు ముట్టజెప్పి నకిలీ మద్యంతో దోచుకుంటున్నారు. ఎన్నికల్లో ఎక్కువగా తక్కువ ధర ఉన్న, ఛీప్ లిక్కర్‌లను పంపిణీ చేస్తారు. ఈసారి ఎక్కువగా బ్రాండెడ్ మద్యం సరఫరా చేయడంతో మద్యం కొరత ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన నిజామాబాద్ నగరం లోని మద్యం సిండికేట్ నకిలీ మద్యం అమ్మకాలకు తెరలే పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. డూప్లికేట్ మద్యం స్టిక్క ర్లను అతికించిన కల్తీ మద్యంను భారీ ఎత్తున తీసుకువచ్చి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. మద్యం కల్తీ కావడంతో ఎవ రికి అనుమానం రాకుండా బ్రాండెడ్ మద్యం కంపెనీల స్టిక్క ర్లను, లేబుళ్లను అతికించి దోపిడికి పాల్పడుతున్నారని సమాచారం.

మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతి

పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కాకుండా కర్ణాటక నుంచి కూడా మద్యం భారీగా దిగుమతి చేసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నకిలీ మద్యం భారీగా జిల్లాకు దిగుమతి అయ్యింది. అనేక ఏళ్లుగా మహారాష్ట్ర మద్యం జిల్లాను వణికిస్తోంది. కల్తీ మద్యంను సీసాల్లో నింపి డూప్లికేట్ స్టిక్కర్లు, లేబుళ్లు అతికించి సరఫరా చేస్తారు. పక్కనే ఉండడంతో రహస్యంగా కాకుండా రాత్రి, తెల్లవారు జామున పెద్ద ఎత్తున నగరానికి నకిలీ మద్యం చేరుతుంది. చెక్‌పోస్టుల వద్ద ఉండే అధికారులకు కొద్దిమొత్తం చేతు తడిపితే చాలు ఆటంకం లేకుండా మద్యం నగరానికి చేరిపోతుంది. ఇలా నగరానికి చేరిన మద్యం ఎలాంటి ఇబ్బంది లేకుండా పల్లెలకు చేరవేస్తున్నారు. అతి తక్కువ ధరకు దిగుమతి చేసుకుంటున్న మద్యంను కాస్త ధర తగ్గించి హోల్‌సేల్ పేరుతో గ్రామాలకు విక్రయిస్తున్నారు. ఎక్కువగా క్వాటర్, హాఫ్ బాటిళ్లు సరఫరా చేస్తున్నారు. దీంతో నకిలీ మద్యం సీసాల్లో నింపడంతో ఇబ్బంది లేకుండాపోయింది.

అబ్కారీ అధికారులకు భారీగా ముడుపులు

గ్రామాల్లో ఎన్నికల వేళ అక్రమ మద్యం అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్వాకం మూలంగా విచ్చలవిడిగా పంపిణీ జరుగుతోంది. నగరంలో ప్రధానంగా అబ్కారీ అధికారుల ఉదాసీన వైఖరి, జేబులు నింపుకునే కక్కుర్తి మూలంగా నకిలీ మద్యంకు అడ్డులేకుండా పోయింది. క్రమం తప్పని ముడుపులతో నగరంలో వైన్స్ వ్యాపారులు ఇష్టారీతిగా నకిలీ మద్యం, వేళాపాళ లేని సమయంతో ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. మద్యం వ్యాపారులు ఇచ్చే ముడుపులకు అబ్కారీ అధికారులు అలవాటుపడి ఏం జరిగినా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నకిలీ మద్యం భారీగా మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతోందని, పల్లెల్లో ఎక్కువ మొత్తంలో పంపిణీ జరుగుతున్నది బహిరంగమే అయి నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే నకిలీ మద్యంను అరికట్టాల్సిన అవసరం ఉంది. నకిలీ మద్యం అమ్మకాలు చేస్తున్న వైన్స్‌లపై, సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తొలి విడత..
ప్రచారానికి తెర

- రేపే పోలింగ్
- 3707 పంచాయతీల్లో ఎన్నికలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల పోరులో తొలిఘట్టం మరికొన్ని గంటల్లో ముగియనుంది. తొలివిడుత ఎన్నికలు జరుగుతున్న 3707 గ్రామ పంచాయతీల్లో హోరు పుట్టించిన ఎన్నికల ప్రచారాలు శనివారం సాయంత్రం 5గంటలతో ముగిసి పోయాయి. అభ్యర్థులు ఇక పోలింగ్ దృష్టి కేంద్రీకరించారు. సోమవారం తొలిదశలోని 3707 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు , 12202 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఉదయం 7గంటలనుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు జరిపి ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నారు. అదే రోజు చేతులెత్తే పద్ధతిలో ఉపసర్పంచ్ ఎన్నిక జరపనున్నారు. పోలింగ్ జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో శాంతిభద్రతలకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యల కింద 144 సెక్షన్ అమల్లో పెట్టారు. ప్రజలు నలుగురికి మించి గుంపులు గుంపుటుగా తిరగటాన్ని నిషేధించారు. అంతే కాకుండా ఉప సర్పంచ్ ఎన్నికలు ముగిసే దాక మద్యం విక్రయాలను కూడా నిషేధించారు.

చివరి దశ.. 26106నామినేషన్లు

రాష్ట్రంలో చివరిదశ ఎన్నికలు జరుగున్న గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ముగిసింది. మొత్తం 4116 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు ప్రకటించగా సర్పంచ్ స్థానాలకు 26106 నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. అదే విధంగా 36729 వార్డు స్థానాలకు 93518 నామినేషన్లు చెల్లబాటు అయినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆదివారం ఈ పంచాయతీల్లో అప్పీళ్లకు అవకాశం కల్పించారు. సోమవారం అప్పీళ్లను పరిష్కరించనున్నారు. ఈనెల 22న ఈ పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటించనున్నారు. అ వెనువెంటనే ఎన్నికల గుర్తులు కేటాయించనున్నారు. చివరి విడుత గ్రామ పంచాయతీల్లో ఈ నెల 30 న పోలింగ్ జరగనుంది.

రెండో విడతలో ప్రచార హోరు

రెండో దశ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ దశలోని వాటిలో 778 పంచాయతీలకు ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3342 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 10668మంది పోటీలు పడుతున్నారు. అంతేకాకుండా 26191 వార్డు స్థానాలకు 63480 మంది పోటీలో ఉన్నారు. రెండవ దశలోని గ్రామ పంచాయతీలకు ఈ నెల 25న పోలింగ్ జరగనుంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఖమ్మం జిల్లాలో 167 సర్పంచ్‌లు, 1458 వార్డులకు ఎన్నికలు

ఖమ్మం, ప్రభ న్యూస్ : రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో మొదటి విడతగా 6 మండలాల్లో ఎన్నికలు సోమవారం నిర్వహిం చను న్నారు. ఆ దిశగా జిల్లా అధి కారు లు అన్ని సన్నాహాలు ఏర్పా టుచే శారు. ఇప్పటికే ఆయా మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అదే విధంగా ఆయా గ్రామాల్లో 275 వార్డులు సైతం ఏకగ్రీవమైయ్యాయి. దీంతో మిగిలిన పంచాయతీలైన 167 గ్రామ సర్పంచ్‌లతోపాటు 1458 వార్డు స్థానాలకు ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ముదిగొండ మండలం లో 2 గ్రామాలతోపాటు 32 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. అదే విధంగా కూసు మంచిలో 3 గ్రామాలతోపాటు 61 వార్డులు ఏకగ్రీవమైయ్యాయి. తిరు మలాయపాలెంలో 3 గ్రామాలతోపాటు 50 వార్డులు ఏకగ్రీవం కాగా, ఖమ్మం రూర ల్‌లో 1 సర్పంచ్ స్థానంతోపాటు 15 వార్డు స్థానాలు ఏకగ్రీవమైయ్యాయి. నేలకొండపల్లిలో 5 సర్పంచ్ స్థానాలతోపాటు 54 వార్డులు ఏకగ్రీవంకాగా, కామేపల్లిలో 7 సర్పంచ్‌లతోపాటు 63 వార్డులు సైతం ఏకగ్రీమమైయ్యాయి. ఇప్పటికే అధికారులు సర్పంచ్‌లకు , వార్డులకు గుర్తులు కేటాయించిన విషయం విధితమే. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

పల్లెల్లో తిష్ట!

- ప్రచారం ముగిసింది
- తెరచాటు వ్యవహారాలు షురూ

మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. ఈనెల 7వ తేదీన మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడం, అదే రోజు నుండి నామినేషన్ల స్వీకరణ చేపట్టడం జరిగింది. 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా 13వ తేదీ వరకు ఉపసంహరణ చేపట్టారు. ఉపసంహరణ నాటికి ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు 598 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఉపసంహరణ నాటికి 76 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో 522 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే శనివారం సాయంత్రం వరకు ప్రచారం నిర్వహించగా ఇక సమరానికి 24 గంటల సమయం మాత్రమే ఉండడంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. తొలి సమరంలో రాజెవరనేది ఈనెల 21న తేలనుంది.

జోరుగా మద్యం పంపిణీ

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాల్లో తొలి విడత ఎన్నిక ఈనెల 21న జరగనున్నాయి. మొదటి విడత ప్రచారానికి తెర పడడంతో చీకటి ఒప్పందాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి ప్రచారం ముగిసిపోవడంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే ఎన్నికలు ఉన్నందున తమకు ఓటు వేయాలని అభ్యర్థులు మందు, నగదు పంపిణీ కార్యక్రమం జోరుగా సాగిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే గ్రామాల్లో మద్యం నిల్వలు చేయడం జరిగింది. అయితే గ్రామాల్లో అటు ఎన్నికల అధికారులు గానీ, ఎక్సైజ్ అధికారులు గానీ పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఇలావుండగా కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ నేతలు బహాటంగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో కుల సంఘాలకు, యువజన సంఘాలను మచ్చిక చేసుకునేందుకు ఇదివరకే పలు హామీలు, నగదు, బహుమతుల రూపంలో అందించడం జరిగింది. ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండడంతో ఒప్పందాలను అమలు చేసుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఎలాగైనా అధకార పార్టీ మద్దతుదారులే పంచాయతీ పీఠం కైవసం చేసుకునేందుకు నాయకులు గ్రామాల్లో తిష్టవేశారు. ఏదిఏమైనా పల్లెల్లో మందు, బిర్యానీ పంపిణీ జోరుగా సాగుతుంది.



ప్రచారం నిర్వహిస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి..(ఫైల్)

గురి చూసి కొట్టండి

• లక్ష్యం నిర్దేశించుకుని పనిచేయాలి • యువతకు అన్నా హజారే పిలుపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: యువత లక్ష్యంతో ముందుకు సాగితేనే ఏదైనా సాధించగలరని సామాజిక ఉద్యమకారుడు, పద్మభూషణ్ అన్నా హజారే అన్నారు. యువశక్తి సరైన రీతిలో ప్రయాణిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. తెలంగాణ జాగృతి సంస్థ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును సంస్థ అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవితతో కలిసి అన్నా హజారే శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి అనే అంశంపై అన్నా హజారే మాట్లాడుతూ యువత ఏడాది, ఐదేళ్లు, పదేళ్లు ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్ని అవరోధాలు వచ్చిన వెనుకడుగు వేయొద్దని సూచించారు. నిరంతరం నేర్చుకోవాలని ఉత్సుకత యువతలో ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు మనం ఉన్నామని అన్నారు. సమాజానికి చేస్తే అందరూ గుర్తు పెట్టుకుంటారని అన్నారు. దేశంలో, తెలంగాణలో, మహారాష్ట్రలో ఎందరో కోటీశ్వరులు ఎంత మంది ఉన్నా దేశం కోసం త్యాగం చేసిన మహాత్మాగాంధీ, అంబేద్కర్ వంటి వారిని గుర్తు చేసుకుంటారని అన్నారు. అందుకే సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. తాను యువకునిగా ఉన్నప్పుడు తనతో డబ్బులు లేవని.. పైగా అధికారం కూడా లేదన్నారు. కానీ దేశానికి ఏదో చేయాలనే తపన ఉండిందన్నారు. అందుకే యువతకు దశ, దిశ తెలిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. చిన్న చిన్న లక్ష్యాలతో ముందుకు సాగుతూ జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఉదయం నుంచి రాత్రి వరకు ఉరుకులు, పరుగులతో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు.

నేనూ ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

తాను 25 ఏళ్లకు ఆత్మహత్య చేసుకోవాలని భావించానని.. కానీ మహాత్ముని గురించి చదివి జీవిత పాఠం తెలుసుకున్నానని అన్నారు. ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచన మానుకొని గ్రామ సేవ చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. భగవంతుడు ఇచ్చిన ఈ జీవితం సేవ చేయడానికే తప్ప... నాలుగు గోడల మధ్య మందిరాల్లో చేసే సేవకు కాదన్నారు. ప్రజా సేవే భగవంతుని సేవ అన్నారు. పెళ్లి చేసుకుంటే ప్రజలకు సేవ చేయలేనని భావించి పెళ్లి చేసుకోలేదన్నారు. అప్పటి నుంచి ఇప్పుడు 81 సంవత్సరాల వరకు దేశ సేవ చేసుకుంటూ వస్తున్నానని అన్నారు. తనకు దేశమే కుటుంబం అని.. దేశమనే పెద్ద కుటుంబం తనకు ఉందన్నారు. యువత ధూమపానం, మద్యపానం, వంటి చెడు అలవాట్లతో ఏమీ సాధించలేరన్నారు. గాంధీజీ ఆలోచనలు, ఆశయాలు ఆచరించాలని పిలుపునిచ్చారు. అహింసతో పోరాడి సర్వం సాధించు కోవచ్చని గాంధీజీ చెప్పారన్నారు. 8 సంవత్సరాలపాటు అహింసాయుతంగా పోరాడి సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)ని సాధించానని గుర్తు చేశారు. తన ప్రసంగం చివరల్లో భారత్‌మాతాకీ జై... వందేమాతరం.. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ముగించారు.

ఐక్య పోరాటంతోనే ఫలితం: కవిత

సదస్సు ప్రారంభం సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి కోసం యువత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ప్రపంచంలోని సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవేనని అన్నారు. మన వల్ల వచ్చిన సమస్యల్లో కొన్నింటికైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. యువత కలిసి కట్టుగా పోరాడితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని కవిత పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి యేటా 22వేల మంది చిన్నారులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని తెలిపారు. 115 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. ఏదో ఒక రంగంలో నిష్ణాతులైన వారు ప్రతినిధులుగా వచ్చారని తెలిపారు. వారి అనుభవాలను పంచుకోవడం కోసం ప్రతి 2ఏళ్లకు ఒక సారి అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సదస్సు సందర్భంగా సమాజంలో మార్పు తీసుకురావ డానికి కృషి చేసే 8 మందికి ఫెలోషిప్ ఇవ్వనున్నట్టు చెప్పారు.



యువత, మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

• కశ్మీర్‌పై కాంగ్రెస్, బీజేపీలకు స్పష్టమైన విధానం లేదు : ఎంపీ అసదుద్దీన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యువత, మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. యువకులకు రాజకీయ ప్రాధాన్యం కేవలం ప్రాంతీయ పార్టీల ద్వారానే సాధ్యమని.. కాశ్మీర్‌పై కాంగ్రెస్, బీజేపీలకు స్పష్టమైన విధానం లేదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. కాశ్మీర్ ఇండియాలో అంతర్భాగమన్నారు. శనివారం హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో యువత అభివృద్ధి- విధానం అనే అంశంపై ప్యానల్ డిస్కషన్ జరిగింది. సీనియర్ పాత్రికేయులు శేఖర్ గుప్తా మోడరేటర్‌గా వ్యవహరించగా ఎంపీ కవిత, ఎంపీ అసదుద్దీన్, అసోం రాష్ట్రా నికి చెందిన ఎంపీ గౌరవ్ గొగోయ్, బ్రిటన్ ఎంపీ సీమా మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు. చర్చలో భాగంగా పలు అంశాలపై ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానం చెప్పారు. మహిళలు, యువతకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీ కవిత అన్నారు. పార్లమెంటులో ఈ రెండు అంశాలపై రానున్న సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు.

రైతుబంధు అందరూ అమలు చేయాలి

• కేసీఆర్ నిర్ణయాలు ప్రతిష్ఠాత్మకం • అన్ని రాష్ట్రాలు అమలు చేయక తప్పదు • రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా పట్టించుకోని కేంద్రం • ఆంధ్రప్రభ ఇంటర్వ్యూలో సామాజిక కార్యకర్త అన్నాహజారే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సామాజిక కార్యకర్త అన్నా హజారే చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ తరహా పథకాన్ని విధిగా అమలు చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన శనివారం ఇక్కడ 'ఆంధ్రప్రభ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. ఆర్థికాభి వృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని ఇందుకు కారణం కేసీఆర్ నాయకత్వ పటిమేనని చెప్పారు. ఎకరానికి ఏటా రూ.8వేలు రైతు పెట్టుబడి పథకం ఇవ్వడమే కాకుండా ఒక్కో రైతుకు రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రారంభించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన ప్రశంసించారు.

యువత చేతుల్లోనే భవిత

నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మూడు రోజులపాటు ఇక్కడ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ ఎంతో అవసరమని దేశంలోని యువత పెడదారి పట్టకుండా వారిని సన్మార్గంలో పెట్టేందుకు ఇటువంటి సదస్సులో ఎంతో దోహద పడతాయని హజారే చెప్పారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని వారికి దిశానిర్దేశం చేయవలసిన ఆవశ్యకత, అవసరం ఉందని ఆయన అన్నారు.

వ్యాపారులపైనే కేంద్రం మమకారం

కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి వ్యాపారులపై ఉన్న శ్రద్ధ, మమకారం రైతులపై లేదని ఆరోపించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా కేంద్రం ఏమాత్రం పట్టించు కోవడం లేదని ఈ అంశాన్ని ప్రస్తావిస్తే విశ్వనాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తున్నామంటూ చేతులు దులుపు కుంటోందని మండి పడ్డారు. రైతుల విషయంలో కేంద్రం అనునిత్యం అవాస్తవాలు మాట్లాడుతోందని ఆయన ఆగ్రహిం చారు. రైతుల సంక్షేమానికి నిజంగా కమీషన్ సిఫారసులను అమలు చేస్తుంటే రైతుల ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయని అన్నా హజారే ప్రశ్నించారు. కేసీఆర్ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నా రని, ఆయన ప్రవేశపెట్టిన రైతుబంధు పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. రైతుల సంక్షేమాన్ని పట్టించుకునే ప్రభుత్వాలు మనుగడ సాగిస్తా యని ఆయన చెప్పారు. కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు పథకం సముద్రంలో దీపస్తంభం లాంటిదని కొనియాడారు.



గ్రామీణ ప్రాంతాలపై చిన్నచూపు

అధికారంలో ఉన్న ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోవడమే మానేశాయని ఇలా చేయడంవల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. యువకులు తలుచుకుంటే దేశాన్ని ఏమైనా చేయగలరని అయితే వారికి సరైన సూచనలు, సలహాలు ఇచ్చేవారు కావాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులు, శాస్త్రవేత్తలు వచ్చి అధ్యయనం చేస్తున్నారని ఎప్పటికప్పుడు వారు ప్రభుత్వాలకు అవసరమైన సూచనలు, సలహాలతో పాటు సిఫారసులు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

యువ శక్తి కదలాలి

దేశ జనాభా 125 కోట్లు ఉందని దేశంలో 6 లక్షల 38వేల గ్రామాలు, ఆవాస ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. ఒక్కో గ్రామం నుంచి ఒక్కో యువకుడు బయలుదేరి ఆరు లక్షల మంది యువకులు ముందుకువస్తే ఈ దేశం రూపురేఖలే మారిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ యువకులంతా కదంతొక్కితే భారతదేశం ముందు ఏ దేశం నిలబడలేదని అభివృద్ధిలో దూసుకుపోయే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. యువతకు దిశానిర్దేశం చేసేవారు లేకపోవడంతో వారు ముందుకు సాగలేకపోతున్నారని తద్వారా వారు నిరాసక్తతో ఉన్నారని చెప్పారు. తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత యువతను దృష్టిలో పెట్టుకుని ఈ అంతర్జాతీయ యువ సమ్మేళనాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సమ్మేళనం ద్వారా దేశంలోని యువతలో మార్పు వస్తుందన్న ఆశాభావంతో తానున్నానని హజారే చెప్పారు. కవిత లోక్‌సభ సభ్యురాలని అందునా యువ మహిళా సభ్యురాలని యువ లోక్‌సభ సభ్యులంతా పార్లమెంట్‌లో పోరాడి గ్రామీణ ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వాలు దోహదం చేసేవిధంగా కృషిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని తద్వారా దేశం, రాష్ట్రాలు అన్ని రంగాల్లో దూసుకుపోయే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతిని పరిరక్షిస్తే ఎటువంటి అవరోధాలు ఉండవని భవిష్యత్తు తరాలు కాలుష్యంతో ఇంకా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకురావలసిన అవసరం ఉందని ఈ చట్టాలను అతిక్రమించే వారిపై కేసులు నమోదుచేసి కటకటాల వెనక్కు పంపిస్తేనే ఆశించిన ప్రయోజనం నెరవేరు తుందని చెప్పారు. దేశం కోసం పోరాడే వారిని జైలులో పెట్టినా ఇబ్బంది లేదని తనను కొన్ని వందలసార్లు అరెస్టుచేసి జైలుకు పంపించినా ఇబ్బంది పడలేదని చెప్పారు. సమస్యల సాధనకు పోరాడుతుంటే తనను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు పెట్టి జైలులో పెట్టారని అయినా తాను వెనకాడలేదని గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభి వృద్ధిపై తాను చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని ఆ దిశగా తన పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

టీడీపీతో పొత్తు వల్లే నష్టపోయాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపితో పొత్తు పెట్టుకోవడం వలనే కాంగ్రెస్ పార్టీ నష్టపోయిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో టిడిపితో పొత్తు ఉంటుందా? లేదా? అనే నిర్ణయం తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై ఆధారపడి ఉంద న్నారు. ఎన్నికల్లో ఓటమిపై ఒక్కరినే బాధ్యులుగా చేయ డం సరికాదన్నారు. సీట్లు కేటాయింపులో లోపా లు ఉన్నాయని, నిర్దేశిత సమయం కంటే ముందే సీట్లను ప్రకటిస్తే సరిపోనని ఆయన అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు.. ప్రస్తుత పరిస్థితుల్లో సీఎల్పీ నాయకుడిగా భట్టివిక్రమార్క ఎంపిక సరైన నిర్ణయమని ఆయన చెప్పారు. పదవులు కావాలని ఆశించడంలో తప్పులేదని, కానీ నిర్ణయాలు మాత్రం రాహుల్ నేతృత్వంలో అధిష్టానం తీసుకుంటుందన్నారు. రాహుల్ నిర్ణయానికే కట్టుబడి తాము పనిచేస్తామని ఆయన తెలిపారు. తాను పార్టీ మారుతున్నట్లు ప్రచారం చేసి తన ప్రతిష్టను తగ్గించే ప్రయత్నం కొందరు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లోని తనకు వ్యతిరేకులైన కొందరు వ్యక్తులు ఇలాంటి దుస్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, ప్రతిపక్షంలో ఉన్న ప్పటికీ ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.

వారిని తప్పిస్తేనే పార్టీకి బతుకు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బతకాలంటే టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌ను, పార్టీ ఇన్‌చార్జీ పదవి నుంచి కుంతియాను తప్పించాలని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. త్వరలోనే ఉత్తమ్ పదవి ఊడుతుందని ఆయన అన్నారు. సీఎల్పీ నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం మంచి నిర్ణయం తీసుకున్నదని ఆయన తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భట్టి విక్రమార్కను సీఎల్పీ పదవిలో నియమించి మంచి సందేశం ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా ఉంటుందనే సంకేతం ఇచ్చారని ఆయన తెలిపారు. తెలంగాణ వస్తే సామాజిక న్యాయం జరుగుతుందని మేం ప్రత్యేక రాష్ట్రం కోసం సోనియాగాంధీని ఒప్పిం చామన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ఉంటే ఈ రాష్ట్రానికి దళితుడే ముఖ్యమంత్రి అయ్యేవారని ఆయన అభిప్రాయపడ్డారు. పీసీసీని ప్రక్షాళన చేయాలని, పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహించి ఉత్తమ్, కుంతియాలు స్వచ్ఛం దంగా పదవుల నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారిద్దరిపైన పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. పార్టీని భ్రష్టు పట్టించిన ఉత్తమ్‌కు ఇంకా సీఎల్పీ ఇవ్వద్దనే హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకున్నదని అన్నారు. కొత్త పీసీసీ అధ్యక్షుని నేతృత్వంలోనే కొత్త కమిటీలు వేయాలన్నారు.

ఓడినవారికి డీసీసీ పదవులివ్వొద్దు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులను ఓడిన వారికి కాకుండా పని చేసే కార్యకర్తలను నియమించాలని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎన్నికల ముందే డీసీసీలను నియమించాలని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్, పార్టీ ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియాకు చెప్పినా పట్టించు కోలేదని ఆయన విమర్శించారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లా డారు. డీసీసీ పదవులు కార్యకర్తలకే ఇవ్వాలన్నారు. ఓడిన వారికి ఇస్తే మళ్లీ పార్టీని వీడుతారని ఆయన చెప్పారు. దీనిపై పార్టీలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీని వీడటం చాలా అన్యాయమన్నారు. తమిళనాడులో నాయకులెవరైనా పార్టీ మారితే కార్యకర్తలు స్పందిస్తారని, ఇక్కడ కూడా పార్టీ మారే నాయకులను కార్యకర్తలు నిలదీయాలని ఆయన సూచిం చారు. తెలం గాణకు ఎన్నడూ మద్దతివ్వని జగన్ వద్దకు కేటీఆర్ ఎలా వెళ్లుతారని వీహెచ్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రాజకీయాలను కలుషితం చేస్తున్నారని విమర్శించారు.

టీఆర్ఎస్ మైండ్‌గేమ్

• మావాళ్లు మాదగ్గరే.. పార్టీని వీడరు • తెరాస ఆకర్ష్ వలలో ఎవరూ పడరు • గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు • సభను హుందాగా నడుపుతారని ఆశిస్తున్నాం • హామీలన్నీ అమలు చేసేలా ఒత్తిడి చేస్తాం • సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అధికార టీఆర్ఎస్ పార్టీ మైండ్‌గేమ్ ఆడుతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. టీఆర్ఎస్ ఆకర్ష్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరు కూడా లొంగరని, నిబద్ధత కలిగిన సైనికులని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షం లేకుండా చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన అభివర్ణించారు. శనివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీతో కలిసి మీడియాతో మాట్లాడారు. అంతకుముందు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పార్టీ అధిష్టానం సీఎల్పీ నేతగా నియమించిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ సీఎల్పీ నాయకత్వ బాధ్యతలను అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలందరం సమష్టిగా ప్రజాసమస్యలపై ప్రభుత్వంపై పోరాటం చేస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిర్మాణాత్మకంగా పనిచేస్తామని, సభలో గవర్నర్ ప్రసం గంలో కొత్తదనం ఏమీ లేదని, బహిరంగ సభల్లో మాట్లాడినట్లుగానే ఉందని ఆయన విమర్శించారు.

గతంలో చెప్పిన హామీలనే ఇప్పుడు గవర్నర్ ప్రసంగంలో చేర్చారని ఆయన అన్నారు. నిరుద్యోగులు గురించి వాస్తవాలు చెప్పి ఉంటే సంతోషించే వాళ్లమని భట్టి అన్నారు. పింఛన్, నిరు ద్యోగ భృతి, పదవీవిరమణ, ఖాళీల భర్తీపై స్పష్టత లేదని భట్టి విక్ర మార్క దుయ్యబట్టారు. సభను హుందాగా, ప్రజాస్వా మ్యయు తంగా నడుపుతారని ఆశిస్తున్నట్లు భట్టి అభిప్రాయపడ్డారు.

భట్టిని సన్మానించిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్



కాంగ్రెస్ శాసన సభాపక్ష నేతగా ఎన్నికైన భట్టి విక్రమార్కకు టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం నేరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గాంధీభవన్‌కు వెళ్లారు. అక్కడనే ఉత్తమ్‌తో పాటు ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను వమ్ము చేయకుండా పనిచేస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోనే సామాజిక న్యాయం ఉంటుందని ఆయన తెలిపారు. దళిత సామాజిక వర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత బాధ్యతలు అప్పగించి సామాజిక న్యాయం చేసిందని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన భట్టికి ఈ అవకాశం ఇవ్వడం మంచి నిర్ణయమన్నారు.



కేసీఆర్ ఎలక్షన్ స్పీచ్‌ను గవర్నర్ కాపీ కొట్టారు : షబ్బీర్‌అలీ

ఎన్నికల ప్రచార సభల్లో కేసీఆర్ మాట్లాడిన స్పీచ్‌ను గవర్నర్ కాపీ కొట్టారని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. రైతు రుణమాఫీ, పింఛన్ , డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఎప్పుడిస్తారో గవర్నర్ చెప్పి ఉంటే బాగుండేదని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై గవర్నర్ ప్రసంగంలో మైనార్టీ రిజర్వేషన్లుగా ప్రస్తావించారని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ మిగులుపై గవర్నర్ అబద్ధాలు చదివారని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వాలు తప్పు చేసినట్లు చెప్పడం సరికాదని ఆయన ఖండించారు. దేశంలో మిగులు విద్యుత్ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన వివరించారు. తమ ప్రభుత్వాలు అమలు చేసిన సంస్కరణలతోనే మిగులు విద్యుత్ సాధ్యమైందన్నారు. రైతు రుణమాఫీ ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదని గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రైతు బంధు పథకం నిధులు ఇంకా చాల మందికి అందలేదని, ఆ డబ్బులను విడుదల చేయాలని గండ్ర డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్స్

• దేశ చరిత్రలోనే తొలిసారి • కడప జిల్లా రికార్డు



కడప, ప్రభ న్యూస్ : దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్ లైసెన్స్ జారీ చేసిన జిల్లాగా కడప రికార్డు సృష్టించింది. కడప జిల్లాలోని చాపాడు మండలం పల్లవోలు గ్రామం చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయసేవల శిబిరంలో జిల్లాలోని 32 మంది ట్రాన్స్‌జెండర్‌లకు ఎల్ఎల్ఆర్ లైసెన్సు పత్రాలను జిల్లా కలెక్టర్ హరికిరణ్, జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాస్, జిల్లా ఎస్పీ అభిషేక్ మొహంతిలు పంపిణీ చేశారు. రవాణాశాఖ ద్వారా లైసెన్సు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోడానికి ట్రాన్స్‌జెండర్‌లు ప్రయత్నించగా ఆన్‌లైన్ దరఖాస్తు లో లింగబేధం వద్ద స్త్రీ లేదా పురుషుడు అని మాత్రమే వుండటం వల్ల దరఖాస్తు చేసుకోడానికి వీలులేక పోయింది. ఈనెల సంక్రాంతి పండుగ ముందు రోజున ట్రాన్స్‌జెండర్‌లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను కలసి ఆన్‌లైన్‌లో వున్న వివరాలు తెలిపి ట్రాన్స్‌జెండర్‌లకు కూడా లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై జడ్జి జిల్లా కలెక్టర్ హరికిరణ్‌తో కలసి కమిషనర్ బసిరెడ్డితో మాట్లాడి 9 న్యాయసేవల శిబిరంలో వారందరికీ లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవా లన్నారు. దీనిపై వెంటనే స్పం దించిన కలెక్టర్ హరికిరణ్, రవాణాశాఖ కార్యదర్శి బాలసుబ్రమణ్యం తో మాట్లాడి ఆన్‌లైన్ దరఖాస్తులు మేల్, ఫిమేల్‌తో పాటు ట్రాన్స్ జెండర్ అనే కాలమ్ కూడా ఏర్పాటుచేయాలన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా కడప జిల్లా నుంచే ఈ విధమైన విన్నపం వచ్చింది దీనిని ఎలాగైనా పరిష్కరి స్తామని రవాణాశాఖ కార్యదర్శి కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో మేల్, ఫీమేల్‌తో పాటు ట్రాన్స్ జెండర్‌లకు కాలమ్ ఏర్పాటు చేశారు. ఈలోగా జిల్లాలో అర్హులైన 32 మంది ట్రాన్స్‌జెండర్ లకు టీటీసీ బసిరెడ్డి ఆధ్వర్యంలో వారికి రోడ్డు భద్రత, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు డ్రైవింగ్‌లో కూడా శిక్షణ ఇచ్చారు. శనివారం న్యాయసేవల శిబిరంలో 32 మంది ట్రాన్స్‌జెండర్‌లకు ఎల్ఎల్ఆర్ లైసెన్సు పత్రాలు అంద జేశారు. దేశ చరిత్రలోనే ట్రాన్స్‌జెండర్‌లకు లైసెన్సులు జారీ చేసిన దాఖలాలు లేవని ఈ విషయంలో కడపజిల్లా రికార్డు సృష్టిం చినట్టు వారు పేర్కొ న్నారు.

జగన్ కేసులో ఏపీ సర్కార్‌కు చుక్కెదురు

• పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు

విశాఖపట్నం(క్రైం), ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్ర ప్రతిపక్షనేత, వైకాపా జాతీయ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యా ప్రయత్నానికి సంబంధించిన కేసులో ఎన్ఐఏ విచారణ వేగవంతం చేసింది. కేంద్రం హోంశాఖ ఆదేశాల మేరకు జగన్ కేసును ఎన్ఐఏ విచారణకు స్వీకరించింది. ఈ నేపథ్యంలోనే రోజు రోజుకు తన దర్యాప్తును ముమ్మరం చేసింది. అయితే ఈ కేసును ఎన్ఐఏ నుంచి తప్పించాలని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఈ కేసులో ప్రభుత్వానికి హైకోర్టు బ్రేకులు వేసింది. ఎన్ఐఏ నుంచి కేసును తప్పిం చాలని రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను శనివారం హైకోర్టు డిస్మిస్ చేసిం ది. దీంతో రాష్ట్ర ప్రభు త్వానికి ప్రత్య క్షంగా హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసును విచారణ చేపట్టిన ధర్మాసనం తక్షణమే అత్యవసరంగా విచారిం చాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో పాటు సిట్ అధికారులను తక్షణమే ఆయా ఫైల్స్ ఎన్ఐఏకు అప్పగించాలని న్యాయస్థానం ఆదేశించింది.



కీసర గుట్టలో పీవీ సింధు

కీసర, ప్రభన్యూస్ : రంగారెడ్డి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కీసర గుట్ట లో శ్రీరామలింగేశ్వ రస్వామి వారిని బ్యాడ్మి ంటన్ క్రీడాకారిని పీవీ సింధు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుట్టకు విచ్చేసిన సింధుకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సింధుకు అర్చకులు ఆశీర్వ చనం చేసి ప్రసాదాలు అందజేశారు.



స్మార్ట్ స్ట్రోక్!



అందుబాటులోకి ఆధునిక సాంకేతికత.. ఆదరిస్తున్న జనబాహుళ్యం

స్మార్ట్ ఫోన్... మందగమనంతో సాగిపోతున్న జనజీవితాన్ని ఒక్కసారిగా మార్చేసింది. ఇల్లు కదలకుండా.. సమయం వృథాకాకుండా అతివేగంగా పనులు చక్కబెట్టే వెసులుబాటు తెచ్చిపెట్టింది... ఆర్థిక వ్యవహారాల నుంచి.. వినోదం వరకూ అన్నీ మీటనొక్కి పూర్తిచేసే అద్భుత మంత్రదండంగా మారిపోయింది. దూరంగా ఉన్నవారిని క్షణాల్లో నేరుగా పలకరించే వెసులుబాటూ అందులోనే ఉంది...

నిజానికి స్మార్ట్‌గా జీవించడానికి అన్ని విధాలా పనికొచ్చే ఆ అపురూప సాధనం... ఇప్పుడు చాలామందిని స్మార్ట్‌గా దెబ్బకొడుతోంది. బయటకు కనిపించని రీతిలో జీవనశైలిని దెబ్బతీస్తోంది. ఈ పరిణామాలు చాలామందిని కలవరపెడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్, డిజిటల్ టెక్నాలజీ అందించిన అద్భుత సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న కొత్తతరం.. స్మార్ట్ మాయలో చిక్కుకుపోతున్నారు. అందులోంచి బయటపడలేక విలవిలలాడుతున్నారు.

స్మార్ట్ ఫోన్ మేనియాగురించి తెలిసినా... అందులోంచి బయటపడటం వారికి కష్టమవుతోంది. కంటినిండా నిద్ర, ఆప్యాయంగా పలకరింపు... కడుపునిండా తిండి, మెదడుకు పదునుపెట్టే ఆలోచనలకు అవకాశం లేకుండా చేస్తున్న ఈ స్మార్ట్ స్ట్రోక్‌పై ఈ వారం ప్రత్యేక కథనం...

శ్రీ....అంటూ తండ్రి కేక ..కొడుకు పట్టించుకోడు..కాదు కాదు అతనికి వినిపించదు..అతను స్మార్ట్ ప్రపంచంలో మునిగిపోయాడు.. ఏంజరిగిందా.. అని తండ్రి దగ్గర కెళ్లి చూస్తే.. చెవిలో ఇయర్ ఫోన్స్...స్మార్ట్ స్క్రీన్‌పై ర్యాప్ సాంగ్స్...డిగ్రీ చదివే కొడుకును మందలించలేక..ఇందూ అని కేకేస్తాడు...ఆవిడా పట్టించుకోదు.. వంటింట్లోకి వెళ్లి చూస్తే.. సోషల్ మీడి యాలో పోస్టులు పెట్టే పనిలో మునిగి తేలుతుంది....రోజంతా డ్యూటీ చేసి ఇంటికి తిరిగివచ్చిన వ్యక్తికి ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఎలా ఉంటుంది. చిర్రెత్తుకొస్తుంది. ఇక కొడుకు, భార్య స్మార్ట్‌ఫోన్ వాడుతూ తనను పట్టించుకోలేదని వాపోయిన భర్త...రిఫ్రెష్ అయిన తర్వాత టీవీ ఆన్ చేసి..తాను అదే పనిచేస్తుంటాడు. ప్రస్తుత సమాజంలో ఇలాంటి దృశ్యాలు దాదాపు ప్రతి ఇంటిలోను దర్శనమిస్తుంటాయి. దేశంలోని ప్రతి ముగ్గురిలో ఇద్దరు స్మార్ట్ టెక్నాలజీకి బానిసలే. ఫోన్ అనేది ఒకప్పుడు సమాచార సాధనం.. అంతేకాక స్మార్ట్‌ఫోన్ యుగం ప్రారంభమైన తర్వాత.. ఆన్‌లైన్ షాపింగ్,టికెట్ బుకింగ్, బిల్స్ పే, ఇలా చాలా వాటికి వాడుతున్నాం. అంతవరకు ఓకే. స్మార్ట్ వేదికగా ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల ప్రవేశం,లెక్కకు మిక్కిలి యాప్స్‌తో దాని లక్ష్యం గతితప్పుతోంది... పెడదోవపడుతోంది.....తనకు తెలియకుండానే బానిసలుగా మార్చేస్తోంది.

ఆ మాయలో మూడింట రెండు వంతులమంది

మన దేశంలో మూడింట రెండువంతుల మంది జీవితాల్లో డిజిటల్ వస్తువులు భాగమై పోయాయి. మూడింట రెండు వంతులు మంది.. తాము ఒక్క రోజు కూడా స్మార్ట్‌ఫోన్ వాడకుండా ఉండడం కష్టసాధ్యమని తేల్చేశారని అంతర్జాతీయ డిజిటల్ కంటెంట్ డెలివరీ ప్లాట్‌ఫామ్ లైమ్ లైట్ నెట్‌వర్క్... ది స్టేట్ ఆఫ్ డిజిటల్ లైఫ్ స్టైల్-2018 అనే అంశంపై ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలింది. డిజిటల్ వస్తువుల వాడకంలో మలేషియా ప్రథమ స్థానంలో, భారత్ ద్వితీయ స్థానంలో ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ఏతావాతా తేలిందేమిటంటే....ప్రస్తుతం మనిషి జీవితంలో డిజిటల్ వస్తువులు.. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లు ముఖ్య భాగమై పోవడం!

స్మార్ట్ ఫోన్లు దైనందిన జీవితాలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. దీని ప్రభావం వల్ల జీవితాలు తారుమారవుతున్నాయి కూడా! స్మార్ట్ ఫోన్‌కు ఇంటర్‌నెట్ అనుసంధానంతో .. అది చేతిలో లేకపోతే జీవితమే అంధకారం అన్న ఫీలింగ్ రోజురోజుకు యూత్‌లో పెరిగిపోతోంది. ఈ రెంటికి ఫేస్‌బుక్ ,వాట్సాప్,ఇన్‌స్టాగ్రామ్, అనేక రకాల యాప్స్ తోడుకావడంతో..స్మార్ట్ ఫోన్ చేతిలో ఉండే స్థాయి మారిపోయి...స్మార్ట్ ఫోన్ చేతిలో ప్రజలు బందీ అయిపోయారు.

కలవరపెడుతున్న స్మార్ట్ మేనియా

నిష్టూరంగా ఉన్నా నేటి యువతరం స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారిపోయారు. ఫోన్ లేకుండా క్షణం ఉండలేకపోతున్నారు. ఈ స్థితి మేధావులను, తల్లిదండ్రులను కలవరపెడుతోంది. పాఠశాలలు, కళాశాలలనుంచి ఇంటికి రాగానే బుక్స్ పక్కనపడేసి స్మార్ట్ ఫోన్‌లలో మునిగి తేలుతున్నారు. ఏ ఫ్రెండ్ ఏమిపోస్టు చేశాడు? తాను పెట్టిన పోస్టు ఎన్ని కామెట్లు, లైకులు వచ్చాయని లెక్కలు వేసుకుంటూ తిండిని సైతం మరిచిపోతున్నారు. చదువులకు దూరం అవుతున్నారు. తల్లిదండ్రులు మందలిస్తే క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. ఇటీవల గోవాకు చెందిన 17సంవత్సరాల యువతి తండ్రి స్మార్ట్ ఫోన్ కొనివ్వలేదని ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన తెలిసిందే. పెద్దల విషయానికి వస్తే...స్మార్ట్‌ఫోన్ల వల్ల ఉద్యోగ, వ్యక్తిగత జీవితం కలగాపులగంగా మారి పోతోంది. ఐటీ విస్తరించిన తర్వాత ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలకు, వ్యక్తిగత జీవితాలకు మధ్య విభజన రేఖ ఉండదు. కానీ ప్రభుత్వ సంస్థల్లో మాత్రం ఉద్యోగ సమయాల్లో వ్యక్తిగత జీవితాలు.. స్మార్ట్ ఫోన్ ద్వారా కొనసాగడంఆందో ళన కల్గించే అంశం.



-బొల్లేటి వెంకటేశ్వరా చారి, ఫీచర్స్

సమస్యల విశ్వరూపం... అప్రమత్తత అవసరం

స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీవల్ల పర్యావరణానికి పెద్దముప్పే జరుగుతోంది. అది పక్కనపెడితే మనజీవన విధానాలపై విపరీత ప్రభావం చూపిస్తోంది. పెద్దలు,యువకులు రాత్రిపగలు తేడా లేకుండా స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. దీంతో రాత్రి పూట ఫోన్ వాడకం, నిద్రరాగానే పక్కనే పెట్టుకుని పడుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇవన్నీ శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతున్నాయి. అందుకే స్మార్ట్ ముప్పుపై అవగాహన కల్పించడం ద్వారా సమాజాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్దలు మారాలి



స్మార్ట్‌ఫోన్లు అవసరం. అయితే వాటివాటకం శ్రుతి మించుతోంది. పరిమితి మేరకు వాడుకుంటే స్మార్ట్‌ఫోన్ ఎంతో ఉపయోగకరం. కానీ చాలామంది దానికి బానిసలుగా మారిపోతున్నారు. ఇది ఎన్నో అనర్థాలకు దారితీస్తోం ది. నేనైతే ఇంటికి వెళ్లిన తర్వాత సెల్‌ఫోన్ పక్కనపడేస్తా. అత్యవసరమైతేనే స్పందిస్తా. తల్లిదండ్రుల వైఖరినిబట్టే పిల్లల అలవాట్లు ఉంటాయి. స్మార్ట్‌ఫోన్ల వాడకంలో స్వీయ నియంత్రణ అవసరం. ఆ మాయలో పడిపోతే.. కుటుంబంలో ప్రేమానుబంధాలు దెబ్బతి ంటాయి. స్మార్ట్ ఫోన్ల వల్ల కలిగే లాభాలు... నష్టాలను పిల్లలకు విడమరచి చెప్పాలి.

- దాసరి హరిచందన
ఐఏఎస్ అధికారిణి

హద్దుల్లో ఉంటేనే ముద్దు

హద్దు మీరితే ఏదైనా అర్థాలు తెచ్చిపెడుతుంది. అందుకు స్మార్ట్‌ఫోన్లమినహాయింపు కాదు. మొదట టైం పాస్ కోసం స్మార్ట్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల వాడకం.. రాను రాను వ్యసనంగా మారుతోంది. చివరకు పనిచేసేందుకు టైం చిక్కని దుస్థితి దాపురిస్తోంది. అందుకే స్మార్ట్ ఫోన్ వాడకాన్ని ఎవరికివారు నియంత్రించుకోవాలి. అవసరానికి మించి స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవాలనే ధోరణి మొదలైంది.

సంగిరెడ్డి హనుమంతు రెడ్డి,
రిటైర్డ్ ఇంజనీర్, బీఎస్ఎన్ఎల్ (గుంటూరు)

అతితోనే తంటా

ఏడెనిమిది నెలలున్న పసికందు... బోసినవ్వులు చిందిస్తూ పకపకా నవ్వుతూంటే మనసు ఆనందపరవశమైపోయింది... అదే పిల్లాడు.. ఉన్నట్టుండి... గుక్కపెట్టి ఏడుపు లంకించుకుంటే... ఏమైందోనన్న దిగులు పిండేసింది... ఇంతలోనే ఆ పిల్లాడి చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టి ఆన్ చేస్తే... ఆ ఏడుపు తక్కున బందైపోయింది... ఈ దృశ్యం ఆ మధ్య సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అబ్బో మావాడు మామూలోడుకాదంటూ ఆ చిన్నారి తల్లిదండ్రులు మురిసిపోవచ్చుగానీ... చాలామంది స్మార్ట్ ఫోన్ మాయ ఎంతలా ప్రభావం చూపిస్తోందో తెలుసుకుని ముక్కున వేలేసుకున్నారు.. మరీ పెద్దవారైతే... కలికాలం బాబూ... అంటూ బుగ్గలు నొక్కుకున్నారు. ఇది స్మార్ట్ ఫోన్ల యుగం.. చిన్నపిల్లాడి నుంచి సీనియర్ సిటిజన్ వరకు అందరిచేతిలో స్మార్ట్ ఫోన్ ఉండితీరాల్సిందే. యువతరం ఉదయం లేచింది మొదలు..రాత్రి పడుకోబోయే వరకు ఫోన్‌తో మమేకం అయిపోతోంది.

జేఈఈ మెయిన్‌లో తెలంగాణ మెరికెలు

- నలుగురికి 100శాతం పర్సంటైల్
- పేపర్-1 ఫలితాలు ప్రకటించిన ఎన్‌టీఏ
- ఏప్రిల్‌లో మరోసారి మెయిన్స్ పరీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లోని బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించేజాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) మెయిన్ మొదటి విడత ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు సత్తా చాటారు. ప్రకటించిన ఫలితాల్లో రాష్ట్రా నికి చెందిన నలుగురు విద్యార్థులు 100 శాతం పర్సంటైల్ మార్కులను సాధించారు. దేశవ్యాప్తంగా మొత్తం 15 మంది విద్యార్థులు 100 శాతం పర్సంటైల్ సాధించారు. మొదటి విడత జేఈఈ మెయిన్ పరీక్షలు ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో విడత జేఈఈ మెయిన్ ఏప్రిల్ 6 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. మొదటి విడత జేఈఈ మెయిన్‌లోని పేపర్-1 పరీక్షఫలితాలను ప్రకటించారు. పేపర్-1 బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తారు. పేపర్-2 బీఆర్క్, బీఫార్మసీ కోసం నిర్వహిస్తారు. పేపర్-2 ఫలితాలను త్వరలోనే వెల్లడించనున్నారు. జేఈఈ మెయిన్ పేపర్-1కు దేశ వ్యాప్తంగా 9,29,198 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 8,74,469 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆడెల్లి సాయికిరణ్, ఎందుకూరి జయంత్ ఫణిసాయి, విశ్వనాథ్ కె, బట్టిపాటి కార్తికేయ నలుగురు విద్యార్థులు 100 శాతం పర్సంటైల్ సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొజ్జ చేతన్‌రెడ్డి కూడా 100 శాతం పర్సంటైల్ సాధించాడు. రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్షలకు సంబంధించి ఫిబ్రవరి 8 నుంచి మార్చి 7 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్షలను ఏప్రిల్ 6 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. రెండోసారి జరిగే మెయిన్ పరీక్షల తరువాత రెండు పరీక్షల్లో విద్యార్థికి వచ్చిన మార్కుల ఆధారంగా జేఈఈ మెయిన్ ర్యాంకులను ప్రకటిస్తారు.

15 మందికి.. 100 శాతం పర్సంటైల్

క్రమసంఖ్య	పేరు	రాష్ట్రం
1.	ధృవ్ అరోరా	మధ్యప్రదేశ్
2.	రాజ్ ఆర్యన్ అగర్వాల్	మహారాష్ట్ర
3.	ఆడేపల్లి సాయికిరణ్	తెలంగాణ
4.	ఎందుకూరి జయంత్‌ఫణి సాయి	తెలంగాణ
5.	విశ్వనాథ్ కె	తెలంగాణ
6.	బట్టిపాటి కార్తికేయ	తెలంగాణ
7.	బొజ్జ చేతన్‌రెడ్డి	ఆంధ్రప్రదేశ్
8.	సంబిత్ బెహెరా	రాజస్థాన్
9.	నమన్ గుప్తా	ఉత్తర్‌ప్రదేశ్
10.	హిమాన్షు గౌరవ్ సింగ్	ఉత్తర్‌ప్రదేశ్
11.	కెవిన్ మార్టిన్	కర్నాటక
12.	శుభాంకర్ గంభీర్	రాజస్థాన్
13.	అంకిత్ కుమార్ మిశ్రా	మహారాష్ట్ర
14.	జయేష్ సింగ్లా	పంజాబ్
15.	గుప్తా కార్తికేయ చంద్రేశ్	మహారాష్ట్ర

వజ్ర.. మేకిన్ ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

లార్సన్ దక్కించుకుంది. ఒప్పందంలో భాగంగా రక్షణరంగానికి అవసరమైన భవిష్యత్ తరం 100 కే9 వజ్ర - టీ యుద్ధట్యాంకులను 42 మాసాల్లో సరఫరా చేయనుంది. ప్రైవేటు రంగంలో ఇదే అతిపెద్ద రక్షణ ఒప్పందం. ఒక్కక్కొటి 155 ఎంఎం- 52 క్యాలిబర్ సామర్థ్యం కలిగివుంటాయి. స్వయం చోదక వ్యవస్థ కలిగివుండటం వీటిపత్యేకత. సూరత్‌కు 30 కిమీ దూరంలోని హజిరా ప్రాంతంలో ఎల్ అండ్ టీ ఈ ఆయుధ కర్మాగారాన్ని నిర్మించింది. హజిరాలోని మొత్తం 755 ఎకరాల విస్తీర్ణంలోని కర్మాగారంలో 40 ఎకరాల్లో కే9 వజ్ర యుద్ధట్యాంకులను ఎల్ అండ్ టీ నిర్మిస్తోంది. దక్షిణ కొరియాకు చెందిన హన్వా కార్పొరేషన్‌తో ఎల్‌అండ్ టీ సాంకేతిక బదలాయింపు ఒప్పందం కుదుర్చుకుంది. దీనిద్వారా భారత్‌లో పూర్తిస్థాయి అత్యాధునిక యుద్ధ ట్యాంకులు సాధ్యమని నిరూపితం అవుతుందని ఎల్‌అండ్‌టీ డిఫెన్స్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.



ప్రత్యేకతలు

గన్ సామర్థ్యం...

శాంసంగ్ మొబైల్ హౌవిట్జర్ తరహా సాంకేతికత కలిగిన దేశీయ యుద్ధట్యాంకు కే9 వజ్ర. కొండ ప్రాంతాల్లోనూ, పీఠభూముల్లోనూ తేలిగ్గా కదలగలదు. 155 ఎంఎం, 52 క్యాలిబర్ సామర్థ్యం కలిగిన హౌవిట్జర్ ఫిరంగి 40 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను విజయవంతంగా ఛేదించగలదు. ప్రధానంగా ఎడారి ప్రాంతాల్లో రక్షణకు పెట్టనిగోడగా నిలుస్తుంది.

కొరియా సహకారం..

ద.కొరియా సాంకేతిక సహకారంతో వీటిని ఎల్ అండ్ టీ అభివృద్ధి చేస్తుంది. ద.కొరియా నుంచి 10 హౌవిట్జర్లను దిగుమతి చేసుకుని, దేశీయంగా మిగతా వాటిని లార్సన్ సంస్థ నిర్మిస్తుంది. విడిభాగాలను చాలా వరకు దేశీయంగా తయారు చేసుకుంటుంది. ప్రధాన భాగాలనే కొరియా నుంచి దిగుమతి చేసుకుంటుంది. 2020 నాటికి ఒప్పందం ప్రకారం మొత్తం కే9 వజ్ర ట్యాంకులు సైన్యంలో చేరనున్నాయి. బోఫోర్స్ శతఘ్నులను ప్రవేశపెట్టిన 30 ఏళ్ల తర్వాత, ఆధునిక పూర్తిస్థాయి హౌవిట్జర్ల నిర్మాణం ఇదే.

కె 9



ప్రయోజనాలు...

పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో సరిసమానమైన ఫిరంగి వ్యవస్థల కొరత మన ఆర్మీలో ఉంది. లార్సన్ అండ్ టర్బో సంస్థ నిర్మిస్తున్న వజ్ర యుద్ధట్యాంక్ ఆధునిక సాంకేతికతతో క ూడినది. మైదాన ప్రాంతాల్లో గంటకు 60 కిమీ వేగంతోను, కొండ ప్రాంతాల్లో 25-30 కిమీ వేగంతో దూసుకెళ్లగలదు. యుద్ధక్షేత్రంలో వేర్వేరు స్థానాల్లో దీన్ని సమర్థవంతంగా వినియోగించవచ్చు. శత్రుస్థావరాలపై నిముషానికి ఎనిమిది రౌండ్లు ఫిరంగులను సంధించగలదు. ఏకబిగిన 450 కిమీ దూరం ప్రయాణించడం దీని ప్రత్యేకత.

మేకిన్ ఇండియా

దేశీయంగా ఈ యుద్ధట్యాంకును నిర్మిస్తున్నారు. తద్వారా వ్యవభారం తక్కువగా ఉండటంతోపాటు, ఉద్యోగ అవకాశకల్పనకు వీలు కలిగింది. ఒప్పందంలో భాగంగా 100 ట్యాంకులను ఎల్‌అండ్‌టీ నిర్మిస్తుంది. ఇది సక్సెస్ అయితే, ప్రపంచంలో అత్యాధునిక ఆయుధ వ్యవస్థను ముఖ్యంగా ప్రైవేటు రంగంలో తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేయగల సామర్థ్యం సాధించిన ఘనత మన దేశానికి లభిస్తుంది.

అదనపు ఆకర్షణలు


అతిపెద్ద రక్షణ ఒప్పందాన్ని దక్కించుకున్న ఘనత ఎల్ అండ్ టీకి దక్కింది. ఇది ఆ సంస్థకు పేరు ప్రతిష్టలు తెచ్చేదే. ఎందుకంటే అంతర్జాతీయ బిడ్డర్లతో పోటీపడి మరీ ఈ కాంట్రాక్టును సొంతం చేసుకోవడం మామూలు విషయం కాదు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహాలు ఏమీ ఇవ్వలేదు. పైగా అంతర్జాతీయ ప్రమాణాలతో యుద్ధ ట్యాంకులను నిర్మించడం సాహసమే.

దోపిడీదారులంతా జట్టుకట్టారు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నవారే.. రక్షిస్తామనడం హాస్యాస్పదం
- విపక్షాల ఐక్యతా ర్యాలీపై ప్రధాని మోడీ విమర్శలు

సిల్వస్స: విపక్షాల ఐక్యతా కూటమి (మహాకూటమి) మోడీకి వ్యతిరేకంగా కాదు..దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పడింది. ప్రజాధనాన్ని దోచుకోకుండా అడ్డుకుంటున్నందుకే నాపై వారికి ఆగ్రహం. అలాంటి వాళ్లంతా ఇప్పుడు ఏకమయ్యారు. ఒకేవేదికపైకి చేరుకున్నారు అంటూ విపక్షాల ర్యాలీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రవిమర్శలు చేశారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న వారే.. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని రక్షిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని మోడీ ఎద్దేవా చేశారు. , శనివారం దాద్రా, నగర్ హవేలి చేరుకున్న ప్రధాని అక్కడ వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోల్‌కతాలో జరిగిన విపక్షాల ఐక్యతా ర్యాలీపై ప్రధాని ఘాటుగా స్పందించారు. అక్కడ (కోల్‌కతాలో) భారతీయ జనతాపార్టీకి కేవలం ఒకే ఎమ్మెల్యే ఉన్నారు. అయినప్పటికీ వాళ్లు (తృణమూల్) గాభరా పడుతున్నారు. రక్షించండి రక్షించండి అంటూ గావుకేకలు పెడుతున్నారు. మహాకూటమి నాకు వ్యతిరేకంగా కాదు.. ఈ దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పాటవుతున్నది. అవినీతి నిర్మూలనకు నేను తీసుకుంటున్న చర్యలు కొందరికి ఆగ్రహం తెప్పిస్తున్నాయి. ప్రజాధనం దోచుకోకుండా నియంత్రిస్తున్నందుకే ఈ అక్కసు. భయం పోగొట్టుకునేందుకే వీళ్లంతా ఒక్కటవుతు న్నారని మోడీ ఎద్దేవా చేశారు.

విపక్షాలు ప్రసంగాలు, విమర్శలు తప్ప చేసిందేమీ లేదన్నారు. బెంగాల్‌లో రథయాత్రను అడ్డుకోవ డాన్ని ప్రస్తావిస్తూ, తృణమూల్ పాలిత రాష్ట్రం లో కేంద్ర పథకాలను కూడా అనుమతించే పరిస్థితి లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో మా పార్టీ కార్యకర్తలను దారుణంగా హతమార్చి న నాయకులు, ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. వీరి ప్రసంగాలను, నినాదా లను చూసి ప్రజలు వహ్ క్యా బాత్ హై అని నవ్వుకుంటున్నారని మోడీ విమర్శించారు.



ముంబైలో భారతీయ సినిమా జాతీయ మ్యూజయంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం పక్కన కూర్చున్న ప్రధాని మోడీ

సామాజిక పరివర్తనలో సినిమా కీలకం

ముంబై: ప్రజల ఆలోచలను ప్రభావితం చేస్తూ, సామాజిక పరివర్తనకు, దేశ అభివృద్ధికి సినిమా శక్తివంతమైన మాధ్యమంగా ప్రధాన భూమిక పోషిస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. శనివారం ఆయన ముంబైలో భారతీయ సినిమా జాతీయ మ్యూజయంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ సినిమా అభిమానులను పలకరిస్తూ, ఎలా ఉంది ఈ జోష్ అంటూ యూరి స్టయిల్లో ప్రశ్నించారు. సైనికుల సాహస పోరాటం ఇతివృత్తంగా నిర్మించిన యూరి సినిమా కొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా మనుషుల ఆలోచనా విధానంలో మార్పు తెస్తుంది. సినిమాలు, సమాజం పరస్పరం ఒకదానికొకటి ప్రతిబింబాలు. సమస్యలను సొంతంగా పరిష్కరించుకునే దిశగా దేశం పరివర్తన చెందుతోంది. నవ్య భారత్‌కు ఇది నాంది. లక్షల సంఖ్యలో సమస్యలుంటే.. కోట్ల సంఖ్యలో పరిష్కార మార్గాలు ఉంటున్నాయని ప్రధాని చెప్పారు. భావితరం పురోగతిని సినిమాలు ముందే చాటిచెబుతున్నాయి. విభిన్న భాషలు, విభిన్న యాసలు మాట్లాడే ప్ర జల్లో సమగ్రతకు సినిమాలు దోహదం చేస్తున్నాయి. సంస్కృతి వైవిధ్యానికి, పర్యాటకానికి బాటలు వేస్తూ ఉపాధి అవకాశాలను పెంపొందుతున్నాయని మోడీ భరోసా ఇచ్చారు.

₹ రుణ భారతం

82,03,253 కోట్లు

నాలుగున్నరేళ్లలో 50శాతం పెరుగుదల
స్టేటస్ పేపర్ విడుదల చేసిన ఆర్థికశాఖ

న్యూఢిల్లీ: నరేంద్ర మోడీ సారథ్యంలోని నాలుగున్నరేళ్ల ఎన్డీయే పాలనలో కేంద్ర ప్రభుత్వ అప్పులు 50 శాతం పెరిగాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రుణాలపై 8వ ఎడిషన్ స్టేటస్ పేపర్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 2018 నాటికి కేంద్రం అప్పులు రూ. 82, 03, 253 కోట్లకు చేరాయి. అదే సమయంలో ఎన్డీయే పాలన చివరినాటికి (2014) ఇది 54, 90, 763 కోట్లుగా ఉండేదని ఆర్థికశాఖ తాజాగా విడుదల చేసిన రుణ నివేదిక స్పష్టం చేస్తున్నది.

- ప్రభుత్వ అప్పుల పెరుగుదలలో పబ్లిక్ రుణాలు కీలకంగా ఉన్నాయి. ఇందులో 51.7శాతం పెరుగుదల చోటుచేసుకుంది. రూ. 48 లక్షల కోట్ల నుంచి రూ. 73 లక్షల కోట్లకు చేరాయి. అదే సమయంలో అంతర్గత రుణాలు 54శాతం పెరిగి రూ. 68 లక్షల కోట్లకు చేరాయి.
- మార్కెట్ రుణాల్లోనూ అనుపాత వృద్ధి కనిపించింది. 47.5 శాతం ఎగబాకి రూ. 52 లక్షల కోట్లకు చేరింది. 2014 నాటికి గోల్డ్ బాండ్స్ ద్వారా రుణాల సేకరణ జీరో స్థాయిలో ఉంది. ఇప్పుడది గోల్డ్ మోనటైజేషన్ స్కీమ్‌తో కలిసి రూ. 9089 కోట్ల ఉద్ద ఉంది.
- తాజా నివేదికలో కేంద్ర ప్రభుత్వ అప్పులకు సంబంధించిన వివరాలు పొందుపరచబడ్డాయి. 2010-11కు సంబంధించిన వార్షిక రుణాలపైనా స్టేటస్ పేపర్‌ను ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసింది. ఇందులో ద్రవ్యలోటు, ప్రభుత్వ ఆర్థికనిర్వహణ వివరాలు ఉన్నాయి.
- మొత్తంగా ప్రభుత్వ రుణాలు స్వల్పకాలానికి తగ్గుముఖం పడుతున్నట్లుగాను, ఒకింత అప్రమత్తంగాను ఉన్నట్లు నివేదిక వెల్లడిచేస్తోంది. ద్రవ్యలోటును అధిగమించేందుకు మార్కెట్ ఆధారిత రుణాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.
- రుణ పరిమితుల ప్రమాణాలకు అనుగుణంగానే అప్పుల స్థాయి ఉందని సదరు నివేదికలో ఆర్థికశాఖ పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు కొంత ఆశాజనకంగా ఉండొచ్చని, ఇది అప్పుల పెరుగుదలకు ఉపశమనం కలిగించే అంశంగా భావిస్తున్నారు.
- ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది మాసాలు అంటే నవంబర్ నాటికి ద్రవ్యలోటు 7.17 లక్షల కోట్ల లేదా పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యం (6.24 లక్షల కోట్లు)లో 114.8శాతంగా ఉండొచ్చన్నది ఆర్థికశాఖ అంచనాగా ఉంది.





కోల్‌కతాలో గర్జన

- మమత రాజ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా సింహనాదం • రోజులు దగ్గరపడ్డాయి • ఇక గడువు తీరిపోయింది • కోల్‌కతా బ్రిగేడ్ గ్రౌండ్‌లో మహా ప్రదర్శన • రెండో స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధం కావాలంటూ పిలుపు • తదుపరి ర్యాలీ అమరావతిలో.. ఆహ్వానం పలికిన చంద్రబాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ఎక్స్పైరీ డేట్ దగ్గరకొచ్చిందని విపక్షాలు విమర్శించాయి. కోల్‌కతా కేంద్రంగా ఏకతాటిపైకి వచ్చిన విపక్షాలు మోదీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టి సింహనాదం చేశాయి. శనివారం పశ్చిమ బెంగాల్ మరో మహా సంగ్రామానికి వేదికైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటైన విపక్షాలు రెండో స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా, తమ సత్తా చాటేందుకు ప్రతిపక్షాలన్నీ అస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. విపక్షాల బలమేంటో ప్రభుత్వానికి చూపే ప్రయత్నం చేశాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలో కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన యునైటెడ్ ఇండియా ర్యాలీకి వివిధ రాష్ట్రాల నుంచి ఎన్డీయే, మోడీని వ్యతిరేకించే నాయకులంతా



హాజరయ్యారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి దీదీ ఆహ్వానం మేరకు మొత్తం 20 పార్టీల అగ్ర నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం కుమార స్వామి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు నుంచి డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో పాటు జాతీయ నేతలు జమ్ము కాశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, మాజీ ప్రధాని దేవెగౌడ, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్, బీఎస్పీ నేత సతీష్ చంద్ర మిశ్రా, బీజేపీ రెబల్ శత్రుఘ్నసిన్హా, గుజరాత్ పాటీదార్ నేత హార్దిక్ పటేల్, హేమంత్ సోరెన్, అజిత్ సింగ్, ఒమర్ అబ్దుల్లా, ఆర్ఎల్డీ నేత జయంత్ చౌదరి తదితరులు హాజరయ్యారు. తాను ఈ మహా ర్యాలీకి హాజరు కాలేనని, పార్టీ తరపున సీనియర్ నేతలను పంపిస్తానని దీదీకి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్‌ను ఓడించడానికి పార్టీలన్నీ కలిసి రావాలని నేతలు పిలుపునిచ్చారు.

బీజేపీకి ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడింది: మమత

ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై నిప్పులు చెరిగారు. బీజేపీకి ఎక్స్‌పైరీ డైట్ దగ్గరకు వచ్చిందని, ఈసారి ఆ పార్టీ ఓటమి ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. బీజేపీ హయాంలో అచ్చే దిన్ రాకపోవడం వల్ల ప్రజలే కాక అన్ని పార్టీల నాయకులూ మోడీని గద్దె దింపాలని భావిస్తున్నారని ఆమె చెప్పుకొచ్చారు. వారి విభజించు, పాలించు సిద్ధాంతాన్ని ఎవరూ నమ్మడం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ ప్రధాని అభ్యర్థి ఎవరనేది తర్వాత నిర్ణయిస్తామని దీదీ స్పష్టం చేశారు.

రాష్ట్రాలను కాలరాస్తున్న కేంద్రం: చంద్రబాబు

బీజేపీ దేశాన్ని విభజించు పాలిస్తూ విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తుంటే విపక్ష పార్టీలైన తామ దేశాన్ని ఏకం చేయాలని చూస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పారు. కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను రాజకీయంగా మార్చేసిందని, నోట్ల రద్దే ఇందుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ కేంద్రం వేధింపు ధోరణిలో వ్యవహరిస్తోందని ఏపీ పట్ల కేంద్రం ధోరణిని ఆయన ఉదహరించారు. దేశాన్ని కాపాడాలి - ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే మిషన్‌తో బీజేపీయేతర పార్టీలన్నీ ర్యాలీకి హాజరై పోరాటం చేస్తున్నాయని చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్ణాటకలో బీజేపీ తన కుతంత్రాలను బయటపెడుతోందని ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి ఎమ్మెల్యేలను కొనేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

హిట్లర్ మోడీ: అరవింద్ కేజ్రీవాల్

ఆప్ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చారు. ఆయన దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనుకుంటున్నారని, 2019లో మాత్రం ఆయనను అధికారంలోకి రానివ్వకండని కేజ్రీవాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే 2050 వరకూ కూడా ఎవరూ తమ పార్టీని ఓడించలేరని అమిత్ షా మాట్లాడుతున్నారని, 2019 ఎన్నికలు మోడీ - షా ద్వయాన్ని తరిమి కొట్టే ఎన్నికలు కావాలని ఆయన ఆకాంక్షించారు. వారిని తరిమి కొడితే దేశానికి మంచి రోజులు వస్తాయని కేజ్రీవాల్ విమర్శించారు.

ప్రధాని ఓటమే ఏకైక లక్ష్యం: స్టాలిన్

రాబోయే ఎన్నికలు దేశానికి స్వాతంత్ర్య పోరాటం వంటివని స్టాలిన్ అభివర్ణించారు. బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్యం ఉద్యమమని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఓడించడమే విపక్షాల ముందున్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. బీజేపీ, మోడీ నుంచి ప్రజలను కాపాడగల శక్తి విపక్షాలకే ఉందన్నారు. ప్రధానమంత్రి వంటి అత్యున్నత స్థానంలో ఉండి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కులాలు, మతాలను రెచ్చగొడుతు జనం మధ్య చిచ్చు పెడుతున్నారని స్టాలిన్ మండిపడ్డారు.

ప్రాంతీయ పార్టీలతోనే రక్షణ: కుమారస్వామి

మొదట బెంగాలీలో మాట్లాడిన కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమార స్వామి అనంతరం ఇంగ్లీష్‌లో ప్రసంగించారు. ప్రాంతీయ పార్టీలే రాష్ట్రాల హక్కులు కాపాడగలవని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. తామందరం కలిసి బీజేపీని ఓడిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలు స్థిరంగా ఉంటాయా అని పదే పదే బీజేపీ అంటోందని, కానీ దేశాన్ని అభివృద్ధి చేసేది సంకీర్ణ ప్రభుత్వాలేనని దేవెగౌడ అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలకు బాధ్యత ఎక్కువ ఉంటుందని, అందరి భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, సమస్యలకు పరిష్కారం సూచించగలుగుతారని చెప్పుకొచ్చారు. బీజేపీ రెబల్ ఎంపీ శతృఘ్ను సిన్హా ప్రసంగిస్తున్నప్పుడు సభికుల నుంచి విశేష స్పందన లభించింది. చప్పట్లు కొడుతూ తమ స్పందనను తెలియజేశారు. మోడీ సర్కార్ నిర్ణయాలు తుగ్లక్ నిర్ణయాలని ఆయన విమర్శించారు. నోట్ల రద్దు విషయం తనకే కాదు కనీసం ఆర్థిక మంత్రికి కూడా తెలియదని, ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో వ్యవస్థ అతలాకుతలమైందని మండిపడ్డారు. దాని వల్ల అత్యధికంగా ఇబ్బంది పడింది పేద, మధ్యతరగతి వర్గాలేనని అన్నారు. మమతా బెనర్జీ బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తోందని ఆయన కొనియాడారు. బెంగాల్ నుంచి ఏం సందేశం వస్తుందోనని దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందని అఖిలేష్ యాదవ్ అన్నారు.

వచ్చే ర్యాలీ అమరావతిలో..

దీదీ కోల్‌కత్తాలో నిర్వహించిన మహా ర్యాలీ విజయవంతం కావడంతో విపక్ష నేతలు రెట్టించి ఉత్సాహంతో ఉన్నారు. ఆడసింహం అంటూ మమతా బెనర్జీకి ప్రశంసల జల్లు కురిపించింది. ఆమె చొరవ తీసుకుని ర్యాలీ నిర్వహించి మోడీకి సవాల్ విసిరారని కొనియాడారు. ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగించడానికి ఈ తరహా బల ప్రదర్శన, విపక్షాల ఐక్యతా సభలను అన్ని రాష్ట్రాల్లోనూ నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు అందరు నేతలు సమ్మతి తెలిపారు. ముందుగా వచ్చే పోరాట ర్యాలీని అమరావతిలో నిర్వహిద్దామని చంద్రబాబు అన్నారు. నేతలందరికీ ఆహ్వానం పలికారు. ముఖ్యంగా యువ నేతలు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల్లో ఆసక్తి రేపేలా ప్రసంగించారు.

అసెంబ్లీ సమావేశాల వల్లే కోల్‌కతాకు దూరం



రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాల్లో బిజీగా ఉన్న కారణంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ కోల్‌కతాలో జరి గిన విపక్షర్యాలీకి హాజరు కాలేకపోయారని టీఆర్ ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత శనివారం పేర్కొన్నారు. తాము బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తున్నామని, భవిష్యత్తులో ఈరెండింటికి వ్యతిరేకంగా జరిగే భారీ ర్యాలీలలో పాల్గొంటామన్నారు.



దీదీ 42 ఫార్ములా

పశ్చిమ బెంగాల్‌లో పాగా వేసేందుకు బీజేపీ వేస్తున్న ఎత్తులను చిత్తు చేసేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. రాష్ట్రంలోని 42 పార్లమెంట్ స్థానాల్లో అన్నింటినీ క్లీన్ స్వీప్ చేసేలా మమత వ్యూహాలు రచిస్తున్నారు. ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలే ప్రధాన ప్రచారాస్త్రాలు జనంలోకి వెళ్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 42 స్థానాలకు 34 స్థానాలను కైవశం చేసుకున్న టీఎంసీ ఈ సారి మిగిలిన ఆరు స్థానాలను కూడా ఇతర రాజకీయ పార్టీలకు వదలొద్ద న్న నిర్ణయంతో దూసుకెళ్తోంది. ఎన్నికలకు ఇంకా నాలుగు నెలలు మిగిలి ఉండగానే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారాన్ని మొదలుపెట్టి న తృణమూల్ కాంగ్రెస్ .. పెద్దపెద్ద హోర్డింగ్‌లతో హోరెత్తిస్తోంది.

దుర్గాదేవీ రూపంలో వెలసిన మమత ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ర్యాలీలకు సంబంధించిన అంశాలతో పాటు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లే విషయాలను ప్రముఖంగా కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దుర్గాదేవి అవతారంలో ఉన్న మమతా బెనర్జీ ఫ్లెక్సీలో 10 చేతుల్లో వివిధ రకాల అంశాలను తెలియజేసే బోర్డులను కలిగిఉన్నాయి. ఎడమవైపు ఉన్న 5 చేతుల్లో దుర్గాదేవి ఐదు ఆయుధాల రూపంలో కన్యశ్రీ, శిక్యశ్రీ, షాబుజ్ శక్తి, శిశు శక్తి, గతిధార పేర్లతో ఉండగా.. కుడివైపు ఉన్న ఐదు చేతుల్లో యువశ్రీ, రూపశ్రీ, గీతాంజలి, ఖాద్య శక్తి, మన బిక్ అనే పేర్లతో ఉన్నాయి. దుర్గాదేవీ పది చేతుల్లో కనిపించేవన్నీ మమతా బెనర్జీ తన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాల పేర్లు. ఈ పథకాలనే ప్రచారాస్త్రాలుగా వాడుకుని ప్రజల్లోకి వెళ్లాలనే సంకేతా లను కేడర్‌కు తెలియజేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసిన ఈ ఫొటోలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. నదియా జిల్లాలోని చక్‌ఢా ప్రాంతంలో ఏర్పాటు చేసిన మమత పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. దేశ రాజధాని న్యూఢిల్లీ లోని ఇండియా గేట్ వద్ద మమత చేతులు కట్టుకుని నిలబడ్డట్లుగా ఉన్న ఈ ఫ్లెక్సీ.. ఇప్పుడే ఢిల్లీకి వెళ్దాం. అనే నినాదంతో ఉంది.

కన్యశ్రీ: ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు చెందిన 18 ఏళ్లలోపు బాలికలకు ప్రభుత్వం ఆర్థిక సాయం

శిక్షశ్రీ: 5-8 తరగుతల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్

సబూజ్ శక్తి, 9-12 తరగతుల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

శిశు శక్తి: మమత ప్రభుత్వ ప్రతిష్టాత్మక హెల్త్ కేర్ పథకం. ప్రతీ సంవత్సరం 3 వేల మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్.

గతిధార: నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం. వాణిజ్యవాహనాల కొనుగోలులో రుణాలు అందజేత.

రూప శ్రీ: పీడిత వర్గాల్లో 18 ఏళ్లు నిండిన బాలికల పెళ్లికి ఏకకాలంలో రూ.25 వేల ఆర్థిక సాయం.

గీతాంజలి: ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికీ సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వ సాయం.

ఖాద్యశక్తి: పేదలకు రూ. 2 కే కిలో బియ్యం, గోధుమలు అందజేత

మనబిక్: దివ్యాంగులకు చేయుతనందించే పథకం.



• ఆయిల్ పైప్‌లైన్ లీక్.. 66 మంది మృతి

మెక్సికో: మెక్సికోలో ఘోర ప్రమాదం సంభవించింది. ఆయిల్ పైప్‌లైన్ పేలి 66మంది సజీవదహనమయ్యారు. మెక్సికో సిటీలోని త్లాహులిల్‌పాన్ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలోని పెట్రో దొంగలు ఆయిల్ పైప్‌లైన్‌ను పగులగొట్టారు. పైప్‌లైన్ లీక్ అవుతుందన్న సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు ఆయిల్ తెచ్చుకొనేందుకు అక్కడకు వెళ్లారు. బక్కెట్లు, క్యాన్లలో ఆయిల్ నింపుకొన్నారు. అయితే ఇంతలోనే దురదృష్టవశాత్తూ పైప్‌లైన్ పేలడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 66మంది అక్కడికక్కడే సజీవదహనమవగా 76మంది గాయాలపాలయ్యారు. సమాచారం అందుకొన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులు కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని హిడాల్గో స్టేట్ గవర్నర్ ఒమర్ ఫయద్ తెలిపారు. మెక్సికోలో ఆయిల్ ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉంటాయి. ఘటన జరిగిన ప్రాంతంలో కూడా ఆయిల్ దొంగిలించేందుకు దొంగలు పైప్‌లైన్ పగులగొట్టినట్లు అధికారులకు ముందుగానే తెలుసునని, దాన్ని సరిచేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకొందని స్థానిక మీడియా పేర్కొంది.

• జకీర్ నాయక్ ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ: వివాదాస్పద ఇస్లాం మత బోధకుడు జకీర్ నాయక్ ఆస్తులుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. మనీలాండరింగ్ కేసు దర్యాప్తు లో భాగంగా ఈడీ శనివారం జకీర్ నాయక్ రూ.16.40కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (పీఎం ఎల్ఏ) ప్రకారం ముంబై, పుణెలోని నాయక్ కుటుంబ సభ్యుల పేరుతోఉన్న ఆయన ఆస్తులు జప్తు చేసేందుకు ప్రొవిజినల్ ఆర్డర్ జారీ చేశామని ఈడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జప్తు చేసిన స్థిరాస్తుల విలువ రూ.16.40 కోట్లు ఉంటుందని ఈడీ అధికారులు తెలిపారు. తాజాగా ఈడీ జప్తు చేసిన ఆస్తుల వివరాలపై ఈడీ అధికారులు మాట్లాడుతూ ముంబైలోని భండూప్ ఏరియాలోని ఫాతీమా హైట్స్, అఫియా హైట్స్‌లో ఉన్న భవనాలు, పుణెలోని ఎన్‌గ్రేసియా ప్రాజెక్ట్ పేరుతో ఉన్న ఆస్తులు జప్తుచేశామని తెలిపారు.

• మనీలాండరింగ్ కేసులో వాద్రాకు ఊరట

న్యూఢిల్లీ: యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు మరోసారి ఢిల్లీ కోర్టు ఊరటనిచ్చింది. మనోజ్ ఆరోరాకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను ఫిబ్రవరి 6వ తేదీవరకు న్యాయస్థానం పొడిగించింది. తొలుత ప్రత్యేక న్యాయమూర్తి అరవింద్ కుమార్‌తో ఈడీ విచారణకు ఆరోరా సహకరిస్తున్నా రని తెలిపింది. ఈడీ తరపున వాదించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ సింగ్ మాట్లాడుతూ ఆరోరా విచారణకు శుక్రవారం హాజరయ్యారని తెలిపారు. ఇంత వర కూ ఆయన ఈడీ అధికారులకు సహకరించారని తెలిపారు. అనంతరం ఈడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రానా తమ వాదనకు రెండు వారాలుకుపైగా గడువు ఇవ్వాలిసిందిగా కోరారు. కాగా లండన్‌లోని బ్రయాన్‌స్టోన్ స్క్వేర్‌లో ఆస్తులు కొనుగోలులో మనీలాండరింగ్ జరిగిందని దీనికి వాద్రాకు సంబంధం ఉందని ఈడీ ఆరోపించింది.

రిసార్ట్ పాలిటిక్స్

- కర్నాటకలో మళ్లీ క్యాంపు రాజకీయాలు • బీజేపీ ఆకర్ష్ భయంతో రిసార్ట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు • ఎప్పటికప్పుడు గండంలో సంకీర్ణ ప్రభుత్వం
- ప్రభుత్వాన్ని పడగొట్టబోమన్న యెడ్డీ

బెంగళూరు: కర్నాటకలో రిసార్ట్ రాజకీయాలు మరోసారి రక్తికట్టాయి. కర్నాటకలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీజేపీ వేస్తున్న ఎత్తులతో జేడీఎస్- కాంగ్రెస్ పార్టీలకు అంతుచిక్కడం లేదు. తమ బల ప్రదర్శనను నిరూపించేందుకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ భేటీ నిర్వహించగా... నలుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం.. బీజేపీయే తమ ఎమ్మెల్యేలను హర్యానాలోని ఫైవ్ స్టార్ హోటల్‌లో అక్రమంగా నిర్బంధించిందని ఆరోపించడంతో కర్నాటకలో క్యాంప్ రాజకీయాల వేడి రాజుకుంది. ఇక సీఎల్పీ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేలందరినీ ప్రత్యేక బస్సుల్లో ఎక్కించి తీసుకెళ్లడంతో కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేలు చేజారుతారన్న భయం పట్టుకుందన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీ ఆకర్ష మంత్రానికి తమ ఎమ్మెల్యేలు ఎక్కడ లొంగిపోతారోనన్న బెంగ కాంగ్రెస్ పార్టీని పట్టిపీడిస్తోంది.

ఈ నేపథ్యంలోనే బిడది లోని ఈగల్టన్ రిసార్ట్ (బెంగళూరు- మైసూరు రహదారిలోని)కు తరలించారు. తమకు 75 రూంలు కావాలని కాంగ్రెస్ కోరినప్పటికీ.. 38 రూంలే అందుబాటులో ఉన్నాయని రిసార్ట్ యాజమాన్యం వెల్లడించింది. అయినప్పటికీ ఉన్న రూంలలోనే సర్దుకుపోవాలన్న నిర్ణయానికి కాంగ్రెస్ నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. బీజేపీ పాచికలకు తమ ఎమ్మెల్యేలు ఎక్కడ ఆకర్షితులౌతారో.. ఎప్పుడు సంకీర్ణ ప్రభుత్వానికి గండం వస్తుందోనన్న భయం కాంగ్రెస్‌కు పట్టుకుంది.





ఆందోళనపడకండి..

కర్నాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం బీజేపీకి లేదని కర్నాటక మాజీ సీఎం యడ్యూరప్ప స్పష్టం చేశారు. తమ బలాన్ని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ సమావేశాన్ని నిర్వహించిన నేపథ్యంలో యడ్యూరప్ప స్పందిస్తూ.. మా ఎమ్మెల్యేలు ఢిల్లీ నుంచి బెంగళూరు వస్తున్నారు. కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తాం. ప్రభుత్వాన్ని డిస్టర్బ్ చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. కాంగ్రెస్ - జేడీఎస్ పార్టీలు ఆందోళన చెందొద్దు. అంటూ యడ్యూరప్ప చురకలంటించారు. శుక్రవారం సీఎల్పీ సమావేశానికి డుమ్మాకొట్టిన నలుగురు ఎమ్మెల్యేలలో ఇటీవలే మంత్రి పదవి కోల్పోయిన రమేష్ జార్కిహోలి కూడా ఉన్నారు. మిగతా ముగ్గురు బి.నరేంద్ర, ఉమేష్ జాధవ్, మహేష్ కుమతహల్లి.

ఎమ్మెల్యేలున్న రిసార్ట్‌కు రూ.982 కోట్ల ఫైన్

కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉంచిన ఈగల్టన్ రిసార్టు నిర్మాణం ఆక్రమణ స్థలంలో నిర్మించారని ప్రభుత్వం రూ.998 కోట్ల జరిమానా విధించింది. అలాంటి రిసార్ట్‌లో ఎమ్మెల్యేలను ఉంచడం శోచనీయమని బీజేపీ ఆరోపించింది. రిసార్టు చెల్లించాల్సిన డబ్బును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చేటప్పుడు తీసుకురావాలని చురకలంచింది. కనీసం ఆ డబ్బుతోనైనా సంకీర్ణ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేస్తే బాగుంటుందని బీజేపీ విమర్శించింది.

మూడు దశాబ్దాలకు పైగా రిసార్ట్ రాజకీయాలు


రిసార్ట్ రాజకీయాల హబ్‌గా పేరున్న కర్నాటక చుట్టుపక్కల రాష్ట్రాల నేతల విడిదికి కూడా వేదికౌతోంది. 1980 దశకం చివర నుంచే ఇలాంటి రాజకీయాలు నడుస్తున్నాయి. ఎన్నికైన ఎమ్మెల్యేలు ఏదైనా సందర్భంగా ఓటింగ్ వేయాల్సి వస్తే వారిని రిసార్టులకు తరలించడం ఆనవాయితీగా వస్తోంది. 1984 లో ఏపీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన ప్రభుత్వ విశ్వాస పరీక్ష సందర్భంగా ఎమ్మెల్యేలందరినీ బెంగళూరులోని రిసార్టులకు తరలించారు. 2002లో మహారాష్ట్ర సీఎం విలాస్ రావ్ దేశ్‌ముఖ్ కూడా విశ్వాస పరీక్ష సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని రిసార్టుల్లో ఉంచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా ఇలాంటి సీన్ కర్నాటకలో రిపీటైంది.

ప్రయాణంలో వాంతి.. తల బయటపెడితే తెగిపడింది



భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోరం జరిగింది. సత్నా నుంచి పన్నా జిల్లాకు బస్సులో బయలుదేరిన ఆశారాణి(56) అనే మహిళకు మార్గమధ్యంలో కడుపులో తిప్పినట్లు అనిపించడంతో వాంతి చేసుకొనేందుకు కిటికీలోనుంచి తల బయటకు పెట్టింది. దీంతో ఆమె తల విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తల తెగిపడింది. బస్సు వేగంగా వెళ్తుండటమే ఇందుకు కారణమని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటనతో బస్సులోని తోటి ప్రయాణికులందరూ తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతురాలు ఛాటాపూర్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోస్ట్ మార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉత్తరాఖండ్‌లో వింత ఆచారం



డెహ్రాడూన్: శాస్త్ర శాంకేతిక రంగాల్లో ముందున్నా, అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నా, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నప్పటికీ మహిళలను ఆచారాల పేరుతో వెనక్కులాగే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరఖాండ్‌లో మహిళల పట్ల కొనసాగుతున్న ఓ వింత ఆచారం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. చంపావట్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో రుతుస్రావం సమయంలో మహిళలు ఇంటి నుంచి దూరంగా ఉండాలనే ఆచారం కొనసాగుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇక జిల్లాలోని మారుమూల గ్రామం గుర్చామ్‌లోనైతే మహిళలు రుతుస్రావం సమయంలో ఇళ్లల్లో ఉండకూడదంటూ గ్రామ పంచాయితీ తీర్మానం చేసింది. వారి కోసం ప్రత్యేకంగా ఊరి చివర్లో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ నిధులతోనే ఈ భవనాన్ని నిర్మించడం గమనార్హం. వెలుగులోకి వచ్చిన ఈ వింత ఆచారంపై ఉత్తరాఖండ్ శిశు సంక్షేమశాఖ మంత్రి రేఖా ఆర్య విచారం వ్యక్తం చేసింది. వెంటనే ఈ కేంద్రాన్ని మూసివేయాలంటూ ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు.




రోజర్ ఫెదరర్‌తో కోహ్లీ దంపతులు

మెల్‌బోర్న్: భారత్‌కు రెండు చారిత్రాత్మక విజయాలను అందించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటన ముగింపు సందర్భంలో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌ను కలిసి అందరిని సంభ్రమాశ్చార్యాల్లో ముంచెత్తాడు. ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ పోటీలు సాగుతున్న రాడ్ లావెర్ ఎరీనాలో శనివారం కోహ్లీ, తన భార్య అనుష్క శర్మతో కలిసి స్పెక్టేటర్ గ్యాలరీలో కూర్చుని మాజీ చాంపియన్ నొవాక్ జకోవిచ్, డెన్నిస్ షపావలొవ్ మధ్య జరిగిన మ్యాచ్‌ను తిలకించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ విజయం సాధించి నాలుగో రౌండ్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో సెరీనా విలియమ్స్ కూడా తన మూడో రౌండ్ మ్యాచ్‌ను గెలిచి నాలుగో రౌండ్లోకి ప్రవేశించింది. కోహ్లీ దంపతులు రోజర్ ఫెదరర్‌తో కలిసి దిగిన ఫొటోను సామాజిక మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది వైరల్‌గా మారింది. 'ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికగా నా టూర్ ముగిసింది. ఆస్ట్రేలియన్ వేసవిని అద్భుతంగా ముగించాము' అని కోహ్లీ ట్వీట్ చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ అధికారిక ట్విట్టర్ ఖాతాలో కూడా ఈ ముగ్గురి ఫొటోను పెట్టింది. క్యాప్షన్‌గా 'ఒకే చిత్రంలో ముగ్గురు దిగ్గజాలు' అని పేర్కొంది. డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ శుక్రవారం జరిగిన పోరులో ఫెదరర్ యూఎస్‌కు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించి ఇప్పటికే రౌండ్ 16లోకి చేరాడు. ఆస్ట్రేలియాతో శుక్రవారంతో ముగిసిన వన్డే సిరీస్‌లో కోహ్లీసేన 2-1తో గెలిచి తొలిసారిగా ఆసీస్ గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలిచిన జట్టుగా నిలిచింది. అంతేకాక, ఈటూర్‌లో అపజయంలేకుండా పర్యటన ముగించిన తొలి జట్టుగా కూడా ఘనతను సాధించింది. టెస్ట్ సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న భారత్, టీ20 సిరీస్‌ను 1-1తో డ్రా చేసింది.

రంజీ ట్రోఫీ పోటీలు చరమాంకానికి చేరుకున్నాయి. నేటితో క్వార్టర్ ఫైనల్ పోటీలు ముగిశాయి. సెమీ ఫైనల్స్‌కు చేరిన జట్లలో సౌరాష్ట్ర, విదర్భ, కర్నాటక, కేరళలున్నాయి. 24వ తేదీ నుంచి సెమీఫైనల్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఒక సెమీఫైనల్లో విదర్భ జట్టు కేరళతో తలపడనుండగా, మరో సెమీ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు కర్నాటకను ఢీ కొననుంది.

రంజీ సెమీ ఫైనల్లో సౌరాష్ట్ర, విదర్భ

హార్విక్ దేసాయ్ కెరియర్ తొలి సెంచరీ



లక్నో: రంజీ ట్రోఫీ పోటీలు చివరి అంకానికి చేరుకున్నాయి. సెమీ ఫైనల్లో ఏయే జట్లు తలపడనున్నాయో తేలింది. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు ఉత్తర్‌ప్రదేశ్ జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించగా, మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ జట్టు ఉత్తరాఖండ్‌ను ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో ఓడించి సెమీఫైనల్లోకి చేరాయి. రంజీ ట్రోఫీ చరిత్రలో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఘనతను సౌరాష్ట్ర సాధించింది. సౌరాష్ట్ర ఓపెనర్ హార్విక్ దేసాయ్ ఫస్ట్ క్లాస్ క్రికెట్లో తన తొలి సెంచరీ సాధించాడు. స్నెల్ పటేల్ 72 పరుగులు, చటేశ్వర్ పుజారా 67 నాటౌట్, షెల్డన్ జాక్సన్ 73 నాటౌట్‌లు కలిసి 372 పరగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్లు కోల్పోయి 115.1 ఓవర్లలో ఛేదించారు. 2008-09 సీజన్‌లో అస్సాం సాధించిన 371 పరుగుల ఛేదన రికార్డును సౌరాష్ట్ర అధిగమించింది. సెమీ ఫైనల్లో సౌరాష్ట్ర, కర్నాటకతో తలపడనుండగా, విదర్భ జట్టు కేరళను ఢీకొననుంది. శనివారం ఐదోరోజు ఓవర్ నైట్ స్కోరు 195/2తో సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ దేసాయ్, కమలేష్ మక్వానాలు జోడీ ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. కమలేష్ 7 పరుగులు చేసి ఔట్ కావడంతో పుజారా క్రీజులోకి వచ్చాడు. వీరిద్దరు కలిసి దూకుడుగా ఆడుతూ స్కోరును ముందుకుపోనిచ్చారు. జట్టు స్కోరు 236 వద్ద దేసాయ్ 116 (259బం తులు, 16 ఫోర్లు) ఔట్ కావడంతో షెల్డన్ జాక్సన్ వచ్చి పుజరాతో జతకలిశాడు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా మిగతా పరుగులను సాధించి తమ జట్టుకు విజయాన్ని అందించారు. యూపీ తొలి ఇన్నింగ్స్‌లో రింకు సింగ్ కూడా 150 పరుగులు(181 బంతులు, 19ఫోర్లు) చేసి మెరిశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు హార్విక్ దేసాయ్‌కు దక్కింది.

నాలుగు పరుగులకే ఐదు వికెట్లు

నాగ్‌పూర్‌లో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో విదర్భ జట్టు చేతిలో ఉత్తరాఖండ్ ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐదోరోజు 152-5తో తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఉత్తరాఖండ్ కేవలం 4 పరుగులకే మిగతా ఐదు వికెట్లను కోల్పోయి ఓటమి పాలైంది. విదర్భ బౌలర్లలో ఉమేష్ యాదవ్ 23 పరుగులకు 5 వికెట్లు తీయగా, స్పిన్నర్ ఆధిత్య సర్వ్వటె 55 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి ఉత్తరాఖండ్ ఓటమిని శాసించారు. తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఉమేష్ యాదవ్ 90 పరుగులకు 4 వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును ఉమేష్ దక్కించుకున్నాడు.



క్రీడాప్రభ

ఇండియా ఎ జట్టులో పంత్

ఇంగ్లండ్ లయన్స్‌తో 5 వన్డేల సిరీస్



న్యూఢిల్లీ: వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ ఇండియా ఎ జట్టు తరపున ఇంగ్లండ్ లయన్స్‌తో 23న ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో తొలి మూడు వన్డేల్లో బరిలోకి దిగనుండగా, అజింక్య రహానే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. శనివారం, బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడే ఐదు వన్డేలకోసం ఇండియా ఎ జట్టును ప్రకటించింది. మిగతా రెండు వన్డేలకు మహారాష్ట్ర బ్యాట్స్‌మన్ అంకిత్ బావ్‌నే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ వన్డే సిరీస్ తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగను ంది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌కు ఎంపిక కాని పంత్.. టెస్ట్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుని ప్రపంచకప్‌లో పాల్గొనే జట్టులో బెర్త్‌కోసం పోటీలో ఉన్నాడు.

నాలుగో రౌండ్లో సెరెనా, హాలెప్

పురుషుల్లో జకోవిచ్, జెవెరెవ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో దిగ్గజ ఆటగాళ్లు ముందుకు సాగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో సెర్బియా స్టార్ నవొమి జకోవిచ్, మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ సిమోనా హలెప్, అమెరికన్ స్టార్ సెరెనా విలియమ్స్, నాలుగో రౌండ్లోకి ప్రవేశించారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ 6-3, 6-4, 4-6, 6-0 తేడాతో కెనడాకు చెందిన డెనిస్ షపావలోవ్‌ను ఓడించాడు. ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలవాలనుకుంటున్న జకోవిచ్ తొలి రెండు సెట్లలో తేలికగా గెలిచాడు. మూడో సెట్లో 3-0తో లీడ్‌లో ఉన్నప్పటికి.. డెనిస్ పుంజుకుని ర్యాలీగా సాగుతూ.. విజయం సాధించాడు. మూడో సెట్లో ఓటమికి వెలుగు ఉన్నప్పటికి.. ఫ్లడ్ లైట్లు వెలిగించటమేకారణమని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఫ్రెంచ్ అంపైర్ డేమియన్ డుమొసిస్‌తో వాగ్వాదానికి కూడా దిగాడు. సాయంత్రం 5 గంటలకే లైట్లు వేయడం తెలివిలేని చర్య. మరో నాలుగు గంటలు సూర్యకాంతి ఉంటుందని పేర్కొన్నాడు. నాలుగో సెట్లో పుంజుకున్న జకోవిచ్ పూర్తి ఆధిక్యాన్ని చాటుతూ.. 6-0తో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకు న్నాడు. నాలుగో రౌండ్లో జకోవిచ్ రష్యాకు చెందిన యువ ఆటగాడు డి మెద్వె దెవ్‌తో తలపడను న్నాడు.

తొలిసారిగా... జెవెరెవ్

తన తొలి గ్రాండ్‌స్లామ్ సాధించేందుకు ఉవ్విళ్లూరుతున్న జర్మన్ యువ కిశోరం 21 ఏళ్ల అలెగ్జాండర్ జెవెరెవ్(జెజ్) దాదా పు రెండు గంటలపాటు పోరాడి వైల్డ్ కార్డ్ ఎంట్రీ పొందిన ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ బోల్ట్‌ను 6-3,6-3, 6-2తో ఓడించి నాలుగో రౌండ్లోకి చేరుకున్నాడు. పొడగరి జెవెరెవ్ గంటకు 220 కిలోమీటర్ల వేగంతో చేసిన సర్వీస్‌లను నిలువరించడంలో బోల్ట్ విఫలమయ్యాడు. క్వార్టర్ ఫైనల్‌కు చేరేందుకు జెవెరెవ్ సోమవారం వరల్డ్ నెంబర్ 3 మిలోస్ రావోనిక్‌తో తలపడనున్నాడు.

సెరెనా, హాలెప్ ముందంజ

మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ సిమోనా హలెప్ అమెరికాకు చెందిన వీనస్ విలియమ్స్‌ను 6-2, 6-3 తేడాతో ఓడించి తర్వాతి రౌండ్లో ఆమె సోదరి సెరెనా విలియమ్స్‌తో పోటీకి సిద్ధమైంది. సెరెనా శనివారం జరిగిన మూడో రౌండ్లో ఉక్రెయిన్‌కు చెందిన డయానా యస్ట్రెమ్‌స్కాను 6-2, 6-1 తేడాతో ఓడించింది. డయానా ఓటమితో కోర్టులోనే కన్నీళ్లు పెట్టుకోగా సెరెనా ఆమెను భుజం తట్టి ఓదార్చింది. 23 గ్రాండ్ స్లామ్‌లు సాధించిన 37 ఏళ్ల సెరెనా 16 సీడెడ్‌గా బరిలోకి దిగింది.

ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచుల్లో కేవలం 9 గేమ్‌లను మాత్రమే కోల్పోయింది. నా శక్తిని ఉపయోగిస్తూ.. ప్రతీ మ్యాచ్‌ను గెలిచేందుకు ఆడతాను అని సెరెనా మ్యాచ్ అనం తరం వ్యాఖ్యానించింది. మరోవైపు హలెప్ కూడా తన మ్యాచ్ ముగి సిన తర్వాత మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోను మ్యా చ్‌ను కోల్పోయేది లేదు. నాలుగో రౌండ్లో 23 సార్లు గ్రాండ్ స్లామ్ గెలిచిన గొప్ప క్రీడాకారిణితో ఆడను న్నాను. అది గొప్ప సవాల్. దానికి సిద్ధంగా ఉన్నాను అని పేర్కొంది.నాలుగో రౌండ్లోకి ప్రవేశి ంచిన ఇతర క్రీడాకారిణుల్లో.. జపాన్ కు చెందిన నవోమి ఒసాకా లాత్వి యాకు చెందిన అనస్టాసిజా సెవాస్టొవాను ఢీకొననుండగా, మరో పోటీలో అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్ ఉక్రెయిన్‌కు చెం దిన స్విటోలినాతో తలపడనుంది. షరపోవా, అస్ట్రేలియాకు చెందిన ఎ బార్టితో, కెర్బర్ (జర్మనీ) అమెరికాకు చెందిన డి కొలిన్స్‌తో, స్లొవానె స్టీఫెన్స్(అమెరికా) రష్యాకు చెందిన అనస్టాసియా పావ్లుచెన్‌కోవాతో ఢీకొననుంది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవా అమెరికాకు చెందిన అమండా అనిసిమో వాతో తలపడనుంది.





ఎస్‌జీఎం ఏర్పాటు చేయం

ఈ అంశం సుప్రీం కోర్టు విచారణలో ఉంది

బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా



న్యూఢిల్లీ: టీవీ షోలో అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా, కెల్ రాహుల్‌పై విచారణ అంశం మరో మలుపు తిరిగింది. విచారణకోసం అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు స్పెషల్ జనరల్ మీటింగ్(ఎస్‌జీఎం) ఏర్పాటు చేయాలని రాష్ట్రాల యూనిట్లు చేసిన ప్రతిపాదనను బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే. ఖన్నా తిరస్కరించాడు. శనివారం ఖన్నా మాట్లాడుతూ..ఈ విషయం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున ఆదేశాలు వెలువడిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నాడు. పాండ్యా, రాహుల్ భవిష్యత్తు నిర్ణయించడానికి సుప్రీంకోర్టు అంబుడ్స్‌మన్‌ను నియమించాలని బీసీసీఐ పాలన కమిటీ కోరుతోంది. మరోవైపు అత్యవసరంగా ఎస్‌జీఎం ఏర్పాటు చేయాలని 14 రాష్ట్రా ల యూనిట్లు ముఖ్యంగా మాజీ బీసీసీఐ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసన్ అనుయాయులు కోరారు. ట్రెజరర్ అనిరుద్ చౌదరీ కూడా అంబుడ్స్‌మన్ ఏర్పాటుకు ఎస్‌జీఎం భేటీకి త్వరగా చర్యలు చేపట్టాలని ఖన్నాకు లేఖరాశాడు. అంబుడ్స్‌మన్ ఏర్పాటుపై బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరీ ఆలోచనను కూడా ఖన్నా కోరాడు. బీసీసీఐకు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. ఈ అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున.. ఖన్నా, లేదా అమితాబ్ ఎస్‌జీఎం ఏర్పాటు నోటీస్‌పై సంతకం చేయాలి. ఇది కోర్టు ధిక్కారం కిందకు రాదా అని పేర్కొన్నాడు.

మలేసియన్ మాస్టర్స్‌లో.. ముగిసిన భారత్ పోరు

సెమీస్‌లో సైనా ఓటమి

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ టోర్నీలో భారత పోరు ముగిసింది. టైటిల్‌ను సాధిస్తుందనుకున్న స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ శనివారం జరిగిన సెమీ ఫైనల్లో ఒలింపిక్ చాంపియన్ వరల్డ్ చాంపియన్ స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్ చేతిలో పరాజయం పాలైంది. 2017లో మలేసియా మాస్టర్స్ టైటిల్‌ను గెలిచి.. 2011లో రన్నరప్‌గా నిలిచిన 28 ఏళ్ల సైనా తొలి గేమ్ ప్రారంభంలో 13-9తో వెనకబడ్డది. అనంతరం సైనా పుంజుకుని 14-14తో సమం చేసింది. మారిన్ శక్తివంతమైన షాట్లతో ర్యాలీగా సాగుతూ గేమ్‌ను 21-16తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మారిన్ పూర్తి ఆధిక్యతను చాటింది. 6-1తో లీడ్‌లో ఉన్న మారిన్ విరామం సమయానికి 11-6కు చేరింది. సైనా పాయింట్లు పొందాలని ప్రయత్నించినప్పటికి.. మారిన్ ఆ ప్రయత్నాలను సాగనివ్వలేదు. చివరికి రెండో గేమ్‌ను 21-13తో సొంతం చేసుకుని మ్యాచ్ విజేతగా నిలిచింది.



ప్రపంచంలో మేటి యార్కర్ బుమ్రా

మాజీ పేసర్ వసీం అక్రం

న్యూఢిల్లీ: ప్రస్తుతం ప్రపంచ క్రికెట్లో మేటి యార్కర్ జస్ప్రీత్ బుమ్రా అని మాజీ పాకిస్తాన్ పేసర్ వసీం అక్రం అన్నాడు. ఆస్ట్రేలియాలో భారత్‌కు టెస్ట్ సిరీస్‌ను అందించడంలో బుమ్రా కీలక భూమిక పోషించాడు. ప్రస్తుత 'అంతర్జాతీయ క్రికెట్లో ఉన్న ఫాస్ట్ బౌలర్లలో బుమ్రా ఉత్తమ, అత్యంత ప్రభావ శీలి బౌలర్ ' అని అక్రం చెప్పాడు. శనివారం వసీం అక్రం మీడియాతో మాట్లాడాడు. ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్లలో ఒకడుగా ఉన్న అక్రంవిభిన్న శైలితో బౌలింగ్ వేసి ఒకప్పుడు తన ప్రత్యేకతను చాటాడు. 'ప్రస్తుత కాలంలో బుమ్రా ప్రత్యేకతను చాటుతున్నాడు. నిరంతరంగా యార్కర్‌లు వేయడంలో ప్రసిద్ధి గాంచాడు. వన్డేలు, టెస్ట్ మ్యాచుల్లో కూడా ఇదే తీరును కొనసాగించాడు. నేను అలాగే బౌలింగ్ వేసేవాడిని' అని స్వింగ్ బౌలింగ్‌లో సుల్తాన్‌గా పేరుపొందిన అక్రం అన్నాడు. రానున్న ప్రపంకప్‌లో బుమ్రా డెత్ ఓవర్ స్పెషలిస్ట్‌గా తన ప్రత్యేకతను చాటుతాడన్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
ఆదివారం 20 జనవరి 2019



స్వర ప్రయాణంలో సాధించిన ఘనత గురించి అడిగితే....నేనింకా విద్యార్థినే అని చెప్పే నిరాండబరుడు, గాన దిగ్గజం కేజే ఏసుదాస్. భారత దేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ అందుకున్న గొప్ప గాయకుడాయన. ఇప్పటిదాకా 80 వేలకు పైగా పాటలు పాడి దేశవ్యాప్తంగా శ్రోతలను అలరిస్తున్నారు. పది భారతీయ భాషలతో పాటు నాలుగు అంతర్జాతీయ భాషల్లో పాటలు పాడారు. అలుపెరుగని సాధనతో ఇంకా స్వరాలాపన చేస్తూనే ఉన్నారు. ఓ సంగీత విభావరి కోసం హైదరాబాద్ వచ్చిన కేజే ఏసుదాస్ ఆంధ్రప్రభ లైఫ్ తో ముచ్చటించారు..

నేను నిత్య విద్యార్థిని

-గాయకుడు కేజే ఏసుదాస్

బాల్యంలో కష్టాలు...

బాల్యం నుంచీ మొదలైన నా సంగీత సాధన పదో తరగతి వరకు తమిళనాడులోని ఎర్నాకుళంలో సాగింది. ఆ తర్వాత సంగీతంలో రెండేళ్ల విద్వాన్ కోర్సు కోసం కోచి రాజావారు ఏర్పాటు చేసిన సంగీత అకాడెమీలో చేరాను. అక్కడ చదువుకుంటుండగానే నాన్న అనారోగ్యం పాలయ్యారు. నాకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. ఒక పూట భోజనం దొరకడమే కష్టమయ్యింది. రాత్రి పూట నిద్ర కారు షెడ్డులో. కొన్నాళ్లకూ నాకూ అనారోగ్యం పట్టుకుంది. అలా కష్టాలు చుట్టుముట్టి మధ్యలోనే కోర్సు వదులుకోవాల్సి వచ్చింది. అలా సంగీతంలో విద్వాన్ కాలేకపోయాను.

నన్ను విద్యార్థిగానే ఉండమన్నాడు...

నేను విద్వాన్ కోర్సు పూర్తి చేయకపోవడం వల్ల మంచే జరిగింది. దేవుడు నువ్వు విద్వాన్ కాదు నిత్యం నేర్చుకుంటూనే ఉండాలని చెప్పినట్లు భావించాను. కొచ్చిన్ లో పుట్టిన నేను సంగీత ప్రయాణంలో త్రివేండ్రం చేరుకున్నాను. అక్కడ ఒక స్నేహితుడు సినిమా పాట పాడే అవకాశం కల్పించాడు. పాట పాడటం కోసం మద్రాస్ రమ్మన్నారు. ట్రిప్లికేన్‌లో నాకు ఒక సోదరుడు ఉండేవాడు. ఆయన ఇంట్లో ఉంటూ సంగీత దర్శకుడు ఉన్న హోటల్ అజంతాకు వెళ్లాను. వాళ్లిచ్చిన పాట యుగళ గీతం. నాకప్పుడు టైఫాయిడ్ జ్వరం ఉంది. దాంతో గొంతు జీరగా పలికింది. పాట ఎలా వస్తుందో అని భయపడుతూనే పాడాను. పాట పూర్తయ్యాక స్నేహితుడు...పాట ఎలా ఉంది సార్ అని సంగీత దర్శకుడిని అడిగితే...పదేళ్ల తర్వాత చెబుతాను అంటూ వెళ్లిపోయాడు. ఆయన ఆశీర్వాదమే ఇప్పటికీ పాడుతూనే ఉన్నాను.

పాటే ప్రధానం..

సులువైన పాట, కష్టమైన పాట అంటూ ఉండదు. పాటంటే పాటే. అది ఎలా ఉన్నా దానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పాడాల్సిందే. నేను ప్రతి పాట అలాగే పాడుతుంటాను. పాటకు నాకున్న పూర్తి శక్తి సామర్థ్యాలతో విలువనిచ్చి పాడుతుంటాను. నేను పాడిన పాటలన్నీ నా వారసులతో సమానం. ఎవరు గొప్ప అని తేల్చలేను. అందుకే మీరు పాడిన పాటల్లో ఇష్టమైన పాట ఏదంటే ఇదనిచెప్పలేను.

మా తరం వేరు..

మేము పాటలు పాడేప్పుడు స్టూడియోలో ఒకటే మైక్ ఉండేది. నేను పాడాక, అమ్మాయి పాడేది, అలా మార్చి మార్చి పాటలు పాడేవాళ్లం. అలా సంగీత దర్శకుడు, గాయనీ గాయకుల మధ్య అనుబంధం ఎక్కువగా ఉండేది. ఇప్పుడలా కాదు. ఎవరు ఎక్కడ నుంచైనా తమకిచ్చిన పాట పాడొచ్చు. రెండింటినీ కలిపి పాట చేస్తున్నారు. నేను ఈ మధ్య ఇలాగే పాట పాడాను. నేను స్టూడియోలో పాడితే గాయని ఒకమ్మాయి ఫోన్‌లో పాడి పంపించింది. ఆమె విదేశాల్లో ఉందట. కలిపి పాట చేశారు. ఇలా పెరిగిన ఆధునికత వల్ల పాటకు పనిచేసే అందరిలో స్నేహం తగ్గిపోయింది.

పిల్లలకు నేర్పించాలి...

ఇప్పుడొస్తున్న యువ గాయనీ గాయకులంతా గొప్పగా పాటలు పాడుతున్నారు. వాళ్లకు మంచి ప్రతిభ ఉంది. తల్లిదండ్రులు పిల్లలను కేవలం చదువుల కోసమే ఒత్తిడి చేయకుండా సంగీతం వంటి కళారూపాలు నేర్పించాలి. మా నాన్న నాకు ఒక్క చదువే నేర్పించి ఉంటే గాయకుడిగా ఇంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకునేవాడినా? పిల్లల్లోని ప్రతిభను మొదట గుర్తించాల్సింది తల్లిదండ్రులే.

అమ్మ గీతాలే స్ఫూర్తి

నేను పుట్టింది క్రైస్తవ కుటుంబంలో. నాన్న అగస్టీన్ జోసెఫ్, నాటక రంగంలో నటుడు, గాయకుడు. అమ్మ ఎలిజబెత్ జోసెఫ్, భక్తి గీతాలు బాగా పాడేది. అలా నాకు దక్కిన సంగీత మూలాలు కుటుంబం నుంచే వచ్చాయి. అమ్మ ఇంట్లో పాడే భక్తి గీతాలు నాకు స్ఫూర్తినిచ్చేవి. ఆ కాలంలో సినిమా పాటలు విస్తృతం కాలేదు. చాలా మంది కర్నాటక సంగీతం నేర్చుకునేవారు. మేము క్రైస్తవులం కాబట్టి కర్నాటక సంప్రదాయ సంగీతం నేర్చుకోవచ్చా అనే సందేహం ఉండేది. అయితే నాన్న అగస్టీన్ కర్నాటక సంగీతం నేర్చుకోమని ప్రోత్సహించారు. సంప్రదాయ సంగీతం నేర్చుకంటే పాటలు పాడేప్పుడు పదాలు పలకడం సరిగ్గా వస్తుందని ఆయన చెప్పేవారు. ఐదేళ్ల వయసులోనే కర్నాటక సంగీతం నేర్చుకోవడం కోసం ఒక గురువు దగ్గర చేర్పించారు.

దేవుడి రూపం గురువు..

ఇవాళ నేనున్న స్థాయికి ఘనతంతా నా గురువులదే. గురువు లేకుంటే ఎవరూ లేరు. ఆయన దేవుడి ప్రతిరూపం. గురువు లేకుండా నేనంతా నేర్చుకున్నానని చెబితే అది అబద్ధమే అవుతుంది. గురువును స్మరించుకునేందుకు కొన్ని సార్లు సంగీత విభావరిలు నిర్వహిస్తుంటాను. ప్రచారం కోసం చెప్పడం లేదు. గురువు లంటే ప్రతి ఒక్కరికీ గౌరవం ఉండాలి.


మితాహారమే మేలు..

నేను యువకుడినే. నా వయసు ఇప్పుడు 79 ఏళ్లు. వచ్చే ఏడాదికి దేవుడి దయ ఉంటే 80లోకి అడుగుపెడతాను. నా ఆరోగ్య రహస్యం మితాహారం. గతంలో ఉన్న బహుళ అంతస్తులు చాలా వరకు ఇవాళ వైద్యశాలలు అవుతున్నాయి. వైద్య వృత్తిలో ఉద్యోగాలు బాగా పెరుగుతున్నాయి. దీనికి కారణం మన జీవన శైలి. రోజూ తినే ఆహారం. ఎవరో మన ఆరోగ్యాన్ని నియంత్రించే కంటే మనమే కాపాడుకోవడం ఉత్తమం. బయటకు వెళ్లినప్పుడు కోరుకున్న ఆహారం దొరక్కపోతే ఉన్నదే ఏదో కొంత తినాలి గానీ పూర్తిగా కాదు. అలా ఆహార నియంత్రణతో ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

నిజాయితీ ముఖ్యం...

దేవుడు మీరో పని చేయాలని నిర్ణయించాడు. దాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించండి. నేను సంగీతాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. మీలో ఆ నిజాయితీ ఉంటే మిమ్మల్నెవరూ ఆపలేరు. నేర్చుకోవాలనే తపన ఉండాలి. ఏకాగ్రత చెదిరిపోకుండా చూసుకోవాలి. నేనీ పాట పాడగలను అనుకోండి. మనలో ఉన్న శక్తి తెలుసుకుంటే విజయం మీదే అవుతుంది.

- రమేష్ గోపిశెట్టి





తెలుగు పాటతో అనుబంధం

గాయకుడిగా కేజే ఏసుదాసు ప్రయాణం మిగతా భాషలతో సమాంతరంగా తెలుగులోనూ కొనసాగింది. బాలచందర్ తమిళం, తెలుగులో రూపొందించిన చిత్రాల్లోని పాటలను ఈ దిగ్గజ గాయకుడు పాడేవారు. అంతులేని కథ చిత్రంలో దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి అపూర్వ ఆదరణ పొందింది. కళాతపస్వి కె విశ్వనాథ్ దర్శకత్వం వహించిన శృతి లయలు చిత్రంలో తెలవారదేమో స్వామి పాట కూడా శ్రోతలకు ఇప్పటికీ గుర్తుండిపోయింది. చిరంజీవి నటించిన రుద్రవీణ చిత్రంలో లలిత ప్రియ కమలం అనే పాటకు తెలుగులో ఎస్పీ బాలుకు జాతీయ పురస్కారం దక్కితే తమిళంలో ఏసుదాసు జాతీయ ఉత్తమ గాయకుడి గౌరవం దక్కించుకున్నారు. మేఘ సందేశం చిత్రంలో నవరస సుమ మాలిక ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. మోహన్‌బాబు నటించిన దాదాపు అన్ని చిత్రాల్లో ఏసుదాసు గొంతు వినిపిస్తుంటుంది. అసెంబ్లీ రౌడీ, బ్రహ్మ, మేజర్ చంద్రకాంత్ లాంటి చిత్రాల్లో ఆయన పాడిన పాటలన్నీ బహుళ జనాదరణ పొందాయి.



ఐదు నిమిషాల్లో స్నాక్స్..

ఉదయం పూట పిల్లలకు టిఫిన్ బాక్స్‌లో పెట్టడానికయినా, లేదా సాయంత్రం స్నాక్‌గా తినడానికి అయినా స్నాక్స్ తయారుచేయాల్సి వస్తుంది. కాని మనదగ్గర సమయం ఎక్కువ ఉండదు. కాబట్టి త్వరగా తయారు చేయగలిగే స్నాక్ అయిఉండాలి. క్విక్ స్నాక్స్ చేసుకోగలిగేవిధంగా ఫ్రిజ్‌లో బ్రెడ్ ఎప్పుడూ పెట్టుకోవాలి. దానితో ఎప్పుడు కావాలంటే అప్పుడు స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఈ 5 నిమిషాల్లో తయారయ్యే స్నాక్స్ ప్రముఖ చెఫ్ తరలా దలాల్ కిచెన్ నుంచి. పోషకాలతో పాటు చాలా రుచికరంగా కూడా ఉంటాయి.

పచ్చి బఠాణి శాండ్‌విచ్

ఒక వెడల్పాటి మూకుడులో నూనె వేడి చేసి అందులో పచ్చి బఠాణి, చిటికెడు సోడా, ఉప్పు వేసి బాగా కలిపి మీడియం మంట మీద 2 నిమిషాలు వేగనివ్వాలి. మధ్యమధ్యలో కలుపుతుండాలి. అలా వేగిన మిశ్రమాన్ని వేరొక గిన్నెలోకి తీసుకుని చల్లారనివ్వాలి. చల్లారాక అందులో ఒక చెంచా మయొనీజ్, ఒక చెంచా చిల్లీ సాస్ వేసి కలపాలి. మిశ్రమాన్ని నాలుగు భాగాలుగా చేయాలి. బ్రెడ్ స్లైస్‌లను ఒక గుండ్రటి గిన్నెను ఉపయోగించి చుట్టుపక్కల అంచులు పోయేలాగా గుండ్రటి బ్రెడ్ స్లైస్‌లను తయారు చేసుకోవాలి. ఒక్కో స్లైస్ మీద పచ్చి బఠాణి మిశ్రమాన్ని పరచి దాని మీద ఒక అరస్పూన్ గ్రీన్ చట్నీ వేసుకోవాలి. అలా చేసిన బ్రెడ్ స్లైస్‌లను ఒకదాని మీద ఒకటి అమర్చాలి. పై స్లైస్ మీద గుండ్రంగా తరిగిన కీరదోస ముక్కలు పెట్టాలి. అలా మూడు నుంచి ఐదు స్లైస్‌ల వరకు అమర్చుకుంటే వెంటనే ఆరగించడానికి గ్రీన్ పీ కుకుంబర్ శాండ్‌విచ్ సిద్ధం.



చీజీ ఆనియన్ చిల్లీ టోస్ట్

ముప్పావుకప్పు తురిమిన ప్రాసెస్డ్ చీజ్‌ను, ఒక చెంచా వెన్నతో కలిపి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో అరకప్పు సన్నగా తరిగిన ఉల్లిపాయలు, ఒక చెంచా చిల్లీ సాస్, తగినంత ఉప్పు వేసి కలపాలి. ఆ మిశ్రమాన్ని నాలుగు సమాన భాగాలుగా చేయాలి. టోస్ట్ చేసి పెట్టుకున్న బ్రెడ్ స్లైస్‌ల మీద ఆ మిశ్రమాన్ని పరవాలి. బేకింగ్ ట్రేమీద వెన్న పూసి దాని మీద బ్రెడ్ స్లైస్‌లను ఉంచి 200 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో 5 నుంచి 7 నిమిషాల వరకు బేక్ చేయాలి. అలా బేక్ చేసిన వాటిని త్రికోణాకారంలో కట్ చేసి పెట్టుకుంటే చూడటానికి, తినడానికి బావుంటాయి.



వంటింటి బ్యూటీ టిప్స్



ఖరీదైన కాస్మెటిక్‌లు అవసరం లేదు. మనకు అందుబాటులో ఉండే, మన వంటింట్లో ఉండే వస్తువలను ఉపయోగించి మన చర్మరక్షణ చేసుకోవచ్చు. అనాదికాలం నుంచి వస్తున్న సంప్రదాయ బ్యూటీ టిప్స్ ఇవి.

నెయ్యి: ప్రత్యేకంగా లిప్‌బామ్‌లు కొనుక్కోనక్కరలేదు. రాత్రి పడుకునేటప్పుడు కొద్దిగా పేరిన నెయ్యి పెదవులకు రాసుకుంటే చాలు. పగిలిన శరీర భాగాలను వెంటనే బాగుచేసే శక్తి నెయ్యికి ఉంటుంది. పాదాలు పగిలితే అక్కడ నెయ్యి రాసుకుంటే కొద్దిరోజుల్లోనే పాదాలు పగుళ్లు పోయి మెత్తగా, అందంగా తయారవుతాయి.

పసుపు: యాంటీ సెప్టిక్‌గా, రక్తస్రావ నివారిణిగా పనిచేస్తుంది. పసుపును కొద్దిగా నిమ్మరసంలో కలిపి ముఖానికి రాసుకుంటే చర్మంలో అనవసర జిడ్డును తొలిగించి మొటిమలు రాకుండా నివారిస్తుంది. ముఖం మీద సన్నని నూగు వెంట్రుకలను పోగొడుతుంది. పసుపును మజ్జిగ లేదా చెరుకురసంతో కలిపి కళ్ల కింది భాగంలో క్రమం తప్పకుండా రాసుకుంటే నల్లని వలయాలు, ముడుతలు మాయం అవుతాయి.



తేనె: చర్మాన్ని యవ్వనంగా మిలమిలలా డేటట్లు చేస్తుంది తేనె. పొడిచర్మం ఉన్నవారు క్రమం తప్పకుండా వాడితే పొడిచర్మ సమస్య తగ్గుతుంది. చర్మం మీద ఫంగల్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. పెదవులకు, పగిలిన పాదాలకు కూడా తేనె మంచి పరిష్కారం. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఏజింగ్ రక్షితాలు చర్మాన్ని బాగుచేస్తాయి.



కొబ్బరి నూనె:కొబ్బరి నూనె అంటే జుట్టుకు మాత్రమే మంచిచేసేదనుకుంటారు. కాని దానితో చర్మానికి కూడా ఉపయోగమే. మేకప్ వేసుకోవడం ఒక ఎత్తయితే దాన్ని తీసేయడం కూడా పనే. పూర్తిగా చర్మం మీద నుంచి మేకప్‌ను తొలగించాలి. వందల రూపాయలుపెట్టి మేకప్ రిమూవల్ ఆయిల్స్ కొనాల్సిన అవసరం లేదు. కొబ్బరినూనెను వాడవచ్చు. ఇందులో లోపలికి చొచ్చుకునిపోయి తేమని కలిగించే గుణాలుంటాయి. కొబ్బరి నూనెతో పాటు బేకింగ్ సోడాను కొద్దిగా కలిపి ముఖానికి రాసుకుంటే చర్మం నిగనిగలాడుతూ బావుంటుంది. జిడ్డుచర్మం ఉన్నవారు కొద్దిచుక్కలు మాత్రమే రాసుకుంటే చాలు. మొత్తం నూనెను చర్మం పీల్చేసుకుంటుంది. చర్మం కింద నల్లటి వలయాల మీద కొబ్బరి నూనెను రాసుకుని మృదువుగా మర్దనా చేస్తే కొద్ది వారాల్లోనే ఫలితాలు కనిపిస్తాయి.




నిమ్మకాయ: చర్మ సంరక్షణలో నిమ్మకాయది పెద్ద పాత్ర. ఇందులో ఉన్న సహజ యాంటీసెప్టిక్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు మొటిమలు, బ్లాక్‌హెడ్స్, నివారిణిగా పనిచేస్తుంది. కొన్ని నిమ్మచుక్కలు రాసుకుంటే ఒక్కరాత్రి లోనే పగిలిన పెదవులను మృదువుగా మార్చగలదు. ముఖం మీద మచ్చలు, ముడుతల నివారిణి.

అల్లం: హైపర్ పిగ్మెంటేషన్ ఉంటే కొద్ది తాజా అల్లం రసం దాని మీద రాస్తుంటే 10 రోజుల్లోనే ఫలితం కనిపించడం మొదలవుతుంది. అల్లం రసం మొటిమల నివారిణి కూడా. వారానికి ఒకసారి అల్లంరసాన్ని పాలపొడితో కలిపి మాస్క్ వేసుకుని 15 నిమిషాలు ఉంచుకుని కడిగేసి దాని మీద ఏదైనా మాయిశ్చరైజర్ రాసుకుంటే చర్మం బావుంటుంది.

ప్రాతఃస్మరణీయుడు

తిరుమళిశై ఆళ్వార్

తమిళనాడులో వైష్ణవ భక్తి ఉద్యమ పరివ్యాప్తికి విశేషంగా తోడ్పడిన మహా భక్తుల్లో ఆళ్వార్లు ఒకరు. 12 మంది వరకూ ఉన్న ఈ ఆళ్వార్లకు తమిళ సాహిత్యంలో కూడా ప్రముఖ స్థానం ఉంది. వారి రచనలు ఎంతో పేరు పొందాయి. అటువంటి ఆళ్వారులలో తిరుమళిశై ఆళ్వార్ ఒకరు. ఆయన గురించి తెలుసుకుందాం.



తమిళనాడులో కాంచీపురానికి దగ్గరలో ఒక గ్రామం ఉంది. ఆ గ్రామాన్ని మహీసారపురం అనేవారు. కాలక్రమంలో అది నగరంగా మారింది. దానిని తిరుమళిశైపురం అంటూ వచ్చారు. అక్కడే దివ్యాంశ సంభూతులైన తిరుమళిశై జన్మించారు. ఈ మహీసారం సకల సౌభాగ్యాలకూ నెలవుగా ఉండేది. దీని సమీపంలో ఒక అరణ్యం ఉంది. అందులో ఒక ముని పర్ణశాల నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఆయన పేరు భార్గవుడు. ఆయన తపస్సు తన ఉనికికే ప్రమాదంగా పరిణమించిందని, ఇంద్రుడు కనకాంగి అనే అప్సరసను భార్గవుని తపస్సు భంగం గావించమని పంపించాడు. కనకాంగి తన అందచందాలతో భార్గవుని లోబరచుకుంది. వారికి కొంత కాలానికి ఒక కుమారుడు కలిగాడు. కనకాంగి ఆ శిశువును ఒక వెదురు బుట్టలో పెట్టి పొదల మాటున దాచి, తన లోకానికి వెళ్లిపోయింది. భార్గవుడు కనకాంగి కోసం ఎంతగానో వెతికాడు. చివరకు అసలు విషయం తెలుసుకుని పశ్చాత్తాపం చెందాడు. తిరిగి తపస్సు చేయడానికి దూరంగా వెళ్లిపోయాడు. పొదల మాటున వెదురు బుట్టలో ఉన్న బాలుడు బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టాడు. అదే దారిన తిరువలన్ అనే మేదరి వస్తున్నాడు. ఆ బాలుని చూసి అతణ్ని దైవ ప్రసాదంగా భావించి తన ఇంటికి తీసికెళ్ళాడు. తనకు లభించిన శిశువు దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్నాడని మురిసిపోయాడు. అయితే ఆ శిశువు పాలు తాగడు. ఏమీ తినడు. బాలుని ప్రవర్తన తల్లిదండ్రులకే కాక అందరికీ వింత అనిపించింది. ఆనోటా ఈ నోటా బాలుని విషయం తెలిసిన పలువురు అతనిని చూడటానికి రాసాగారు. ఆ ప్రాంతం ఒక తీర్థ స్థలంగా మారింది. అయితే తల్లిదండ్రులు పద్మావతి (పంకయ చెల్వి), తిరువలన్ మాత్రం మనస్సులలో ఎంతగానో దిగులుపడసాగారు. ప్రతిరోజూ శిశువుకు స్నానాదికాలు చేయించేవారు, నుదుటన తిలకం దిద్దేవారు. తలకు, మెడకూ పూలమాలలు అలంకరించేవారు. ఆహారం స్వీకరించకపోయినా బాలుడు దిన దిన ప్రవర్ధమానమవడం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఎప్పుడూ కనులు మూసుకుని ధ్యానంలో ఉండేవాడు. ధ్యానంలోనే తన్మయత్వంతో శ్రీమన్నారాయణుడి విశేష గుణాలను గానం చేస్తూ ఉండేవాడు. ఒకసారి నడి వయసు దంపతులు వచ్చారు. బాలునికి ఒక పాత్ర నిండా పాలు ఇచ్చి తాగమన్నారు. ఎప్పుడూ ఏమీ తీసుకోని బాలుడు ఆ పాలు తాగాడు. ఆ నాటి నుంచి వారితో పాటు అందరూ బాలునికి పాలు సమర్పించడం మొదలుపెట్టారు. ప్రజలు ఆయనను తిరుమళిశై అళ్వార్‌గా పిలిచేవారు. ఇదిలా ఉండగా ఒకనాడు తిరుమళిశై తనకు రోజూ పాలు ఇస్తున్న దంపతులను కరుణించాడు. వారిచ్చిన పాలలో కొంత తాగి మిగిల్చి వారిని తాగమన్నాడు. వారు అలాగే భక్తిపూర్వకంగా తాగారు. కొన్ని రోజులకే వారికి ఒక తేజోవంతుడైన కుమారుడు కలిగాడు. అతనికి కణికణ్ణన్ అని పేరు పెట్టారు. కణికణ్ణన్ ఆ తర్వాత తిరుమళిశై అళ్వారును సేవించుకుంటూ ఆయన శిష్యుడైపోయాడు. గురు శిష్యులిద్దరూ వైష్ణవ భక్తి ప్రబోధకులయ్యారు.

ఒక రోజు నగరంలో తిరుమళిశై సంచరిస్తుండగా అనారోగ్యంతో ఉన్న ఒక బిచ్చగత్తె తారసపడింది. ఆమె బాధను చూసి తిరుమళిశై, స్వామిని ప్రార్థించి ఆశీర్వదించాడు. వెంటనే ఆమె అనారోగ్యం తగ్గి, వికారంగా ఉన్న రూపం పోయి సౌందర్యవతిగా మారిపోయింది. సౌందర్యవతిగా మారిన ఆమెను ఆ దేశపు రాజు వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి ఆ రాజు వృద్ధుడైనా ఆమె మాత్రం యౌవ్వనవతిగానే ఉండిపోయింది. ఆళ్వార్ ఆశీర్వాదమే దానికి కారణమని భావించి రాజు, తను కూడా ఆశీర్వాదం పొందాలని భావించాడు. రాజభటులను పంపి ఆళ్వార్‌ను తీసుకురమ్మని ఆదేశించాడు. అయితే ఆళ్వార్ తన బదులు కణికణ్ణన్‌ను రాజదర్బారుకి పంపాడు. రాజు తిరుమళిశై అళ్వారును తీసుకురమ్మని కణ్ణన్‌ను కోరగా 'వారు ఎప్పుడూ ధ్యానంలో ఉంటారు కనుక రాలేర'ని తెలిపాడు. అయితే శ్రావ్యంగా ఉండే కణ్ణన్ గానానికి కూడా ఇతరులను యవ్వనవంతులుగా మార్చే శక్తి ఉండవచ్చని భావించిన రాజు అతనిని పాడమని ఆదేశించాడు. అయితే తాను తన గురువు ఎదుట తప్ప ఇంకెవరి ముందూ పాడనని కణ్ణన్ చెప్పాడు. దానితో కోపగించిన రాజు వారికి దేశ బహిష్కార శిక్ష విధించాడు. శిష్యుడితో పాటు తిరమళిశై నగరాన్ని విడిచి వెళుతుండటంతో ప్రజలందరూ వారి వెంట వెళ్లారు. నగరం నిర్మానుష్యమైపోవడంతో రాజు నివ్వెరపోయాడు. అయితే వారినందరినీ సాదరంగా ఆహ్వానించాలని రాణి కోరడంతో రాజు పశ్చాత్తాపం చెంది వారిరువురినీ సమీపించి వారి పాదాలపై పడి తనను క్షమించమని వేడుకోగా తిరుమళిశై ఆళ్వార్ తన శిష్యగణంతో తిరిగి రాజ్య ప్రవేశం చేశాడు, రాజు ఆళ్వార్‌కు సకల సదుపాయాలు కల్పించి సేవించసాగాడు. తిరుమళిశై ఆళ్వార్‌కు కుముదవల్లి అనే భార్య ఉన్నట్టు చెబుతారు. తిరుమళిశై ఆళ్వార్ 'నాన్ ముగన్ ' అనే దివ్య ప్రబంధ తిరవందాదిని రచించారు. భక్తి సామ్రాజ్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొంది ఆళ్వార్ తమిళదేశంలో ప్రాతఃస్మరణీయుడైనాడు.



- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

చింతన

భౌతిక ప్రకృతితో సంగత్వమే జన్మకారణం



అధ్యాయం- 13, శ్లోకం- 22

పురుషః ప్రకృతిస్థో హి
భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్।
కారణం గుణసంగోస్య
సదసద్యోనిజన్మసు॥

తాత్పర్యం: భౌతిక ప్రకృతియందు త్రిగుణముల ననుభవించుచు జీవుడు ఈ విధముగా జీవనము సాగించును. భౌతిక ప్రకృతితో అతనికి గల సంగత్వమే దీనికి కారణము. ఆ విధముగా అతడు ఉత్తమ, అధమ జన్మలను పొందుచుండును.

భాష్యం: జీవుడు ఒక శరీరమును వదిలి మరొక శరీరమునకు ఎలా మార్పు చెందుతాడే తెలుసుకొనుటకు ఈశ్లోకము చాలా ముఖ్యమైనది. ఈ శ్లోకమున భౌతిక ప్రకృతిని అనుభవించాలనే కోరికే జీవుని ఒక శరీరము నుండి మరొక శరీరమునకు మార్పు చెందించుచూ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చేటట్లు చేస్తుంది. ఏ విధముగా జీవుడు వేర్వేరు గుణాలతో సంపర్కములోనికి వచ్చునో వాటికి తగిన శరీరములను పొందును. కొన్నిసార్లు దేవతగా, మానవునిగా, పశువుగా, జలచరముగా, పుణ్యాత్మునిగా మరియు క్రిమి కీటకముగా జన్మించును. త్రిగుణాలను అధిగమించనంతవరకూ ఈ జనన మరణ చక్రము నుండి ఎవరూ బయటపడలేరు. అది కేవలము కృష్ణచైతన్యము ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అర్జునుని వలే జీవుడు కూడా కృష్ణుని నుండి శ్రవణము చేసి విధేయతతో విన్నవాటిని పాటించినట్లయితే క్రమేణ భౌతిక ప్రకృతిని అనుభవింపవలెనన్న కోరిక సన్నగిల్లి, తత్ఫలితముగా ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించే స్థితికి చేరుకుంటాడు. రాబోవు శ్లోకాలలో ఈ విషయము మరింత స్పష్టము చేయబడుతుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

పిల్లల నుండి నేర్చుకోవాలి


పిల్లలు మన జీవితంలోకి రాగానే మనం వారికన్నీ నేర్పించాలని తెగ తాపత్రయపడుతూ ఉంటాము. నిజానికి మనం వారికి నేర్పించేది ఏమైనా ఉందా, లేక మనమే వారి దగ్గర నేర్చుకోవాలా? దీని గురించి సద్గురు ఏమంటున్నారో తెలుసుకుందాం. ఒక శిశువు తమ జీవితంలోకి ప్రవేశించగానే, చాలామంది, ''ఇక మనం బోధించే సమయం వచ్చింది' అని తలుస్తారు. ఒక శిశువు మీ జీవితంలోకి ప్రవేశిస్తే, మీరు మరచిపోయిన జీవితాన్ని తిరిగి నేర్చుకునే సమయం వచ్చినట్లు అర్థం. మీరొక చెక్క బొమ్మలాగా అయిపోయారు. అప్పుడు, ఈ బుజ్జి ఆనందాల మూట మీ జీవితంలోకి ప్రవేశించింది. ఇప్పుడు, తెలియకుండానే, మీరు నవ్వటం మొదలుపెట్టారు. పాడటం మొదలుపెట్టారు. సోఫాల క్రింద పాపాయితో బాటు పాకసాగారు. పాపాయి వల్లనే, జీవితం జీవితంలాగా ఉంది. మీ వల్ల కాదు. జీవితం విషయం తీసుకుంటే, మిమ్మల్ని, మీ పాపాయిని పోల్చి చూద్దాం. 24 గంటల్లో, ఎవరు ఎక్కువ ఉల్లాసభరితంగా ఉన్నారు? మీ పాపాయి అవునా? మరి జీవితం గురించి ఎవరిని సంప్రదించాలి? మీ పాపాయినే కదా! కాబట్టి, అది మీరు జీవితాన్ని నేర్చుకునే సమయం, జీవితాన్ని బోధించేసమయం కాదు.

సద్గురుబోధ

మీరు పిల్లలను పెంచే అవసరం లేదు. వారు తమంత తాము ఆనందపు మూటలు. మీ ప్రభావం మీ పిల్లల మీద పెద్దగా ఉండకుండా చూసుకోవాలి. ఇక వారు హాయిగా ఉంటారు. మీ పిల్లవాని చుట్టూ ప్రేమాదరణలతో నిండిన వాతావరణాన్ని సృష్టించండి. వారు చక్కగా పెరుగుతారు. ఇది మీ తోటలో ఒక మొక్కను పెంచటం వంటిదే. వాతావరణం సరిగ్గా ఉండేటట్లు మీరు చూసుకుంటే చాలు. మొక్క తన సంపూర్ణ సామర్థ్యంతో పెరుగు తుంది. ప్రతిరోజూ, అదేపనిగా మీరు దాని జోలికి పోతూ ఉంటే కనుక, అది పెరగనే పెరగదు.

కాబట్టి, మీరు మీ పిల్లవాణ్ణి చక్కగా పెంచాలనుకుంటే, మొట్టమొదటి విష యం, మీరు ఆనందంగా ఉండి తీరాలి. ప్రస్తుతం మీ అంతట మీరు ఎలా ఆనందంగా ఉండాలో మీకు తెలియదు. ఆందోళన, కోపం, భయం, ఆదుర్దా, అసూయ, వీటిపై ప్రతిరోజూ మీ ఇంట్లో ఒక ప్రదర్శన జరుగుతూ ఉంది. మీ పిల్లవాని ముందు ఈ విషయాలే ప్రదర్శింప బడుతూ ఉన్నాయి. అప్పుడు అతడు అవే నేర్చుకుంటాడు. పిల్లవాణ్ణి చక్కగా పెంచాలనే ఉద్దేశ్యం నిజంగా ఉంటే, ముందు మీరుండే తీరును మార్చుకోవాలి. మిమ్మల్ని మీరు పరివర్తనం చెందించుకునే సామర్థ్యం లేకపోతే, ఇక పిల్లవాణ్ణి పెంచటం అనే ప్రశ్నకు తావెక్క డుంది? పిల్లవాణ్ణి ప్రేమపూర్వకంగా పెంచటం అంటే అతనికి అడిగినదల్లా ఇవ్వ టమే అని చాలామంది అనుకుం టారు. మీ పిల్లవాణ్ణి కొంచెం విజ్ఞతతో గమనించండి. అప్పుడు అతడు అడిగినదల్లా తెచ్చి ఇవ్వటం ఒట్టి మూర్ఖత్వమే అని తెలుస్తుంది. దానికి మీరు 'ప్రేమ' అని పేరు పెట్టారు. మీరు చేయవలసినదంతా, ఇంట్లో ప్రేమాదర ణలతో నిండిన వాతావరణాన్ని కల్పించటమే. అదొక్కటే మీ పని. ఆ ఒక్కటి ఖచ్చితంగా చూసుకోండి. కోపంగా అంటే ఏమిటో, దీనంగా ఉండటం అంటే ఏమిటో, భంగపడటం అంటే ఏమిటో, మీ పిల్లలు ఎప్పటికీ చూడకూడదు. మీ ఇల్లు ప్రేమా నందాలతో నిండి ఉండేలా చూడండి. ఇకవారు అద్భుతంగా పెరుగుతారు. మీ పని అలాంటి వాతావరణాన్ని కల్పించటమే. మీ అనవ సరపు సోదినంతా వాళ్లకు బోధించటం కాదు. మీరు వాళ్ల జోలికి వెళ్లకుండా ఉండేలా చూసుకుంటే చాలు. వాళ్లు చక్కగా ఉంటారు. ఎటువంటి పరిస్థితులలో పడవేసినా, వాళ్లు ఉల్లాస వంతంగా జీవించగలగాలి. ఆ రకంగా వాళ్లను పెంచండి. వాళ్లు పెరగవలసిన తీరు అదే. అవునా, కాదా?

ప్రేమాశీస్సులతో




- సద్గురు జగ్గీవాసుదేవ్


ఎన్ని వత్తులతో దీపారాధన చేయాలి?

- పార్వతి, నల్గొండ

ఒక వత్తితో దీపం వెలిగించరాదు. 2,5,9,11,16,18,21,28 వత్తులతో దీపారాధన చేయాలి. ఇంకా భక్తి, అవకాశం ఉన్నవారు 51,101,501 వత్తులతో కూడా దీపారాధన చేయ వచ్చు. ఇది కామ్య వ్రతం అనగా కోరికలను బట్టి వత్తులతో దీపాలను వెలిగిస్తారు. నిత్యా రాధనలో రెండు వత్తులతో రెండు దీపాలను వెలిగించి ఆరాధన చేయాలి. ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపారాధన చేయడం శ్రేష్టం. కాకుంటే మనకు లభించే తైలములతో దీపం వెలిగించవచ్చు. భక్తితో, ప్రేమతో, శ్రద్ధతో దీపారాధన చేయాలి. భగవంతుడిని ప్రేమించాలి, ఆరాధించాలి.



ధర్మసందేహాలు



- డా॥ కందాడై రామానుజాచార్య

అవతరణిక

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

(గత సంచిక తరువాయి భాగం)

మహర్షి వాక్యములలో నెక్కడ చూచినను **''ఉద్ధరేదాత్మనాత్మానం''** ''తనను తానే యుద్ధరించుకొనవలెను'' అని చెప్పినట్లున్నది. కాని గురువక్కరలేదని మాత్రము వారి సిద్ధాంతము కాదు. అది అధికారి తారతమ్యమునునుసరించి యుండుననెడివారు.

అస్మదాదుల దృష్టిలో అద్భుతావహమైన విషయమేదైనను వారికి చెప్పినచో వారు సర్వజ్ఞులగుటచే కొంచెము కూడ ఆశ్చర్యమును పొందెడివారు కారు. మనుష్యుల మీదనే కాక పశుపక్షి సరీసృపాదుల యందును వారికి గల వాత్సల్యము వారి నడవడిలోనే యగుపడును. వారికి సర్వభూత సమత్వము సహజము.

గోలక్ష్మి ముక్తిని గురించి ఒక భక్తుడు ''తిర్యగ్జాతికి మోక్షార్హత లేదని గదా సిద్ధాంతం. తమ సన్నిధిలో పశుపక్ష్యాదులకున్ను మోక్షం లభిస్తున్నట్లు ప్రత్యక్షంగా చూస్తున్నాం''అనగానే మహర్షి ''ఒక మహాపురుషుడు ముళ్ల చెట్టుకే మోక్షం యిచ్చి వున్నట్లు చెప్పి వున్నదే''అని యా కథను విశదీకరించిరి. కృష్ణుడు కుచేలుడు తెచ్చిన యటుకులను తిన్నట్లు ఒకనాడు మహర్షి అనేక విధములైన భక్ష్యములుండగా వానిని విడిచి, ఒక ముదుసలి తెచ్చిన భక్ష్యములు, మరియొకప్పుడు ఒక పేదరాలు తెచ్చిన సంకటిముద్దను సాదరముగా భుజించిరి.

మహర్షి యొకప్పుడు మట్టిని నీటితో తడిపి త్రొక్కి ముద్దలు చేసి ఒక అరుగును నిర్మించుచుండగా ఎవరో వచ్చి వారిని మహర్షియని గుర్తింప లేక వారినే 'స్వామి యెక్కడ' అని ప్రశ్నింపగా, వారే 'కొంచెం సేపట్లో వస్తారు' అని సమాధానమొసగిరి. వారికి క్రొత్తవారి దగ్గరనైనను తామే స్వామియని చెప్పుకొనుట కిష్టముండెడిదికాదు. అది కూడ నహంకారమగుననియే వారి భావమై యుండవచ్చును.


''కరతల భిక్షస్తరు తలవాస్'' అన్నదానికి లక్ష్యము ''అగ్రహారంలో భిక్ష'' అను లేఖా విషయము. శివునకర్ధనారీశ్వరత్వమెట్లు కలిగినదో యొక లేఖలో సెలవిచ్చిరి. ఇది సామాన్యులకు అశ్రుతపూర్వము. ఒకప్పుడు శృంగేరీ పీఠాధిపతుల నుండి యొక పండితుడు వచ్చి మహర్షితో ''స్వామీ! సరవమును తెలిసిన మీరు నిరాశ్రమిగా ఉండుట కంటె దీక్షాస్వీకారము చేసి సంపూర్ణ కాషాయము కాకున్నను, కాషాయ కౌపీనమునైన ధరింపరాదా! తమను మాగురుపరంపరలో చేర్చుకొనవలెననియున్నది''అని చెప్పగా మహర్షి

శ్లో॥ యోజనత్రయమాత్రేస్మిన్ క్షేత్రేని నివసతాం నృణాం
దీక్షా దికం వినా
ప్యస్తువత్సాయుజ్యం మయా జ్ఞయా॥అను శ్లోకముతో సమాధానము చెప్పిరి.

''భగవానునకు ఏది ప్రియం'' అని యెవరైనను ప్రశ్నించినచో ''ఏదీ చేయకుండా ఊరుకోవడం భగవానునకు ప్రియం''అనెడివారు. నదీ ప్రవాహజలము సాగరములో పడి వ్యర్థమైపోకుండుగ ఆనకట్టలు కట్టి క్షేత్రములలో ప్రవహింపజేసి ఫలవంతములుగా జేసినట్లు, నాగమ్మగారు శ్రీవారి బోధసుధాలహరిని వ్యర్థముగా పోకుండా లేఖారూపమున భక్తులకందజేసిరి.

మద్రాసు
1.1.1964

ఇట్లు,
ఉభయ భాషా ప్రావీణ్య
అఖండం సీతారామశాస్త్రి



పీఠిక

శ్రీ సూరినాగమ్మగారురమణమహర్షి భక్తురాలు. ఆమె రమణ యోగిని. ఆమె కిద్దరన్నగారులు. ఇద్దరు గొప్పస్థితిలో నున్నవారు. ఆమె శ్రీరమణాశ్రమము నందుండి యచటి సంగతులన్నియు చిన్నన్నగారికి లేఖలు వ్రాయుచుండెను. ఆ లేఖలన్నియ కలిపి యిది వరకే నాల్గు భాగములుగా ప్రచురించిరి. ఇది యైదవ భాగము చివరిభాగము. ఈ లేఖలు చదువుచున్నపుడు పాఠకుడు భక్తుడై భావుకుడైనచో తన్మయత్వము భజించును. ఈ గ్రంథములోనున్న దైవికములు అర్థములు లౌకికములునైన విషయములటుంచి తొలుత ఇందులోని తెలుగు భాషను గురించి వ్రాయువలయును. రమణాశ్రమములో ననేకవిధములైన యజ్ఞములు జరుగుచుండును. తత్తత్కర్మాంగ బోదకములైన ఎన్ని శబ్దము లీగ్రంథము నందు గలవు? ఒక హోమ సందర్భములో, ''యాగపూజ జరిగింది.. గోశాల నుండి వృషభాలను బాజాభజంత్రీలతో లోగడ పూజ జరుగుతున్న దేవాలయము వద్దకు తెచ్చి పసుపు కుంకుమ పూలమాలలతో వాటి కొమ్ములు అలంకరించి, ఆ కొమ్ములకు త్రాడొకటి కట్టి లింగం కదిలించడం అనే విధానం నడిపి'' ఇలా జరిగిన దానిని తెలుగు మాటలతో చెప్పడం ఒక నేర్పు. మరిన్నీ, ''లింగానికి వెనుకభాగంలో వున్న మేరు ప్రస్తార శ్రీచక్రస్థాపనార్థం స్వర్ణనిర్మిత మేరు ప్రస్తార శ్రీచక్రాన్ని శ్రీ భగవాన్ నవరత్న సహితంగా'' ''మూడవదినం ఉషఃకాలమందే కలాకర్షణం జరిగింది.. ఉదయాన్నే కలాకర్షణ చేసి కలశాలు ఆలయంలో ప్రవేశపెట్టి, శక్తిన్యాసం మూర్తులందు కావింపబడింది...కొందరు భక్తులు ఈ కార్యనిర్వహణ దక్షులైన నిరంజనానంద స్వాములను పుష్పమాలాలంకృతులను చేసి సత్కరించారు...గాయత్రిలో, ధియో యోనః ప్రచోదయాత్ అన్నారే దాని భావం ఏమిటి? భగవాన్ సాదరంగా చూస్తూ ''ధీ అంటే బుద్ధి కదా, ధియోయోనః ప్రచోదయాత్ అంటే యః - ఏ తేజస్సు నః-మా యొక్క, ధియః-బుద్ధులను, ప్రచోదయాత్-ప్రబోధింపచేయుచున్నదో అని అర్థము''.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దిన ఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభ తరమవుతాయి.

వృషభరాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విష యంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విష యాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధి లో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉప శమనం ఉంటుంది. ఆర్థికవ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటకరాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయమార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేక పోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగి స్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొర పాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చికరాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతి బంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగు తాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు, వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సంస్కృతి



చిత్రకళకే అంకితమైన సురభివాణీ దేవీ తన సృజనాత్మకతను బోధనారంగంలోనూ ప్రదర్శిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీని సురభి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిర్వహిస్తూ వేలాదిమంది చిత్రకారులను సమాజానికి అందిస్తున్నారు. 1952 ఏప్రిల్ 1న జన్మించిన వాణీదేవి తన జీవిత ప్రయాణమంతా కళాత్మకత-సృజనాత్మకత కళల చుట్టూనే సాగుతోంది.

సంపూర్ణ చిత్రకారిణి

సురభి వాణీదేవి

తెలంగాణ చిత్రకళా వైభవం-30

లలిత కళలు మనిషి నైజంతో పెరుగుతాయి. చిత్రలేఖనం కూడా అంతేనన్నది ప్రముఖ చిత్రకారిణి సురభి వాణీదేవి అభిప్రాయం. మాజీ ప్రధాని పి.వి.నరసింహరావు కూతురు వాణీదేవి తెలంగాణ పల్లె పట్టులోని సౌందర్యానికి తన్మయం చెంది తన మానసిక భావోద్వేగాలకు రూపం ఇచ్చేందుకు చిత్రకళ మాధ్యమాన్ని ఎంచుకున్నారు. ఏది చదివినా అందులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న తండ్రి పి.వి.మాట మనసులో నిలుపుకుని ప్రాథమిక పాఠశాల రోజుల నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి, అనురక్తిని పెంచుకున్నారు. కరీంనగర్ జిల్లా వంగర గ్రామంలో చదువుకుంటున్న రోజుల్లో పాఠశాల కెళ్లే దారిలో కుమ్మరి రామస్వామి మట్టిముద్దతో అనేక ఆకారాలు (పాత్రలు) కళాత్మకంగా తయారుచేయడం చూసి ముగ్ధురాలైంది. పసిమనసులో ఆ దృశ్యం బలంగా పడింది. అలాగే దూదేకుల ఇళ్లలో దూది ఏకేప్పుడు వచ్చే శబ్ద సౌందర్యం వినసొంపుగా ఉండటంతో ఆ 'నాదం' తనలో తెలియని తన్మయత్వాన్ని తట్టిలేపేనని ఆ రకంగా లలితకళల పట్ల తనకు తెలియకుండానే మనసు లగ్నమైందని వాణీదేవి చెప్పారు. తరువాత రోజుల్లో 'సితార' నేర్చుకోవడానికి ఆ ధ్వని ఆమెకు ఉపకరించి ఉంటుంది.

ముఖ్యంగా తన ఊరు వంగర ప్రకృతి మనోహరంగా ఉండటం, రత్నగిరి కొండ ఎంతో స్ఫూర్తిదాయకంగా, సౌందర్య రాశిగా నిలవడం వల్ల తనలో ఎన్నో నూతన భావనలు స్ఫురించేవని ఆమె గుర్తుచేసుకున్నారు. గ్రామంలోని భద్రయ్యతోట ప్రకృతికి పర్యాయపదంగా నిలిచేదని అందులో మిరపతోట పచ్చదనం గాఢమైన ఆకుపచ్చదనంతో పాటు ఎర్రటి మిరపకాయలు, లేతరంగుల్లో మరికొన్ని మొక్కలతో పాటు బంతిపూల మొక్కలు, వాటి పూలు సహజ వర్ణ మిశ్రమానికి చిహ్నంగా కనిపించేదని, ఆ దృశ్యాలు ఇప్పటికీ తనను వెంటాడుతూ, ఉంటాయని ఆమె తన కళాత్మక జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

వంగర చెరువు కట్ట వైపు వెళితే...

చెరువులో సూర్యకిరణాలు పడి మిళమిళ మెరవడం, కదలడం, పొలాల్లో తెల్లటి కొంగలు వాలడం, ఆహారం కోసం వెతకడం..ఆ పరిసరాల ఆ గొప్ప సౌందర్యం తన మనసుపై బలమైన ముద్ర వేసిందని ఆ రకంగా చిత్రకళలో ప్రకృతే తనకు తొలి గురువుగా మారిందని, అందమైన ఆ పల్లెసీమ ప్రభావం తన మనసుపై బలమైన ముద్ర వేసిందని ఆమె గుర్తు చేసుకున్నారు. అనంతరం ల్యాండ్ స్కేప్స్ ప్రతిభావంతంగా గీయడానికి బీజం చిన్ననాడే అలా పడిందని అర్థమవుతోంది. చిత్రకళల నైపుణ్యం సంపాదించడానికి 'సాధన' ఎంతో ముఖ్యమని అందుకే **సాధనమున పనులు సమకూరు ధరలోన...**అన్న మాట పుట్టిందని, తనవరకొస్తే నాన్న (పి.వి) ప్రోత్సాహం ఎక్కువ ఉండటం వల్లనే రాణించగలిగానని ఈ ''క్రెడిట్'' అంతా నాన్నకే దక్కుతుందని ఆమె వినయ పూర్వకంగా చెప్పారు.

''మా బాపు (పి.వి) లైబ్రరీలో హౌటు డ్రా...హౌటుపెయింట్ లాంటి పుస్తకాలు ఉండేవి వాటిని చూసేదాన్ని, వంగర నుంచి హైదరాబాద్ వచ్చాక ఇంటికి కొండపల్లి శేషగిరిరావు, పి.టి.రెడ్డి లాంటి ప్రముఖ చిత్రకారులొచ్చేవారు. నేను గీసిన బొమ్మలను బాపువారికి చూపేవారు. కొండపల్లి శేషగిరిరావు ఆ బొమ్మలను చూసి అభినందించారు. దాంతో నాలో కొంత ధైర్యం వచ్చింది. స్కూల్లో డ్రాయింగ్ టీచర్ కూడా నా బొమ్మలు చూసి పొగడటంతో నాలో చిత్రకళపై అనురక్తి మరింత పెరిగింది'' అని వాణీదేవి తొలినాళ్ల గూర్చి గుర్తు చేసుకున్నారు.



అలా ప్రారంభమైన చిత్రకళ యాత్ర ప్రపంచ వ్యాప్తంగా సాగడం గమనార్హం. పెయింటింగ్ విశ్వవ్యాప్త భాష అని, మనోభావాల వ్యక్తీకరణకు అందమైన వేదిక అని ఆమె మనసా, వాచా నమ్మి అనేక చిత్రాలు సృజించి 15కు పైగా సోలో ఎగ్జిబిషన్లను భారతదేశంలో ఏర్పాటు చేశారు. అమెరికాలోని వాషింగ్టన్ డి.సి.లో గాంధీ మెమోరియల్ సెంటర్ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ''సారే జహాసే అచ్చా'' అనే థీమ్‌పై చిత్రాలను ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. సురభి వాణీదేవి వాటర్‌కలర్స్‌తో ల్యాండ్‌స్కేప్స్ గీయడంలో చేయి తిరిగిన కళాకారిణి. ఆ మాధ్యమం తనకెంతో ఇష్టమని అందులో ఎన్నో చిత్రాలు గీశానని ఆమె తెలిపారు. ఆమె చిత్రాల్లో ఆధ్యాత్మిక పరిసరాలు అధికంగా కనిపిస్తాయి. తొలిరోజుల్లోనే భగవద్గీతను అధ్యయనం చేసి బొమ్మలు గీసే అవకాశం రావడం వల్ల, ఆధ్యాత్మిక కోణం ఆమెలో బలపడింది. అలాగని తనకు ఇష్టమైన ల్యాండ్ స్కేప్స్ గీయడం ఆపేయలేదు. అద్భుతమైన రీతిలో పరిసరాలను తన మాధ్యమంలో ఎంతో కళాత్మకంగా ప్రజల కళ్లముందుకు తెచ్చారు. ఆమెకు మాత్రమే సాధ్యమైన శైలిలో ప్రకృతి అందాలను కాన్వాసుపైకి తీసుకొచ్చారు. చెట్లు-చేమలు, చెరువులు-బాటలు, కొండలు-కోనలు, రహదారులు- రమ్యమైన తటాకాలు, గుడిశెలు-ఇళ్లు, పురాతన కట్టడాలు- ఆకురాలు కాలపు సోయగాలు, జలపాతాలు- జలరాశులు...సముద్ర ఘోష, మోడుబారిన చెట్లు, వసంత రుతువు ఆగమనం-పచ్చదనం, ప్రకృతి రమణీయత, కొలను దగ్గర పడవ- పొలాల మధ్యన తాటిచెట్లు ఒడ్డున గడ్డి పూలవనం. ఇట్లా ఒకటేమిటి తన మనోనేత్రంతో దర్శించిన అనేక దృశ్యాలను తైలవర్ణ చిత్రాలుగా, వాటర్ కలర్స్ చిత్రాలుగా, డ్రాయింగ్స్‌గా ఆమె గీశారు. ఆమె చిత్రాల్లో తెలంగాణ పల్లెతనం ప్రస్ఫుటంగా కనిపించడం ఓ ప్రత్యేకత. బతుకమ్మను సైతం ప్రతిభావంతంగా చిత్రించి తెలంగాణ సంస్కృతిని తన మాధ్యమంలో సజీవంగా నిలిపారు. స్టిల్ లైఫ్ బొమ్మల్లోనూ తాను పెరిగిన హైదరాబాద్‌కు చెందిన వస్తువులు, పరిసరాలు అధికంగా కనిపిస్తాయి. చిత్రకళకే అంకితమైన సురభివాణి దేవీ తన సృజనాత్మకతను బోధనారంగంలోనూ ప్రదర్శిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీని సురభి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిర్వహిస్తూ వేలాదిమంది చిత్రకారులను సమాజానికి అందిస్తున్నారు. 1952 ఏప్రిల్1న జన్మించిన వాణీదేవి తన జీవిత ప్రయాణమంతా కళాత్మకత-సృజనాత్మకత కళల చుట్టూనే సాగుతోంది. ఎందరో ప్రముఖుల సాన్నిహిత్యంలో ఎన్నో విషయాలను గ్రహించి వాటిని కొత్త తరాలకు బట్వాడా చేస్తున్నారు. తన తండ్రి పి.వి. వెంట అనేక దేశాలు సందర్శించి అక్కడి కళల గూర్చి తెలుసుకుని అందులోని మేలిమిని అన్వయించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారు. స్పాట్ పెయింటింగ్, ల్యాండ్ స్కేప్స్ అంటే ఇప్పటికీ ఇష్టపడే వాణీదేవి హైదరాబాద్ లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్‌ఆర్ట్స్ కాలేజీలో పట్టా పొంది అనంతరం అక్కడే బోధకురాలిగా పనిచేశారు.




మహా సముద్రం లాంటి ఈ చిత్రకళా రంగంలో ఎవరిశైలి వారిదేనని ఆమె విశ్వసిస్తారు. లైన్, ఫాం, రంగుల మేళవింపు, భావం, శైలి, వ్యక్తీకరణ, వ్యాకరణం అన్నీ స్వతఃసిద్ధంగా రావలసిన అంశాలేనని ఆమె అభిప్రాయం. ఇటీవల ప్రచురించిన 'కళా సుధ' అన్న పుస్తకంలో సురభి వాణీదేవి కళాహృదయం ఆమె అధిరోహించిన ఎత్తులు, అందుకున్న శిఖరాలు, పి.టి.రెడ్డి, స్వామినాథన్ అరవింద గురు లాంటి కళావిమర్శకుల, తోటి సీనియర్ చిత్రకారుల ప్రశంసలు పొందుపరిచారు. చిత్రకళారంగంలో తొలిగురువులైన నరేంద్రరామ్ శ్రీవాస్తవ, కొండపల్లి శేషగిరిరావు, పండిట్ పాండు రంగపరాల్, ఆత్మారామ్ లాంటి వారిని గుర్తుచేసుకున్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉగాది పురస్కారం, రాజమండ్రిలోని చిత్రకళానికేతన్ వారి అవార్డు లాంటివి ఆమె ఎన్నో అందుకున్నారు. ఆ రకంగా ఆమె సంపూర్ణ చిత్రకారిణి అయ్యారు.

- ఉప్పల నరసింహం
9985781799

జానపదుల వేదనా సందర్భాలు

స్త్రీ అవమానాన్ని సహించలేదు. జానపదుల్లో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండడం గమనించవచ్చు. అందువల్ల అత్తాకోడళ్లు, వదిన ఆడబిడ్డలు, తోడికోడళ్లు కలిసి ఒకే ఇంట్లో ఉండవలసి ఉంటుంది. స్త్రీ తోడికోడళ్ల వల్ల, సవతుల వల్ల కలిగే అవమానాన్ని భరించలేదు. అవమానం అనగానే క్రింది సామెత చెప్పుకొని తీరాలి. ''మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు ఏడ్చిందట''. సమాజంలో గౌరవంగా బ్రతికే ఇల్లాలు ఇతరుల కంట పడకుండా భర్త దండించినా ఓర్చుకోగలదు. అదే నలుగురి ఎదుట జరిగితే అవమానాన్ని తట్టుకోలేదు. సవతి ముందు అవమానాన్ని పొందడాన్ని అసలే సహించదు. శివుడు గంగను వివాహమాడిన విషయం పార్వతికి తెలియకుండా జటాజూటంలో ఉంచుకొని ఏమి ఎరుగని వానివలె నటిస్తుంటాడు. ఒకరోజు శివుడు, పార్వతి పాచికలాడుతుండగా పార్వతి పదే పదే ఓడిపోతుంటుంది. ఆ సమయంలో శివుని జటాజూటం నుంచి గంగ తానోడి పోతుండే సన్నివేశాన్ని చూడడం తనను పరాభవించినట్లుగానే భావించి కోపంతో-



''ఎవతివే శంభుని శిరమెక్కి గూచుంది.
గయ్యాలి నాసవితి కళ్లు గానకను
గళ్లు గానక నీయంత గయ్యాలిని గాను
ఆకాశగంగను గౌరమ్మ నేను
గంగవైతే నీవు గగన మందుండకను
మగని శిరమెక్కుట తగునటే గంగా
మగని మాటకు నేను మారు చెప్పకను
ఉండమన్న చోట ఉంటాను గౌరి
అట్టయితే మారు మాటాడక నువ్వు
వదిగండు ఒక మూల వయ్యారి గంగ''1

క్రింది గేయంలో కొడుకు చెడ్డ ప్రవర్తన వల్ల తల్లి అవమానం పొందినట్లు తెలుస్తుంది. సాటివాళ్లలో ముఖ్యంగా దాయాదుల ముందు వేలెత్తి చూపించుకోవడానికి అసలు ఇష్టపడరు.

''కోరమీసం పెట్టుకోని నున్నంగా తలదువ్వి
కట్టా మీద పోతా ఉంటేరో.....
నా కొడుకా మానంది రెడ్డీ
నిను కలకటేరు అనుకొంటిరో
సారాయి తాగమరిగి సంసారం కొల్లగొట్టి
దాయాదుల పోరులో నువు చెప్పకుండా పోతివిరో
నా కొడుకా మానంది రెడ్డీ
నేనగుమానం పాలయితినో''2

కొడుకు చెయ్యరాని నేరాలు చేసి, సంసారాన్ని పాడుచేసి, దాయాదుల ఎదుట పోలీసులచే బేడీలు వేయబడితే తల్లికి అవమానం గాక మరేమి దక్కుతుంది.

- డా॥ కస్తూరి వెంకట రమణమ్మ
7093239555


కరికాల భక్తుల గౌరవ అతిథిలు

వీరభద్రీయులు

వారు, కాలికి గజ్జెకట్టి చేతితో ఖడ్గం పట్టి నుదిటికి విభూది రేఖలు ధరించి వీరావేశంతో...'' అల్లల్లభరా.. .అశ్చరభశరభా...!!'' అంటూ దండకాలు చదువుకుంటూ వీరభద్రస్వామిని కీర్తిస్తూ వీరనాట్యం చేస్తుంటే ఎంతటివారికైనా ఒళ్లు గగుర్పాటు పుట్టాల్సిందే!! కత్తిసాములు చేస్తూ వీరనాట్యం చేస్తుంటే ఆ ప్రాంతం అంతా చిన్నపాటి భూకంపం కనిపించాల్సిందే!! రక్షణకే గాక మనోధైర్యానికి ప్రతీకలుగ నిలిచే ఈ సంచార జాతులవారే ప్రస్తుతం -'వీరభద్రీయులు''గా పిలవబడుతున్న ఒకప్పటి ''వీరముష్టులు''.

సంచారజాతులుగా, వీరశైవ తెగలకు చెందిన కరికాలభక్తులు, దేవాంగులు. కులాల యొక్క ''ఆశ్రిత కులం''గా చెప్పబడే ఈ ''వీరముష్టులు'' పూర్వం శారీరక బలంతో కర్రసాములు, కత్తిసాములు చేస్తూ విష్ణువర్ధనుడి కాలం నుంచే ప్రధాన సైనికులు సేవకులుగ రక్షణదళ సభ్యులుగా వుండేవారని చారిత్రక కథల ద్వారా తెలుస్తుంది.

అంతేగాక ఈ 'వీరముష్టు'ల ప్రస్థావన శివపురాణంలో కూడా వుండడంతో ఈ జాతి ప్రాచీనత మరింత పెరిగింది. దక్ష ప్రజాపతిని సంహరించడం కోసం ఉగ్రావకారుడైన పరమేశ్వరుని కుడితలభాగపు జటం (తలవెంట్రుకలు) నుండి వీరావేశపు సమయంలో పుట్టిన వీరభద్రుడు తండ్రి ఆజ్ఞ ప్రకారం దక్షుణ్ణి సంహరించడానికి తన యొక్క పది ఆయుధాలైన గద్దగోరు, విల్లు, వీరఫలక, గండ్రగొడ్డలి, గజమాల, పెద్ద ఫిరంగి, డాలుకత్తి, దశాయుధంలతో బయలుదేరతాడు. తన సహజగుణమైన వీరత్వపు ఉగ్రరూపంతో కదిలివెళుతున్న వీరభద్రుడు ''సద్దాద్రి పర్వతం'' చేరగానే ఆవేశ అంతిమస్థాయి అయిన స్వేదం చెమట బిందువుల రూపంలో నేలమీద పడగ వాటి నుంచి ఉద్భవించినవారే ఈ'వీరముష్టీయులు'' అని వారిని వీరభద్రుని మానసపుత్రులుగ కీర్తిస్తుంటారు. దక్షుని సంహారం కోసం వీరభద్రుని ప్రతినిధులుగా వెళ్లిన వీరముష్టులు దక్షుని ప్రధాన సైనికులైన అల్లల్లభీరుడు, శరభడులను తమదైన మనో బలం వీరత్వంతో సంహరిస్తారు. అలా సంహరించబడ్డవారిలో ఒకడైన పక్షిజాతీయుడు ''శరభడు'' అనంతర కాలంలో శివ వరప్రసాదంతో తన రెక్కలు పూజించబడే వరం పొందుతాడు. అదే ప్రస్తుతం సంక్రాంతి పండగల్లో భాగంగా చేసే ''ప్రభల జాతర''.



అలా దక్షసంహారంలో వీరభద్రునికి ప్రధాన కారకులుగ వున్న వీరముష్టీయులు అనంతరకాలంలో శక్తికి ప్రతిరూపాలుగా వీరత్వానికి చిరునామాలుగ నిలిచి సైనికులకు ప్రధాన సహచరులుగ పనిచేశారు. కలియుగాది 642 సంవత్సర కాలానికి చెందిన పెనుగొండ ప్రాంత వైశ్యవీరమాత ''వాసవికన్యకాపరమేశ్వరీ'' ఆత్మార్పణ సమయంలో కూడా వీరముష్టీయులు ప్రస్థాపన వినిపిస్తుంది. వాసవిని వలచిన విష్ణువర్ధనునికి ఆమె ఆత్మార్పణ విషయం ధైర్యంగా మునుముందుగా వారే చెప్పినట్టు అనంతరకాలంలో వాసవీమాత వీరగాధలను పాటల రూపంలో ప్రచారం చేయడంలో వైశ్యుల ఆశ్రిత కులస్తులైన ''గంగకావిళ్లు'' వారికి తోడుగ వాళ్లు వున్నారని అందుకు ప్రతిఫలంగా వైశ్యులు నేటికి ''వీరముష్టి'' వారికి నగదు రూపంలో సంతర్పణాలు ఇస్తుంటారు. అందులో భాగంగానే వారి జన్మకారకులైన శివ వీరభద్రుల ఆరాధవంశాలైన లింగాయత్తులుగా పిలవబడే కరికాల భక్తులు, దేవాంగులు కులాల యొక్క వంశచరిత్రలు ప్రచారం చేస్తూ నాటి మౌఖిక సాహిత్య కాలంలో ఆయా జాతుల వార్కి గురు సమానులైన గౌరవ అతిథులుగ, ఆశ్రిత కులస్తులుగా పరిగణించబడ్డారు.



వీరశైవ జాతీయులైన 'కరికాల భక్తులు' 'వీరముష్టి'కి తమ ఇంట ఆతిథ్యం ఇవ్వడం అదృష్టంగా భావిస్తారు. వీరముష్టికి ఆతిథ్యం ఇచ్చేరోజు ఇంటిని శుభ్రం చేసి దంపతులు అభ్యంగన స్నానం చేసి మాంసాహారంతో కూడిన నవరుచులు ఆహారపదార్థాలు వండి తొలి భోజనం భక్తితో వడ్డిస్తారు, భోజనానంతరం సంతృప్తుడైన వీరముష్టికి నూతనవస్త్రాలు బహూకరించి అతని ఆశీస్సులు పొందుతారు. అలా పొందిన దీవెనలతో తమ కుటుంబం వృద్ధా చెందుతుందని, గతించిన తమ కుటుంబ పెద్దలు కూడా ఆనందించి తమ తమ విజయాలకు సహకరిస్తారని వీరశైవ కుటుంబీకులు ప్రగాఢంగా నమ్ముతారు.

వీరశైవ కులస్తుల ఆశ్రిత కులంగా చెప్పబడే నాటి వీరుముష్టులు నేటి వీరభద్రీయులు ప్రస్తుతం తమ జన్మకు కారకుడైన వీరభద్రస్వామి సేవలో తరిస్తూ స్థిరనివాసులై జీవిస్తున్నారు. వీరశైవ జాతీయులు పవిత్రంగా భావించే ''వీరభద్రుని సంబరాలు'', వివాహాలలో మగపెళ్లివారు మొదటగా చేసుకునే '' దీపారాధనం''-లో వీరభద్రుని పూజకు, కుటుంబంలో కన్నెత్వంతో మరణించి వీరభద్రునిలో ఐక్యం పొందిన వారిని గుర్తుచేసుకుంటూ చేసే కోపులు వంటి సందర్భాల్లో ఈ వీరభద్రీయుల పాత్ర ప్రధానంగా వుంటుంది. నుదుట విభూది కాలికి గజ్జెలు రంగురంగుల వస్త్రాలు ధరించి తంబాస, బుుంజ,తాస, వీరణం, సన్నాయి, డోలు, రామడోలు వంటి వాయిద్యాలతో శివుణ్ణి వీరభద్రుడిని కీర్తించే ''దండకాలను'' రాగతాళయుక్తంగా గానం చేస్తూ వీరత్వపు నృత్యాలు చేస్తూ నాటి వీరభద్రుని వీరత్వాన్ని ఉగ్రరూపాన్ని ప్రత్యక్షంగా చూపిస్తుంటారు. సంబరాల సమయంలో అగ్ని గుండాల్లో నేతిబట్టలపై నడవడం, కంఠానికి నాలుకకు శూలాలు గుచ్చుకోవడం లాంటి సాహస కార్యాలు అతిసహజంగా చేయడం వీరి ప్రత్యేకత.

పురాణ- చారిత్రక కాలాల్లో ప్రధాన భూమిక పోషించిన ''ఈ వీరభద్రీయులు'' నేటి యాంత్రిక కాలంలో అన్ని ప్రాంతాల్లో వున్నా కొన్ని ప్రాంతాలకే తమ కులవృత్తిని



పరిమితం చేసుకుని అస్తిత్వ పోరాటం చేస్తున్నారు. నాడశక్తికి ప్రతిరూపాలుగ పనిచేసినవారు నేడు మనుగడ కోసం శక్తిహీనులై ఎదురు చూస్తున్నారు. ఆశ్రిత కులాలు అంతరించి పోతున్న నేటికాలంలో వీరముష్టీయుల ''గౌరవ అతిథి'' పాత్ర కూడా కనుమరుగుగా అయిపోతుంది. అడప దడప చేసుకునే వీరభద్రుని సంబరాలు పెళ్లిళ్లలో జరిపే దీపారాధనల్లో వీరముష్టీయులు లేకుండానే సంబంధిత కుటుంబాల పేర్లతో కార్యక్రమాలు కానివ్వడంతో వీరు కులవృత్తులు వదిలి పొట్టకూటికోసం చిరువ్యాపారులుగా మారిపోతున్నారు. అయిన తమ జాతికారకుడైన వీరభద్రుని ఆరాధన- సంబరాలు మరవకుండా తమ జాతి సంస్కృతిని పాడుకుంటూ జీవిస్తున్న వారిని ప్రభుత్వాలు చేరదీసి, గ్రామీణ కళాకారులకు అందించే సౌకర్యాలు అందిస్తే సముచితంగా వుంటుంది. అంతరించిపోతున్న ఈ ''వీరముష్టి'' జాతిని ఆదరించాల్సిన బాధ్యత అటు ప్రభుత్వాలతో పాటు ఇటు వీరశైవ జాతీయులకు వుంది. ఆ దిశగా మార్పు రావాలని కోరుకుందాం.

- డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
7729883223



వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరో హీరోయిన్లుగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్ 2' (సంక్రాంతి అల్లుళ్ళు). ఈ చిత్రం సంక్రాంతికి విడుదలైంది. విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ మొత్తం పాల్గొంది. వేదికపై చిత్రబృందంతో పాటుగా వెంకటేష్ నృత్యం చేసి అలరించారు.

ఏడాది బాగా గడిచింది

-నటుడు నరేష్



ఒక్క హిట్ సినిమా దక్కుతుందా అని ఆశించిన రోజుల నుంచి వరుస విజయాలు సాధిస్తున్న సమయానికి చేరుకున్నానని అంటున్నారు నటుడు నరేష్. ఆదివారం నరేష్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా పాత్రికేయులతో తన నట ప్రయాణం గురించి చెప్పారు. ఆయన మాట్లాడుతూ...జయాపజయాలకు అతీతంగా ముందుకు వెళ్తున్నాను. ఎన్టీఆర్ సహా ఏ నటుడికైనా ఎత్తు పల్లాలు సహజం. నేను ఏ ఒక్క తరహాకు కట్టుబడకుండా పాత్రలు చేయాలని అనుకుంటున్నాను. ఈ విషయంలో ఎస్వీ రంగారావు గారు నాకు ఆదర్శం. ఆయన చేసిన విభిన్న పాత్రలు ఎవరూ చేసి ఉండరు. ఒకప్పుడు ఒక్క హిట్ సినిమా దక్కితే చాలు అనుకున్నాను. నాలుగేళ్లుగా వరుసగా విజయాలు దక్కుతున్నాయి. గతేడాది పదీ పన్నెండు సినిమాల్లో నటిస్తే 8 చిత్రాలు విజయం సాధించాయి. శతమానం భవతి, రంగస్థలం, మహానటి, అరవింద సమేత వీర రాఘవ లాంటి చిత్రాల్లో మంచి పాత్రలు దక్కాయి. నిర్మాతలు, దర్శకులు నాపై పెట్టుకున్న నమ్మకం నిజమవుతోంది. గతేడాది నా నట జీవితంలో గొప్పగా గడిచింది. 47 ఏళ్లు నటుడిగా అనుభవం వచ్చింది. పెద్ద సినిమా చిన్న సినిమా అని చూడకుండా మంచి పాత్ర దొరికితే చేస్తున్నాను. పారితోషికం విషయంలో పట్టింపులు లేవు. వివాదాలకు అతీతంగా ఉండటం నాకు కలిసి వస్తోంది. మళ్లి జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ హీరోగా ఓ సినిమా చేస్తున్నాను, ఫణిరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంది. ఇవి కాక మరో ఆరు చిత్రాల్లో నటిస్తున్నాను. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లో ఒక సభ్యుడిగా నా వంతు పరిశ్రమకు సేవ చేస్తుండటం సంతోషాన్నిస్తోంది. అన్నారు.



అదే నా ఆశ..!

చెలియా, నవాబ్, సమ్మోహనం, అంతరిక్షం..ఇలా తెలుగు ప్రేక్షకులను వరుసగా పలకరిస్తోంది అందాల తార అదితీరావ్ హైదరీ. ఆమె నటించిన పర భాషా చిత్రాలైనా తప్పకుండా టాలీవుడ్‌లోకి అనువాదమవుతున్నాయి. తెలుగమ్మాయే అయిన అదితీ ముందు బాలీవుడ్ నుంచి కెరీర్ ప్రారంభించి, కోలీవుడ్ చిత్రాల్లో పేరు తెచ్చుకుని తెలుగు తెరకు చేరింది. ఇప్పుడు అన్ని దక్షిణాది భాషల్లో నటిస్తోంది. తన వరకు భాషలకు అతీతంగా మంచి చిత్రాల్లో భాగమవడం అనేదే ముఖ్యమంటోందీ తార. కాలదోషం పట్టని చిత్రాల్లో భాగమవ్వాలన్నది తన ఆశగా చెప్పుకుంటోంది. అదితీ మాటల్లో వింటే...మనం కొన్ని సినిమాలు పదే పదే చూస్తుంటాం. ఎన్నిసార్లు చూసినా అవి విసుగు తెప్పించవు. వాటికి కాలదోషం పట్టదు. అలాంటి చిత్రాలు చేయాలనుకుంటాను. నేను దర్శకుల నటిని. వాళ్లు ఏం చెబితే అది చేస్తుంటాను. నాకు నటించడం తెలుసని అనుకోవడం లేదు. పాత్రకు తగినట్లు ప్రవర్తిస్తుంటాను. ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నాను. నేను గౌరవించే వాళ్లతో పనిచేసినప్పుడు నా నిజమైన ప్రతిభను వాళ్లు వెలికితీస్తారు. గొప్ప దర్శకులు, చిత్ర బృందం గుర్తుండిపోయే సినిమాలు చేయగలరు. నాకు నటనంటే పిచ్చి ప్రేమ. సెట్‌లో వదిలితే రెండు రోజులు విశ్రాంతి లేకుండా నటించగలను. అని చెప్పింది.



తమన్నా

అసాధారణ మహిళ

బాలీవుడ్ హిట్ సినిమా 'క్వీన్' ఆధారంగా తెలుగులో రూపొందుతున్న చిత్రం 'దట్ ఈజ్ మహాలక్ష్మి'. తమన్నా టైటిల్ పాత్రధారిణి. సాధారణ యువతి నుండి అసాధారణ మహిళగా ఎలా ఎదిగింది అనే కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేశారు. ఇటీవలే టీజర్ విడుదల చేశారు. దీనికి మంచి స్పందన వచ్చిందని చిత్రబృందం తెలిపింది. అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. మైఖెల్ ట్యాబ్యురియస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. టైజాన్ ఖొరాకివాలా ఈ చిత్రానికి సమర్పకులు. మను కుమరన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుతున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు.

తమన్నా, సిద్దు జొన్నలగడ్డ నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: పరుల్ యాదవ్, పంకజ్ కపూర్, కే.వెంకట్రామన్, మనోజ్ కేశవన్ లైగర్, త్యాగరాజన్.

నిను వీడని నీడను నేనే

శత్రువుతో యుద్ధం చేస్తే గెలుస్తాం. అదే తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే ఎలా ఉంటుంది?. అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుడు ఎలా బయపడ్డాడు అనే కథాంశంతో 'నిను వీడని నీడను నేనే' పేరుతో సినిమా రూపొందుతోంది. ఇందులో సందీప్ కిషన్ కథానాయకుడు. ఎమోషనల్ హారర్ చిత్రమని, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని కథాంశమని సందీప్ చెప్పారు.

ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. దయా వన్నెం, విజి.సుబ్రహ్మణ్యన్ నిర్మిస్తున్నారు. ఒకేసారి తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తున్నారు. చిత్రీకరణ చివరిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని అనీల్ సుంకర విడుదల చేయనున్నారు.

దర్శకుడు మాట్లాడుతూ "ఇంతవరకు ఎవరూ టచ్ చేయని వైవిధ్యమైన కథాంశంతో తీస్తున్నాం. మనిషి తన నీడతోనే యుద్ధం చేయాల్సిన పరిస్థితి వస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో ప్రధానాంశం. ఈ చిత్రం చివరి షెడ్యూల్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది" అని చెప్పారు.

"ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని" నిర్మాత దయా పన్నెం తెలిపారు. సందీప్ కిషన్, అన్యసింగ్, పోసాని కృష్ణమురళి, మురళి శర్మ, వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ, పూర్ణిమ భాగ్యరాజ్, ప్రగతి నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రమోద్ వర్మ, సంగీతం: తమన్.



సందీప్ కిషన్
అన్యసింగ్

మళ్లీ కలిసి నటిస్తారా?

విశ్వనటుడు కమల్ హాసన్, విక్టరీ వెంకటేష్ మరోసారి కలిసి నటిస్తారని సమాచారం. గతంలో వీరిద్దరు కలిసి 'ఈనాడు' (2009) చిత్రంలో నటించారు. తాజాగా వీరిద్దరితో శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుందని తెలిసింది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, బ్రహ్మోత్సవం చిత్రాల ఫేమ్ శ్రీకాంత్ అడ్డాల కొంత విరామం తర్వాత కమల్, వెంకటేష్‌తో సినిమా ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించే చిత్రానికి తాను దర్శకత్వం వహిస్తున్నట్టు శ్రీకాంత్ అడ్డాల వెల్లడించారు ఈ సినిమాకు 'కూచిపూడి వారి వీధి' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.



కమల్ హాసన్, వెంకటేష్

గేమర్ ట్రైలర్ ఆవిష్కరణ

నూతన తారాగణంతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'గేమర్'. ఈ సినిమా ట్రైలర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ "చిన్న సినిమాలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వంపైనా, సమాజంపై ఉంది.కొత్త టాలెంట్ రావాలంటే చిన్న నిర్మాతలను ప్రోత్సహించాలి. తద్వారా గ్రామాల్లో ఉన్న వారికి అవకాశాలు దక్కుతాయి. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుంది" అని అన్నారు. దర్శక నిర్మాత రాజేష్ మాట్లాడుతూ "యాక్టింగ్ అకాడమీ ద్వారా నటీనటులకు శిక్షణ ఇవ్వడంతో పాటుగా అవకాశం ఇస్తున్నాను. ఈ సినిమా ద్వారా శ్రనీత్ రాజ్, కల్యాణి పటేల్ పరిచయం అవుతున్నారు. అనిరుధ్, నరేందర్, అల్తాఫ్, సింధు నిహా ఇతర పాత్రల్లో నటించారు. ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటూ ఆకట్టుకుంటుంది. ఫిబ్రవరి ఒకటవ తేదీన సినిమాను విడుదల చేస్తున్నాం" అని చెప్పారు.





కోరిక పెద్దదే

అంకిత లోఖండే...బుల్లితెర నుంచి వెండితెరకు చేరిన తార. ఈ ముంబై భామ పరిశ్రమకు రాక ముందు రాష్ట్రస్థాయి బ్యాట్మింటన్ క్రీడాకారిణి. ఓ టాలెంట్ షో ద్వారా అంకిత లోఖండే ప్రతిభ అందరికీ తెలిసింది. ఏక్తా కపూర్ నిర్మించిన పవిత్ర రిష్తా అనే ధారావాహికలో అవకాశం దక్కించుకున్న అంకిత...ఏళ్లపాటు సాగిన ఆ సీరియల్‌తో బాగా పేరు తెచ్చుకుంది. ఈ సీరియల్‌లో అంకిత సరసన నటించాడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్. ఇతనితో అంకిత ఆరేళ్ల ప్రేమాయణం నడిపి ఇటీవలే విడిపోయారు. ప్రస్తుతం బిలాస్‌పూర్‌కు చెందిన ఓ వ్యాపారవేత్తతో ప్రేమలో ఉంది అంకిత. ఇటు బాలీవుడ్‌లోనూ అవకాశాలు అందుకుంటోంది. ఆమె నటించిన చిత్రం మణికర్ణిక త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మంచి క్యారెక్టర్ చేసింది అంకిత. దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తన అభిమాన దర్శకుడని, ఆయన దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ సరసన నటించాలని ఉందని పెద్ద కోరికే బయట పెట్టిందీ నాయిక. ఇక ప్రేమా పెళ్లి గురించి కూడా తన అభిప్రాయాలు తెలిపింది. అంకిత మాట్లాడుతూ....గతంలో పద్మావత్ చిత్రంలో నేను నటించాల్సి ఉంది. కానీ తృటిలో అవకాశం పోయింది. సంజయ్ లీలా భన్సాలీ నా అభిమాన దర్శకుడు. ఆయన దర్శకత్వంలో సల్మాన్ సరసన నటించాలని ఉంది. నా వ్యక్తిగత జీవితంలో గతంలో ఉన్న ఆలోచనలు మారాయి. ఒకప్పుడు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన బలంగా ఉండేది. ఇప్పుడు మారిపోయింది. ఎక్కువ సినిమాలు చేయాలనుకుంటున్నాను. ప్రేమ పంచేకొద్దీ పెరుగుతుంటుంది. అని సెలవిచ్చింది.



పల్లెటూరి నేపథ్యంలో

సీనియర్ నటి అన్నపూర్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. మాస్టర్ రవితేజ టైటిల్ పాత్రధారి. నర్రా శివనాగేశ్వర రావు దర్శకత్వంలో ఎంఎన్ఆర్. చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను అమరావతి పరిసర ప్రాంతంలోని ఓ గ్రామంలో చిత్రీకరించారు.

"పల్లెటూరిలో ఎవరికి ఏం జరిగినా రచ్చబండ పంచాయతీ దర్బార్‌లో పెద్ద దిక్కు అయిన అక్కినేని అన్నపూర్ణమ్మ అనే ముఖ్యపాత్రలో నటి అన్నపూర్ణ కనిపిస్తారు" అని చిత్ర నిర్మాత చెప్పారు. "ఆమెను ధీటుగా ఎదుర్కొనే పాత్రలో బెనర్జీ నటిస్తున్నారు. ప్రస్తుతం మొదటి షెడ్యూల్ పూర్తిచేశాం. ఈ చిత్రంలో అర్చన హీరోయిన్‌గా నటిస్తోంది" అని ఆయన తెలిపారు. ఇతర పాత్రల్లో జీవా, రఘుబాబు, రఘు, తాగుబోతు రమేష్, సుమన్ శెట్టి, శ్రీహర్ష, అదుర్స్ సాయి, రమాప్రభ, శ్రీలక్ష్మి, ప్రభ తదితరులు నటిస్తున్నారు.

దోషం ఎవరికి!

కిషోర్, సన హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'దోషం'. "నీకా... దేవుడికా..." అనేది ఉప శీర్షిక. రఘు గోపసాని స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా పూర్తిచేశారు.

దర్శక, నిర్మాత మాట్లాడుతూ "మనిషిని పట్టి పీడిస్తున్న దోషాల తలలను కోయడానికి త్రిశూలంగా దూసుకొస్తున్న దోషం రాబోతోంది. ఇందులోని నటీనటులు నెల్లూరులోని రామాపురం వాస్తవ్యులు. అందరూ చక్కగా నటించారు. చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం "అని చెప్పారు.

ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ రవిరామ్, ఛాయాగ్రహణం: సంకర్ కేసరి.



సన